UNIVERSAL
LIBRARY
OU_204820
UNIVERSAL
LIBRARY

శ్రీ

ముక్తావళీనాటకము.

ఇది

బళ్లారిలోనుండిన డిస్ట్రిక్టు కోర్టువకీలు

"ఆంధ్రనాటక పితామహ" యను బిరుదువహించిన

ధర్మవరము - రామకృష్ణమాచార్యులచేత

రచియింపఁబడి

డి. కె. కృష్ణమాచార్లు, వారిసహోదరులవల్ల ప్రకటింపబడియె.

మొదటి కూర్పు.

చెన్నపురి:

యస్. మూర్తి అన్డ్ కంపెనీవారి

కపాలి ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడియె

1915

(All Rights Reserved for Publishing, Translating and Staging.)

[క్రయము రూ. 1-0-0.]

All Rights Reserved.

Checked 1963   Checked 1965

Checked 1969

Copyright 1915-by D. K. Krishnama Charlu & his brothers. This Book is fully protected by an Indian and foreign Copyright. No one will be permitted to reproduce this book in whole or in part or translate it into any other language or stage it without permission or offer it for sale. A substantial copy of words, ideas contained herein constitutes an infringement of a copyright and notice is hereby given that a suit will be filed in every case or infringement.

కాపీరైటు 1915సం॥ బళ్లారి ధ. కె. కృష్ణమాచార్యులువారితమ్ములు కాపిరైటుదార్లు. ఈపుస్తకము ఇండియాకాపిరైటు చేతను పరకీయమైన కాపిరైటుచేతను సురక్షితమైనది. ఎవరు గాని యీపుస్తకము సంపూర్ణముగాఁగాని యిందొకభాగముగాని తాము వేఱుప్రకటించుటకును మఱియు యొకభాషయందు భాషాంతరీకరించి క్రయమునకిచ్చుటకును, తాము వుత్తరవులేకనే ప్రదర్శించుటకును, హక్కుయియ్యబడదు. ఇందుగల పదములుగాని, భావములుగాని, ఏమాత్రమైన కాపీ చేసినయెడల అది కాపీరైటు నుల్లంఘించినట్లగుటచే అట్టివారు దావాకు పాత్రులగుదురు.



Bellary, D. KRISHNAMA CHARLU,

ANDHRA NATAKA PITHAMAHA,

Born 1853—Died 1912.

శ్రీ

ముక్తావళి నాటకము.

పూర్వకథ.

పూర్వకాలము ఘూర్జరరాజు భూపాలరాజునకు కప్పమిచ్చుచుండి తర్వాత ప్రబలస్థితికి వచ్చినందున ఘూర్జరరాజునకే భూపాలరాజు కప్పమిచ్చునట్లు తటస్థించెను. భూపాల రాజకుమారుఁడైన సోమశేఖరుఁడు మిక్కిలి పరాక్రమవంతుఁడై ప్రబలికప్పమునకు తిరుగుబాటుచేసి ఘూర్జరపురిసేనానియొద్ద కొక బ్రాహ్మణుని పంపియుండెను. వానియొద్ద నున్న లిఖితసాధనములు సాధింపవలయునని సోమశేఖరుఁడే వేషాంతరమున బ్రాహ్మణునితో ఘూర్జరపురికి పోవుటకు ప్రయాణమయ్యెను. ఈసమయమున ఘూర్జరరాజుతనయాంతఃపుర స్త్రీలు మొదలగువారితోఁ గూడ వింధ్యపర్వత ప్రాంతమునకు విహారార్థమునకు పోయి యుండిన కాలమున నాటకము ప్రారంభమగును.

శ్రీ

ఈ నాటకమునందలి ముఖ్యపాత్రలు.

తత్ప్రవేశస్థలములు.

పురుషులు.

చారువర్మ.—ఘూర్జరరాజు ప్రవేశము. అంకము I రంగము. 1-4. అంకము II రంగము. 4.

సునీతి.—చారువర్మ మంత్రి. ప్ర॥ అం॥ I రం 1-4. అం॥ II రం 4.

సువిచారుఁడు.—చారువర్మమంత్రి. ప్ర॥ అం॥ I రం 1-4. అం॥ II రం 4.

నాగకేతుఁడు.—ముక్తావళిని వరియించియుండిన వాఁడు. ప్ర॥ అం॥ II రం 4 అం॥ III రం 4 అం॥ IV రం 1-3 అం॥ V రం 3. (జగంధరుఁడని, బోయయనియు వేషాంతరములు గైకొన్న వాఁడు.)

మీననాథుఁడు.—సోమశేఖరుని పినతండ్రి. ప్ర॥ అం॥ II రం 2-4 అం॥ IV రం 3 అం V రం 3. (బాదరాయణుఁడను యతివేషాంతరముఁ గైకొన్నవాఁడు.)

సోమశేఖరుఁడు.—భూపాలరాజపుత్రుఁడు, కథానాయకుఁడు. ప్ర॥ అం॥ I రం 2-3-4 అం II రం 2-3 అం III రం 5 అం IV రం 3 అం V రం 2-3. (విలాసకుఁడను బ్రాహ్మణ మాణవకవేషమున మెలఁగినవాఁడు.)

చతురవర్మ.—పాండ్యరాజు, కళావతితండ్రి. ప్ర॥ అం III V రం 1-3.

అంగారశర్మ.—(కేరళరాజు) ప్ర॥ అం V రం 3.

మలయదత్తుఁడు.—(వైద్యుఁడు) ప్ర॥ అం IV రం 2-4 అం V రం 3.

వీరసేనుఁడు.—చారువర్మ పుత్రుఁడు, ముక్తావళిసోదరుఁడు. ప్ర॥ అం V రం 3.

అనిమేషుఁడు.—కారాగృహ రక్షకుఁడు. ప్ర॥ అం II రం 2-4.

స్త్రీలు.

ముక్తావళి.—సోమశేఖరుని భార్య, కథానాయిక. ప్ర॥ అం I రం 3-4 అం II 1-2-3 అం III రం 3-6-7-8 అం IV రం 1-2-4 అం V రం 1-2-3. (పురుషవేషమున నీలకేతు నామమున కళావతిచే వరింపబడియుండెను.)

ప్రవాళవల్లి.—ముక్తావళిసఖి. ప్ర॥ అం I రం 3.

నీలాలక.— డిటో ప్ర॥ అం I రం 3 అం II రం 1-4.

చారుహాస.—అనిమేషుని భార్య. ప్ర॥ అం II రం 1.

కళావతి.—చతురవర్మ పుత్రి. ప్ర॥ అం III రం 7-8 అం IV రం 4 అం V రం 3.

ఈనాటకములోని ముఖ్యపాత్రలు.

పురుషులు.

1. సోమశేఖరుడు—భూపాలరాజపుత్రుడు—ఘూర్జర రాజు విరోధి—కథానాయకుడు.

1a. విలాసకుడు—బ్రాహ్మణవేషముననున్న సోమశేఖరుని పేరు.

2. చారువర్మ—ఘూర్జర రాజు.

3. మీననాథుడు—సోమశేఖరుని పిన్నతండ్రి.

3a. బాదరాయణుడు—మీననాథుడు యతివేషము వేసికొన్నప్పుడు కలిగినపేరు.

4. నాగకేతుడు—ఒకరాజపుత్రుడు ముక్తావళి నితనికివ్వవలెనని చారువర్మయుద్దేశించియుండెను.

4a. జగంధరుడు—నాగకేతుడు—కేరళమున చిత్రకారుడుగా నున్నప్పటి పేరు.

5. చతురవర్మ—పాండ్యరాజు—కళావతి తండ్రి.

6. నీలకేతుడు—ముక్తావళి పురుషవేషముననున్నప్పటిపేరు.

7. మలయదత్తుడు—పాండ్యరాజవైద్యుడు.

8. అనిమేషుడు—చారువర్మయొక్క మిత్రుడై సోమశేఖరుని చెరసాల గాచినవాడు.

స్త్రీలు.

1. ముక్తావళి—ఘూర్జర రాజుకూతురు—ఈకథానాయిక - ఈయమ పాండ్యరాజ్యమున నీలకేతు నామమున పురుష వేషమున నుండెను.

2. కళావతి—పాండ్యరాజు కూతురు—ఈమె నీలకేతుని మోహించి పరితాపపడినకన్య.

3. చారుహాస—అనిమేషునిభార్య.

4. నీలాలక, ప్రవాళవల్లి—ముక్తావళి సఖులు.

శ్రీ

ముక్తావళీ నాటకము.

— నాంది —

శా॥ శ్రీలీలాసముఁడై యనాదిలయుఁడై క్షేత్రప్రభావేయుఁడై।
కాలాతిక్రముఁడై యతిప్రథిత సంకల్పైకసంధానతా।
కేళీజాల విశాలతామిత త్రిలోకీ నిత్య సంత్రాణనా।
పాలుండై చను దేవదేవుఁడొసఁగుఁ భద్రంబులశ్రాంతముఁ॥

ప్రథమాఙ్కము-ప్రథమరంగము.

ఘూర్జరరాజగు చారువర్మయాస్థానము.

[ప్ర: చారువర్మ-సునీతి-సువిచారుఁడు.]

చారు—చూచితిరే మంత్రులారా! ఈదురాత్ముఁడగు భూపాల పురాధీశుని కావరము! ఈజాబా వీఁడుమనకు వ్రాయవలయు?

(అనుబంధము 1.)

సునీ—రాజేంద్రా! మనక్షమాగుణమే యిందుకుఁగారణము. ఇంకించుకైనఁ గరుణఁ జూపరాదు.

చారు—భూపాలపురిపై మనమింక దండు వెడలిపోవలయు.

సువి—రాజచంద్రా! ఆలకింపవలయు. తోఁచినయభిప్రాయము చెప్పకుండుట సేవకధర్మమునకు వెలితిగదా? ఇన్నిదినములనుండి మనకు విధేయుఁడైయున్న భూపాలరాజిప్పుడు మమ్ముఁదిరస్కరించుటకుఁ గారణ మూహింతము. ధనగర్వమున నందమా? అందునకాస్పదములేదు. మొన్న వానివిరోధితోఁ గలిగిన సంగ్రామమున కొంత

యో ప్రయమొనరించి నిర్ధనుఁడై యున్నాఁడని వింటిమి. సేనాసామగ్రియందమా! అదియులేదు. ఆయాహవముననే వానికిఁగల యేఁబదివేలసేనలో సగమున కెక్కుడుగా హతమయ్యె. సేనా ధనగర్వములు గాకున్న నింకెయ్యది? నాకుఁజూడ వాని కుమారుఁడు సోమశేఖరుఁడనువాఁడు. నిజధనుశ్చలిత చండకాండప్రకాండ విఖండిత మండలాధిపమండలుండై గండుమీఱియుండువాఁడు. వానిబలమునే వానితండ్రి నమ్మియున్నాఁడని తోఁచుచున్నది. వానివిక్రమము నొకపదియేఁడులక్రిందట జరిగిన యుద్ధముననే మనసైనికు లెఱిఁగిరిగదా? తనసైన్యమంతయు నంతముఁజెందఁ దానొక్కరుఁడై చండమండలాగ్రముధరించి రెండువేలసైన్యము నిండుసాహసమునఖండించె. ఆరెండవనాటియుద్ధమునఁ బరసైన్యమునువంచించి, యనిసేయుచున్నయుభయ వాహినులల్లో సంగరమాడుచుండఁ, బ్రత్యర్థిపురము ప్రవేశించియందున్నసైన్యముం గృపాణమాత్రసహాయుఁడై నఱుమాడి దుర్గముసాధించెననియు వింటిమి. ఇట్టివాని సహాయసంపదగల యాభూపాలాధీశుని మనము చులకనగానెంచరాదు.

కం. పరిపాటిగ యోచింపక
పరికింపక తారతమ్య భంగిఁగనక స
త్వరముగఁ గార్యాకార్యము
లిరవారఁగఁ జేయనెంచు టెందును దగునే॥

పూర్ణాలోచనమొనరింపక యేకార్యమును దుమికిపడి సాధించుట కుద్యమించుట లగ్గుగాదు. ఇది నాకుఁదోఁచిన యభిప్రాయము.

సునీతి—రాజేంద్రా! ఈసువిచారుని యభిప్రాయము నాకేమియుఁ దృప్తికరముగా లేదు. ఈఘూర్జర రాజధానికి భూపాలపురీశుఁ డొక్కఁడుమాత్ర మాంతరితుఁడై యున్న వీనితోనేమని మనమూరకుండవచ్చును? ఏలినవారికిఁదాదృశులు సామంతులు పెక్కండ్రు. ఒకఁడువోయినత్రోన నొండొకఁడువోయిన మారాజ్య మశక్త రాజ్యమై యుపేక్షింపఁబడుఁగదా? సామంతకుంజరములకెల్ల భవద్విక్రమసింహ స్వప్నప్రాయమై యెప్పారవారెల్ల నిదివఱకు భవత్ఖడ్గాంకుశభీతులై భవదాజ్ఞా విశృంఖలాబద్ధులై తలచూపరాకుండనుండిరి. వారెల్ల నీభూపాలునివలెనే తిరుగఁబడి యైకమత్యముగలవారైరేని మనరాజ్యముండునా? ఈసువిచారుఁడు దీర్ఘయోచన మొనరింపకే కార్యమును సలుపఁగూడ దని నుడివె. స్థితికే సంశయమొనరించు నీసందర్భపువేళ యోచనవలని ప్రయోజనమేమి? కుడ్యమున్నఁగదా చిత్రవిలేఖనము? ఆ కుడ్యమే మోపురాయివదలి కంపోత్థంభితముకాఁగాఁ జిత్రమెక్కడిది? దానిఁజక్కఁ జేసికొనుట మానినఁజింతయేల? అది చక్కచేయుటలో గోడకేయపాయముకలిగిన నెట్లనియందురు. కలిగిననుమానె. దానికై యోజనపనిలేదు. ఆ సోమశేఖరుఁడలఘు విక్రమసోమశేఖరుఁడేయయినను నొక్కరుఁడు వాఁడేమిచేయఁగలఁడు. సాహస మొనరింపఁజాలు వాఁడుగాక కార్యము సాధించువాఁడా?

చ॥ మనసున నెక్కుడౌ దురభిమానమదంబడి మేరమీఱఁగా।
ననయము సోమశేఖరుఁడహంకృతి మ్రొఁగనలేకమమ్ముఁదాఁ।
జెనకుట సాహసంబొకటి చెల్లును గాక తలంచి చూడఁగాఁ।
దనకు నెకార్యసాధనము దానికి నైనవగ పేల భూవరా॥

కావున మనము రణయానమే వెడలవలయు.

చారు—సునీతీ! సువిచారా! మీయిరువుర యభిప్రాయములు శ్లాఘ్యములుగానున్నవి. మన మాభూపాలపురీశున కొకకడ నే మనము పంపుదము. వానిదుష్కృత్యముల వానిమోమున వేసి సామోపాయమున వానికిఁగడమాట వచింతము. వానిప్రత్యుత్తర మఁదిలకించి కర్తవ్యము విచారింతము. ఆసోమశేఖరుని విక్రమక్రమములను మున్నె నే వినినప్పుడు నాకత్యంతాశ్చర్యమును, నిర్భరానందమును, దుస్సహసంతాపమును గలుగుచుండె. వానిశక్తివలన నాశ్చర్యము, నిట్టివాఁడు నాకు సామంతుఁడై సహాయుఁడగుఁగదాయని యానందము, వాఁడొకవేళఁ దిరుగఁబాటినఁగంటి నెరసగు నే యను భయమున సంతాపము. నేను భీతిల్లుచున్న ట్లేజరిగినది. అయినను సామవిధానమున వాఁడు నిష్కారణముగాఁ గలహమునకు సాహసింపఁడని తోఁచుచున్నది. ఆజ్ఞాపత్రము వ్రాయింపుఁడు.

శా॥ ఆలోచింపఁగనయ్యెఁగార్యము లమాత్యశ్రేష్ఠులారాదయా
శీలస్వాంతతనూరకుంటిమిఁక నీక్షేమంబుపై నాసలే
కీలాగాడినవచ్చువారమిదె నిన్నే పార్వఁగా నంచు భూ
పాలాధీశునకంత్యశాసనము పంపన్మాకు మేలయ్యెడిన్॥

అదియుండని, మఱచియుంటి. మన సేనానియొద్దకా భూపాలపుర బ్రాహ్మణుఁడు వచ్చి మంతనములాడిపోయిననాటనుండి యాసేనానిపై మీరు కాపుంచియుంటిరే, యీవల వృత్తాంతమేమైనఁదెలిసెనా?

సువి—రాజచంద్రా! నాటనుండి విశేషములేవియు జరుగలేదు. ఆబ్రాహ్మణుఁడు మంతనములాడిపోయినదియొక్కటే. ఇంకను గాలక్రమమునఁ దెలియఁగలదు.

[ప్ర: సేవకుఁడు.]

సేవక—చారువర్మరాజచంద్రా! వింధ్యోపాంతమున నేలినవారి యాజ్ఞమేరకు సామగ్రులన్నియు సమకూర్పఁబడియున్నవి.

చారు—మంత్రులారా! మీరందఱు నాయితముకండు. రేపే వెడలవలయు. ఈవసంతఋతువంతయు మన మందే యుండవలయు. సేవకా! అంతఃపురమున నంచటినిఁ బ్రయాణసన్నాహ మొనరింపుము. ఇంకఁబోవుదము.

(నిష్క్రాం.)

శ్రీ

ముక్తావళీనాటకము.

ప్రథమాఙ్కము. ద్వితీయరంగము.

వింధ్యోపాంతమున నడవి.

[ప్ర: సోమశేఖరుఁడు బోయవేషమున.]

సోము—(స్వ) ఘూర్జరరాజగు చారువర్మ యిట్టి తీవ్రమయిన జాబువ్రాసియున్నాఁడు. ఈజాబున కనుగుణ మైన ప్రత్యుత్తరము వ్రాయకున్న మహాసైన్యముతో నేతెంచి భూపాల రాజ్యము నాక్రమించెద నని వ్రాసియున్నాఁడు. నామిత్రుఁ డగు బ్రాహ్మణుఁడు వానిసేనానితో మాటలాడివచ్చియున్నాఁడు. కొంతద్రవ్య వ్యయముమాత్రము కలిగెనా యీ ఘూర్జరరాజే భూపాలరాజునకుఁ గప్పములిచ్చు చుండిన లిఖితసాధనముల గ్రహింపవచ్చును. అప్పుడుచారువర్మతో సకారణమైన వాదమున కవకాశముండును. నేనే పోయి యాసేనానితో మాటలాడియే తెంచెదను.

[ప్ర: బ్రాహ్మణుఁడు సుఖోక వేషమున.]

సోమ—భయపడకుము. ఘూర్జరపురిసమీపమునకే వచ్చియున్నది.

బ్రాహ్మ—ఆహా! అంతయుసమీపమునకే వచ్చియున్నది.

సోమ—నీకేలయింతభయము?

బ్రాహ్మ—సోమశేఖరా! తెలిసి తెలిసి యీ మొఱకుఁదన మేల? నేనంతయు నా సేనానితో మాటలాడివచ్చియున్నానే? అన్నికార్యములు సాధింపఁగలుగునే? నాయెడ నింతవిశ్వాసము గలుగకున్న నెట్లు? నినుఁజూచిన వెంటనే నఱుకవలయునని యున్న శత్రువుపురికి నీవే వచ్చుట చెల్లునా?

సోమ—బ్రాహ్మణోత్తమా! భీతిల్లకుము, నీయెడనా కవిశ్వాసములేదు. ఆసేనానివలన సంగతులెఱింగి దానిపై ద్రోహ చింతఁజేసి యొకకార్య మొనర్పవలయు నని నా

కభిలాషము లేదు. మాకుఁగల లిఖితసాధనముల నీఘూర్జరరాజు స్వాధీనమున నుంచుకొనియున్నవాఁడు. వానిగ్రహింపలయు నని నాయభిలాషము.

బ్రాహ్మ—ఇం దెవఁడైన నొక్కఁడును నిను గుఱుతించెనా యెంతటి కార్యమగును?

సోమ—మిత్రమా! నను గుర్తెఱింగినవారిం దెవ్వరున్నారు? నీకేలయీభ్రాంతి?

బ్రాహ్మ—ఇదేమిమాట? ఒక్కరైన నినుఁజూచియుండరా? ఇక్కడి రాజసైనికులు మనయుద్ధమునకు సహాయులుగా వచ్చియుండినవారుగదా?

సోమ—వారిప్పు డెక్కడ నున్నారు? కొందఱు మాత్రముదప్ప నందఱును శత్రువులచే నిహతులుకాలేదా?

బ్రాహ్మ—ఆకొందఱున్నఁ జాలదా?

సోమ—అయిదాఱుసంవత్సరముల ముం దొక్క సారి చూచిన వారి కేమి జ్ఞాపకము?

ఉ॥ ఊరక యీవిచారమిది యొప్పదు నన్ను నెఱింగియున్న వా।
రేరును లేరు రూపమొక యించుకయేని యెఱుంగరానియా।
కారముగాదె మేననిటుకప్పను వేషముచాయ బోయయి।
ప్పారసి ప్రాణ బంధువుల కైన ననుం గుఱుతింప శక్యమే॥

నేనిప్పుడుండుస్థితిలో నాముఖ్యబంధువులైన నను గుఱుతింపఁగలరా?

బ్రాహ్మ—సోమశేఖరా!

కం॥ ఎంతెంతనీవు చెప్పిన।
సంతోషంబుప్పతిలదు స్వాంతంబునకుఁ।
వంతలుదప్పవటంచుఁ।
జింతించెదమదిని సోమశేఖర వింటే॥

సోమ—అదిగో! మరలనాపేరేల? "పిళ్ళోరి" యనుము.

బ్రాహ్మ—పిళ్ళోరియో గిళ్ళోరియో. కానిమ్ము. మనప్రాణములకు దైవమెక్కు వెట్టియుండ నీకు వేఱుబుద్ధి యేలపుట్టును?

సోమ—ఊరక శంకింపకుము. పోదమురమ్ము.

(నిష్క్ర.)

శ్రీ

ముక్తావళీ నాటకము.

ప్రథమాఙ్కము. తృతీయరంగము.

వింధ్యప్రాంతాటవి.

[ప్ర: ముక్తావళి-ప్రవాళవల్లి-నీలాలక.]

అందఱు— (అనుబంధము 2.)

నీలా—ముక్తావళీ! ప్రవాళవల్లీ! చూచితిరా! ఈవనమెంత ఘోరముగానున్నది? ఈ యపరాహ్ణమునను నడిరేయి యనిపించుచున్నది. ఈవసంతర్తుసమయమున నీ భూమిహిమానీవేళ యందలి చల్లదనముఁగలిగియున్నది.

ప్రవా—ఔను. ఈభూసతికి హరికరస్పర్శనములేమిఁ గలిగిన వియోగజనిత స్వేదమో యనుభంగి నున్నది.

నీల—ఈతరు ప్రకాండములు తమనీడ నాశ్రయించిన వారికిఁదపన యోగముగలిగింప మని బద్ధ కంకణములయినట్టి జలబిందువులచే రాజిల్లుచున్నవి.

ముక్తా—ఎంతటి గాఢాంధకారమును మాయింపఁ గల యీచండ భానుఁడీ చెట్లుల నీడలఁదనుఁగబలించి కళాహీనుఁజేయు తమోగ్రహమో యను భీతినందులకుఁ జేచాపవెఱచుచున్నాఁడని నాకుఁదోఁచుచున్నది.

ప్రవా—నీలాలకా! ఈ ముక్తావళి యాశయము కడుసొంపుగానున్నది. ఇనకర ప్రచార రహితమగు నీయటవి నెట్లువర్ణించె!

నీలా—దీనికి నినకరస్పర్శనము మాత్రముగలుగవలయు.

(లోపలమూల్గినధ్వని.)

ముక్తా—ఇదియేమి? ఏదోధ్వని వినిపించె?

నీలా—ఆవైపున నెవ్వరో మూలుగుచున్నట్లుది.

ముక్తా—అయ్యెడకేపోయి విచారింతమురండు.

ప్రవా—ముక్తావళీ! మనకేటికే? భయంకరకానన మృగముల కునికియగు నీఘనాటవి నిట్టియారావమబ్బురమా?

ముక్తా—ఇట్టిపగటివేళ వనమృగములెక్కడివో? పోయి పరికింతమురండు.

(వెనుక యవనికనెత్తఁగా సోమశేఖరుఁడు నెత్తురుగాఱుచు మూర్ఛిల్లియుండును ప్రక్కన సింహము చచ్చిపడియుండును.)

ముక్తా—చెలులారా! చూచితిరే? ఇతఁడెవ్వరో యిందు మూర్ఛిల్లియున్నవాఁడు. ఆ ప్రక్కన సింగముచచ్చిపడియున్నది.

ప్రవా—తెలిసెను. ఇతఁడు సింగముతోఁబోరాడి గాయములువడసి దానింజంపియున్నాఁడు.

ముక్తా—వీఁడు శబరవేషముధరించిన చంద్రకళావతంసుని చందముననున్నాఁడుగాని నిక్కంపుశబరుఁడుకాఁడు.

నీలాలకా! అసరసినున్న యుదకముంగొనిరమ్ము. ఈ నెత్తురుగడుగుదము.

నీలా—ముక్తావళీ! మనకేటికే యీప్రసంగము?

ముక్తా—చెలియా! ఇదిధర్మమా? ఇట్టివాని మనము విడిచిచనవచ్చునా? నీరుతెమ్ము పొమ్ము.

నీలా—(నిష్క్ర.)

ప్రవా—ముక్తావళీ! నీవన్నమాట నిక్కువము. ఇతఁడు వేషధారికాకున్న నీరూపమున కీతేజమా? ఈదుర్వృత్తహర్యక్షు నిర్యాణకరణ వీర్యమా?

(పునః ప్ర|| నీలాలక జలకలశముతో.)

ముక్తా } (సోమశేఖరుని ముఖముకడుగుదురు. వర్ణమంతయుమాఱును. కవచమువిచ్చె
ప్రవా } దరు రాజయోగ్యకవచములోనఁ గనుపించును. (విభ్రాంతిఁజెందుదురు.)

ముక్తా—ఆహా! ఇతఁడెక్కడికిరాతుఁడే? అమేయ మహిమోపేతుఁడగు సుకుమారుఁడు. ఇతని కరావలంబనముగలుగనే తరుణీమణి ధన్యతఁజెందఁదగియున్నదో? చెంది యున్నదో? చెలులారా! మీరెట్లయినఁగరుణించి యీమనోహరునకుఁ బ్రాణదాన మిచ్చితిరా మీరు ప్రాణసఖులనుట యప్పుడుగదా?

(అనుబంధము 3.)

అందఱు—(సోమశేఖరునికి శిశిరోపచారములఁజేయుదురు.)

సోమ—(కన్నులుతెఱచును.)

ముక్తా—కన్నులు తెఱచుచున్నాఁడు. (స్వ) ఇదియే మీయభిలాషము? ఈశంకా విశేషము? హృదయమా! నీకేటికీతొందర?

సోమ—హా! హా! వనితామణులారా! నేనెందున్నాఁడను?

ముక్తా—ప్రవాళవల్లీ! వచింపుము.

ప్రవాళ—నీలాలకా! ఊరకేలయున్నావు? ఉత్తరమిమ్ము.

నీలా—ఇదేమొయ్యారమే? మీరేలమాటలాడరాదు? నేనొక్కతెనో యిందుండునది?

ముక్తా—రాజకుమారా!

సోమ—తరుణీ! నేనెక్కడి రాజకుమారుఁడను బోదును.

ప్రవా—ఆవేషము వేసికొన్నమాత్రముననే స్వాభావికముగా దాఁగకయుండఁగలతేజ మెందుఁబోవును?

ముక్తా—

ఉ॥ నీయనురూపరూపసరణింగనుఁ గొంటిమి రాకుమారనే।
బోయనటంచు నీకరణిఁ బోలదు వేసము వాదులాడఁగా।
నీయెడనుండ నేమికత మెవ్వఁడ వెవ్వరు తల్లితండ్రి నీ।
కేయువియోగరూపలివిద్యల్లనుఁ దాఁపకయానతియ్యవే॥

నీవు దాఁచకుము. నీమోముదమ్మి రక్తసిక్తమైయుండినందున మేము కడిగినపుడు నీస్వరూపము వెలువడియె. అదియట్లుండినను, నీలోపలనున్న రాజ్యయోగ్య కవచములుండలేదా? నీవెవ్వర విట్లుండుటకుం గారణమేమి?

సోమ—(చూచుకొని) (స్వ) ఎవ్వరుండు నీతరుణీమణి? దీనిస్మేరాపాంగము నాయాయాసమునంతయు నడఁగించుచున్నది.

ముక్తా—రాకుమారా! నన్నంతిగాఁజూడకుము. నీవృత్తాంతమానతిమ్ము.

సోమ—అబలా! నీవునన్నుఁబలుమాఱు "రాకుమారా" యని పిల్చుచుండ నీకొఱకే రాకుమారుఁడనేయయ్యెద. దేశదర్శనాభిలాషముఁబూని యిట్లేవచ్చుచుండ నీగహనమున నీసింగము నన్నుఁగొట్టెను. ఈగాయమునుండి వెడలిన రక్తపూరమునకు మైమఱచితిని. (భుజముఁజూపును.)

ముక్తా—ప్రవాళవల్లీ! నీలాలకా! చూడరే యెంతగొప్పగాయము. (అనికవచముఁజించి నీటఁగడుగుచుఁ గన్నీరునించును.)

సోమ—అబలా! నీకేటికిఁ గన్నీరుగలిగె? నాకుఁగలబాధకై వగచెదవా? వగవకు మది యేమిచేయఁగలదు? (స్వ) ఔరా! ఈయతివకరస్పర్శ మెంతానందముగలిగించె!

(ప్ర) తరుణీమణీ! నాకీనాఁడింత ధన్యతగలుగ నాపాలిభాగ్యదేవతవైవచ్చిన నీ వెవ్వతెవో యానతిత్తువా?

(అనుబంధము 4.)

ముక్తా—(లజ్జనభినయించును.)

ప్రవాళ—రాజపుంగవా! ఈకన్యపేరు ముక్తావళి. ఈమె ఘూర్జరరాజగు చారుశర్మ కూతురు.

సోమ—హా! దైవమా! (మూర్ఛపోవును.)

ముక్తా—అయ్యో! ఇదియేమే నీలాలకా? మరల నీపురుషపుంగవుఁడు మూర్ఛిల్లెను? అక టా! ఈతఁడు కనుదెఱచి మరలమాటలాడఁగలుగునా? ఏమిబాధ కలిగియున్నదో?

(లోపల గుఱ్ఱములధ్వని)

ప్రవా—ముక్తావళీ! ఇదిగో గుఱ్ఱములచప్పుడు. మనరాజసైనికులు వచ్చుచున్నట్లున్నది. పోదము.

ముక్తా—సైనికులువచ్చిన నేమిచేసెదరే? మీ కింతక్కటికము లేనివారే? ఈపురుషవరుఁ డిట్లుమూర్ఛిల్లియుండఁ బానిపోనెంచెదరు?

నీలా—ముక్తావళీ! నీకుబుద్ధిచాలదు. మనసైనికులు మమ్ముయ్యెడఁజూచిన నేమనరు? ఊరకరమ్ము.

ప్రవా }
నీలా } —(ముక్తావళి నీడ్చుకొనిపోయెదరు.)

[ప్ర: రాజసైనికులు.]

1. రా. సై—అతటాకమునఁ జలపానముఁజేసి యిందింతవిశ్రమింతము.

2. రా. సై—ఇదియెవ్వరురా? ఎవరో మూర్ఛిల్లియున్నాఁడు? వేషము రూపము ని ట్లున్నది.

3. సై—వీని నెక్కడనో చూచినట్లున్నది.

4. సై—ఇందిసింగముంజూడుము. దీనితోఁబోరాడి చంపియున్నాఁడు.

2. సై—వీనినెత్తుకొనిపోయి కాపాడి మారాజునకిత్తము.

3. రా—ఇట్టిసింహాయతసత్త్వుఁడు భృత్యుఁడుగాలభించిన మారాజున కానందముగల్గు.

అందఱు—(ఎత్తుకొనిపోదురు.)

[పునః ప్ర: ముక్తావళి-ప్రవాళ-నీలాలక.]

ముక్తా—(చూచిభీతిల్లి) అయ్యో! ఆమహానుభావుం డింకెన్నఁడుచూతునే?

(అనుబంధము 5.)

నీలా—ముక్తావళీ! మనభటులు వానినవశ్యము సంరక్షింపఁగలరు. యోచింపకుము పోదము. విచారింపకరమ్ము (నిష్క్ర-౯.)

శ్రీ

ముక్తావళీనాటకము.

ప్రథమాంకము-చతుర్థరంగము.

చారువర్మయాస్థానము.

[ప్ర: చారువర్మ-సునీతి-సువిచారుఁడు-సోమశేఖరుఁడు (భుజబద్ధుఁడై) భటులు.]

చారు—సోమశేఖరా! నీచందమంతయు దెలిసెఁగదా? నీబ్రాహ్మణుఁడు నున్న యందంత మంతయుఁజెప్పె. కసిమసఁగి చెలరేగితిరుగులాడుచు సెట్టివారన్నరకుగొనని యహం కృతిగల నీవిపుడు మాకు వంటయింటికుఁదేలవయితివి. మీతాతలమొదల్కొని మా కుఁబాలికకోరిచ్చుచుంటిరి. నాలుగైదు వత్సరములనుండి మీకహంకృతియెచ్చె. దానన్నగముఁజేసితిరి. అంతరితత్వము ముఖ్యముగాని ధనము ముఖ్యముగాదను చింతచే మేమూరకుంటిమి. రెండువత్సరముల క్రిందట విసము చేసికొంటిరి. దానికిని నూర కుంటిమి. ఈవత్సరమునఁ బరమావిధేయతతోఁ గప్పమేయివ్వమని వ్రాసితిరి. కావర ముహెచ్చె. మాసేనాని నంతకుని లోఁజేసికొని రాజ్యమునకే యాపనతే నుంకించితిరి. మాయవేషమొదవ సింగమున్న గుహఁజొచ్చు మాలంగమువలె మాయూరికే యేతెంచి తివి. నీమాయకారి బాపనికిని నీకును విధింపవలసియున్నది. ఇప్పుడేమందువు ?

సోమ—నన్నేలయడుగవలయు? నీమనసునకువచ్చినభంగిఁ జరుపవచ్చును. మీసేనాని నీకేమియుహానినొనరింపఁడు. వాఁడేమైననొనర్చియున్నను నావలన నీలోకమోస మును గలిగియుండవని కంఠోక్తిగాఁజెప్పువాఁడ. వానిశిక్షించి ప్రయోజనమేమి? నే నన్నినో నిరుఁబగవాఁడ. కాలకర్మములు జతగూడినను నీయధీనుఁజేసె. నీయిచ్చకు వచ్చినభంగి నొనర్పుము. అయిన నాప్రార్థనమొకటికలదు. నిను వేఁడవచ్చునన్నఁజెప్పె దను. మృతికిఁగొంచెమైనఁజంకని మానవమాత్రుఁడనన్యసహాయుఁడైయున్నవాఁడు. కోరినకోరికవిని జరుపుకుతూహలము గలదేని నుడివెద.

చారు—నిర్భయముగా వచింపుము.

సోమ—

శా॥ శూరాగ్రేసరుఁడర్ రణేతరమ్మృతిర్ క్రుక్కంగనొల్లర్ ధను।
ర్నారాచంబుల ఖడ్గకంకటములన్నాకిచ్చి నీకిష్టమా।
వారిర్ నాపయిఁ బూన్చియుద్ధమునఁజంపంబంచి చంపించియో।
వీరస్వర్గముఁగల్గఁజేయుటకు నేవేనోళ్ళఁ బ్రార్థించెదర్ ॥

ఇదియే నా కోరిక. నేశూరుఁడనై శూరాగ్రేసరులనినుతికెక్కిన వంశమునజనించినవాఁడ. ధనుర్బాణముల ఖడ్గచర్మముల నాకిచ్చిన యిచ్చకువచ్చిన యొక్కరితోనైనను బెక్కండ్రతోనైనను ననిసేయించి ననుఁజంపి వీరస్వర్గము ఘటిల్లఁజేయుము. నీవును శూరశ్రేష్ఠుఁడనినుతికెక్కినాఁడవు. నీశూరతకిదిగదా సార్థకము ?

నారు—నీశూరగుణము చాలును. చేఁజిక్కి నిర్బంధితుఁడైయున్న విరోధితో యుద్ధముచేయించుట యేరాజనీతి ? అదిగాక నినుఁజంపవలయునను నభిలాషము నాకు లేదు. భూభారమేమైనఁదక్కునగునా ? మృతితప్పించుకొను నుపాయమునచేనున్నది. నీవైమృత్యువు నెదుర్కొన్నయత్నములేగు. ఇదినామాట. నేటినుండి పదిసంవత్సరములు మాకుసంగోరుగాఁగప్పము మాకీవలయు. తరువాతఁబాతికభాగముఁ జేసికొనవలయు. మాభృత్యతనొప్పికొని మాకులిఖితసాధనమిచ్చి యీ భంగి జరుపుటకుత్తరవాదులుగా నీవుగాని మీతండ్రిగాని యైదేడులు మాయధీనమున నిర్బంధనమున నుండవలయు. ఒప్పికొంటివేని జాబువ్రాయుము. నీ తండ్రింబిలిపింతును.

సోమ—రాజా ! ఈమాటలాడనీకు నోరట్లాడెను ? ధరరణకంకణాంచితుఁడై యుద్ధమే మోక్షసాధనముగను రణరంగమే పరమస్థానముగను ప్రత్యర్థి నిశానవమే సద్వ్యాహికాళాపూర్తిగను భావించియున్న నేనాయిందుకు సమ్మతింపవలయు ? ఈమాట వలననాదేశముకాగు. లోకమంతయు నిలువవలసినను, నింతింతగానముఁగోసినను, నాయసువులన్నియు నిక్కేయూడిపడినను, నేనిందుకియ్యకొందునా? నాప్రాణముల వెంతతీపు ! ఆనిటలాక్షుఁడే యీపనిచేయుమన్నను జేయదునా ? నేనంత భీరుఁడనుకొంటివా ? ఎంతపొరపడితివి ? నాప్రాణములనంత మధురములుగాఁజూతునని నమ్మితివా? ఎంతమూఢవిశ్వాసము ? నాముక్కున నావిగలుగ నేనొకనికి దాసుఁడుగానుండమైకొందునని తలంచితివా ? ఎంతతప్పుఁదలఁచితివి ? అర్థముగాగు, పిసమున వీసమైనను నీకుఁగప్పము నేనేల యీవలయు ? నాయొకనిప్రాణమునకై తర తరములుగా మావారినీకమ్ముకొనుమంటివా? తేపుచచ్చువాఁడ నేఁడేచచ్చెదఁగాక-నాస్వాతంత్ర్యమనుప్రాణమునీచేఁ జిక్కదు. ననుఁబాసిపోవదు. నీచేఁజిక్కియున్నానని యీ గురాలాపములనీ వాడకుము.

(అనుబంధము 5.)

ఈ పాపోక్తులనేఁ బరతంత్రుఁడఁగాని వేళ నానిటలాక్షుఁడాడియున్నను, వాని మూఁడవకన్ను మూయించుచుంటిని. నీయట్టిరాజనిర్భాగ్యుని మాటయెంత—చారు—అధమా! ఇంకనోరుమూయుము. నీపందయార్భాటములన్నియుం విననవ్వు కుతూహలమునఁగాని యింకొందులనఁగాదింతపఱకు నినుమాటలాడనిచ్చుట. అయినను నీకింకొక్క నెలదినములు గడువిచ్చెద. సేవకులారా! ఆసేనానీపాతకుని నేఁడే పట్టణమధ్యమున నురిదీయుఁడు. ఆబ్రాహ్మణ చండాలుని సముద్రముదాఁటించిరండు.

క॥ క్రూరాత్మనృశంసునినీ!
జారాసుతుఁగొంచునరిగి సౌరాష్ట్రపురిన్ ।
కారాగారము నం దిడి ।
యారూఢిన్‌గావఁజెప్పుఁ డనిమేషునకున్ ॥

ఈనీచాత్ముని సౌరాష్ట్రపురముపకుఁగొనిపోయి యందలి యంధకారగృహమున నెలదినములుంచియుండి పిదపఁగొనిరండు. మనయనిమేషుని వీనిపైఁ జక్కని కాపుదల కలిగియుండుమనుఁడు. ఇప్పుడే భూపాలపురిపై దండు వెడలవలయునని నూతన సేనానికి నియోగముఁగొనిపొండు. (నిష్క్ర.)

శ్రీ

ముక్తావళీనాటకము.

ప్రథమాఙ్కము-పంచమరంగము.

అంతఃపురము.

[ప్ర: ముక్తావళి, చారుహాస.]

ముక్తా— (అనుబంధము 6.)

చారుహాసా! ఈకార్యము నీకు సాధ్యముకాదన్న నే నేమనఁగలను? లోకమంతయు, నీపతి నీస్వాధీనమున నున్నవాఁడనియందురే?

చారు—ముక్తావళీ! లోకమంతయు నీవన్నట్లనుట యధార్థమే. ఉండుటయు యధార్థమే. ఐననాయత్నమిందేమియు సాగకున్నది. నయభయగతులనాపతి నుద్బోధించితిని. నాచరణమునపైఁబడి వలదనియె. నే నేమిచేయుదును? అదిగాయుండనీ! మీతండ్రియింత లోననే నిన్ను నాగకేతునకిచ్చి వివాహము చేయవలయునని యున్నాఁడే? ప్రయత్నము లన్నియుఁ జరుపుచున్నాఁడే? దీనికెట్లు చేయుదువు?

ముక్తా—అందువలననే నీవు నేఁజెప్పినపనిఁజేయకున్నావా?

చారు—ముక్తావళీ! అందుకుఁగాదు. నీమాటనేజవదాఁటుదాననా? ఈప్రస్తావముననే నాగకేతునిపై నాకుజ్ఞాపకము వచ్చినందున నడిగితి.

ముక్తా—ఆనాగకేతునిఁ నేఁజూచి యే యెఱుఁగఁగదా? మాతండ్రియేమో చెప్పుచున్నాఁడు. నెలదినములలో రానున్నాఁడఁట. ఇంతమాత్రము నేనెఱుఁగుదును. అదియుండనీ. చారుహాసా! నాకొక్కటిచెప్పవలయునని తోఁచుచున్నది. వంచన కార్యమని త్యజింపక చేసెదవా?

చారు—ఎట్టికార్యముగాని శిరసావహించి చేయుదాననని నీమనసేయెఱిఁగియుండ నేఁ జెప్పవలయునా?

ముక్తా—కారాగృహము నేమఱక నీపతి కాచియుండ నొక్కొకవేళ నీవయ్యెడకుఁ బోవుటకలదుకదా ? నీవందున్న సమయమున నీపతి నిద్రించుటయుఁ గలదుకదా ? అప్పుడు గాని నీపతి భోజనాదులొనర్చు కాలమునఁ గాని యేదేని పరాకునఁ జెఱసాల తలుపు తాళములు నీచేఁజిక్కుట దుస్తరము గాదు. అట్లొదవినపుడు వాని బంధవిముక్తునిఁ జేయుట దుష్కరమా ?

చారు—ముక్తావళీ ! నీవెంతటి ముగ్ధవు ? నాపతి కనిమేషుఁడను పేరన్వర్థముగా నున్నది. అతనికిఁ బరాకుగాని స్వామికార్యమున నిద్రకాని గలుఁగునా ? అదియెట్లున్నను, నూఱురకన్న నెక్కువగా నున్న కారాగృహము వెలుపలి వాకిటి కావలియందు వారి నెట్లు మీఱిపోవలయు ? ఇది కానిపని.

ముక్తా—చారు హాహా ! అయిన నా భాగ్యమింతయే కదా ?

(అనుబంధము 7.)

చారు—ఊరడిల్లుము. నేనింకనుఁ బ్రయత్నించి చూచెద దైవమున్నాఁడు.

(నిష్క్ర).

శ్రీ

ముక్తావళీ నాటకము.

ద్వితీయాంకము-ప్రథమరంగము.

దేవాలయము.

[ప్ర: బాదరాయణుఁడను యోగి.]

బాద—(జపముఁజేయుచుండును).

[ప్ర: ఒకపురుషుఁడు.]

పురు—యోగిచంద్రా? నిదర్శనముచేతఁ గృతార్థుఁడనైతి.

బాద—నారాయణ! ఏలవచ్చితివి?

పురు—అయ్యో! పన్నెండుసంవత్సరములనుండి కుక్షిశూలచే బాధపడుచున్నాను.

బాద—భోజనము చేసిన వెంటనే కలుగునో?

1 పురు—కాదు—

బాద—మాకుఁదెలియును కొన్నిశూలలన్నము జీర్ణమునకు వచ్చు కాలమునఁగలుగును.

1 పురు—నాకట్లునుఁగాదు.

బాద—అవును నిశూలకెంటికిఁదప్పి తనయిచ్ఛచొప్పునఁ గలుగును.

1 పురు—భాగ్యము మహామహుఁడవు. నీకుఁదెలియని విషయమేమున్నది? నా కుదయమునఁ గలుగును.

బాద—రేపమావాస్యనాఁడు రమ్ము క్రియఁజెప్పెదను.

1 పురు—అమావాస్యవఱకు నిందేయుందురా?

బాద—నారాయణ!

1 పురు—అయిన నాకు సెలవా?

బాద—కూర్చుండుము. ఈయూర విశేషములేమి?

1 పురు—సర్వవిషయములఁ గరతలామలక ప్రాయముగాఁగాంచు మీకుఁదెలియని విశేష మేమున్నది ?

బాద—నారాయణ! అయినఁబొమ్ము. (1 పురు. నిష్క్ర.)

[ప్ర॥ 2వ పురుషుఁడును, గ్రుడ్డివాఁడొకఁడును.]

బాద—(చూచియుఁజూడక) కన్నులులేవు. కన్నులులేవు.

2 వ పురు—మహాత్మా! ఈయనతమయొద్ద కొకకార్యమువచ్చె—

బాద—కన్నులులేవు. కన్నులురావు.

గ్రుడ్డి—అయ్యా! నాకన్నులకొఱకుఁగాదు. అవియెప్పుడో పోయినవి. నాకూతురు సర్వలక్షణసంపన్నయై యుండినను దానిమగఁడు కురూపివేశ్యాలోలుఁడై యామెను పేక్షించుచున్నాఁడు.

బాద—అందుకే కదా మేము. “కన్నులులేవు. కన్నులురావు” అంటిమి.

గ్రుడ్డి—మహాత్మా! అజ్ఞులకు మాకట్టిగూఢాశయములు తెలియఁగలవా? నాయల్లునికిఁ గన్నులు గలుగు నుపాయమైన నేమి ?

బాద—కోఁపమూవాస్యనాఁడురమ్ము, చెప్పెదను. ఊరిలో విశేషమేమి ?

గ్రుడ్డి—అయ్యా! నాబిడ్డగోడేవిశేషము.

బాద—ఇంకఁజాలుపో. నారాయణ !

2 పురు }
గ్రుడ్డి } (నిష్క్ర.)

[ప్ర॥ చారుహాస-వీరబాహుఁడు.]

చారు—స్వామీ! ఈతఁడునాతమ్ముఁడు.

బాద—నీవెవరవు ?

చారు—నేనీరాజునకంత రంగసేవకుఁడై ప్రకృతము కారాగృహ రక్షకుఁడైయున్నయని మేషునిభార్యను. చారుహాసయను పేరిదానను.

బాద—కూర్చుండుము. ఇతనికేమి ?

చారు—నాల్గుసంవత్సరములనుండి యూరక చెవుడు పట్టియున్నది.

బాద—ఆమూలనున్న మూటలోఁదైలముగలకాచకుప్పెయున్నదిట్లు గొనిరమ్ము.

చారు—(పోవును).

బాద—(గట్టిగా) నీకు మిక్కిలిగాఁ జెవుడుకలదా ?

వీర—నా పేరు వీరబాహుఁడు.

బాద—(నవ్వి) కొంచెమైనను వినరాదా ?

వీర—వాననిలిచినది. కుంచెయెందుకు ?

బాద—ఎక్కువగానున్నదే ?

వీర—మీవంటివారుండ నాకేమి తక్కువ ?

(పునః ప్ర॥ చారుహాస, కుప్పెతో.)

బాద—(వీరబాహుని చెవిలోఁబోసి) కొంచెము నిద్రపట్టును పండుకొననిమ్ము.

వీర—(పండుకొనును).

బాద—చారుహాసా ! ఊరిలో నేమివిశేషము ?

చారు—ఎన్నియోవిశేషములు. నేనొక్కటిఁ బ్రార్థింపవచ్చియుంటి.

బాద—అదియేమి !

చారు—చిరకాలమునుండి నేను సంతానములేకున్నాను - మీరుమహనీయులు. నాకేదైన ననుగ్రహింపవలయు. మీరువచ్చి పది దినములేయయియుండినను మీఖ్యాతి యూరంతయునిండినది-రాజాంతఃపురమునను దెలిసినది. మఱచితి. మీయొద్దకు నేఁడో రేపో యీ రాజుకూఁతురగు ముక్తావళియొక యర్థము నభిలషించి ప్రచ్ఛన్నముగా రావలెనని యున్నది.

బాద—ఏమికార్యము ?

చారు—ఏమికార్యమో యాయమయే చెప్పఁగలదు. మీరుచెప్పుమన్నఁజెప్పెదను. (చిఱునవ్వునవ్వును).

బాద—దివ్యదృష్టి దర్శించిననాకుఁ దెలియనియర్థమేమున్నది ?

చారు—మీకుఁదెలియనిదేమున్నది ? ఆలోచించితిరిగదా ? అదిగో నవ్వుచున్నారు. అప్పుడేవిదితమయ్యెఁగాఁబోలు. ఇంతపిచ్చిమోహమైన నాయమ నేమనవలయు? తానెక్కడఁ; దనతండ్రికాజన్మవిరోధియగు సోమశేఖరుఁడెక్కడ ?

బాద—(ఆశ్చర్యపడి) వాఁడిపుడు చెఱసాలనున్నాఁడుగదా ?

చారు—ఇంక మూఁడునాల్గుదినములలో మారాజాతనికిచ్చిన నెలదినములు గడవుమీఱును శిరచ్ఛేదనము కాఁగలదు. వానిరాజ్యమంతయుఁబోయెను. వానితండ్రియు యుద్ధమున మృతిఁజెందెనఁట.

బాద—(కన్నీరునించి) ఏమిచేయవలెను?

చారు—అయ్యో! మీకును గన్నీరువచ్చుఁగదా? ధీరగుణములగల వారికెవ్వరికిరాగు? అట్టిమోహముగల యీకన్య నేమననలయు? నాపై నామెకుఁగోపము?

బాద—అట్లనా? ఏటికి?

చారు—(బాదరాయణుని చెవిలోఁ చెప్పును).

బాద—నీమగఁడట్టివాఁడైయున్నపుడు నీవేమిచేసెదవు?

వీర—(లేమను).

బాద—మూఁడుదినములిట్లే యితని కితైలము వేయుము, సుఖమగును.

చారు—నాకేమియుఁ జెప్పకపోయితిరే?

బాద—సంతానమునకా! శోపమావాస్యనాఁడురమ్ము.

చారు }
వీర } (నిష్క్ర.)

[ప్ర: 3-వ పురుషుఁడు. పడుచు.]

బాద—ఈయమరాజు కూతురా?

3 పురు—కాదు. ఈయూర నేయున్న శరభరాజను పేరుగల భట్టువాని కూతురు.

బాద—శరభరాజుకూతురైన రాజుకూతురుగాదా?

3 పురు—అయ్యో! నాకుఁదోఁచకపోయె. ఈకన్యకుఁ గొంతేము గ్రహబాధయున్నది.

పడుచు—(తలయూపను బ్రారంభించును).

బాద—(మంత్రములుపఠించి గ్రహమువిడిపించి పంపును).

3 పురు }
పడుచు } (నిష్క్రమము.)

ప్ర॥ ముక్తావళి (మాఱువేషమున) నీలాలక.

ముక్తా—మునీంద్రా! మీపాదయుగము దర్శింపఁదన్యతగలిగె.

బాద—నీవీరాజు కూతురవా?

నీలా—మునీంద్రా! సర్వజ్ఞులరగు మీయెదుట నెంతప్రచ్ఛన్నవేషమున వచ్చిననేమి? దాఁప నేటికీయమయూరాజు కూతు రేయగును.

బాద—(యోచించి) ముక్తావళియా యీయమపేరు?

ముక్తా—భాగ్యము.

బాద—తరుణీ! నాకుఁజూడ మోహమే నీరాకకుఁగారణముగానున్నది. నీప్రియుని పేరు సకారాదియా?

ముక్తా—భాగ్యము.

బాద—వాఁడిపుడు కంఠగతప్రాణుఁడైయున్నట్లున్నది.

ముక్తా—భాగ్యము.

బాద—వానికి క్షేమము గలిగింప నీవు చేయు ప్రయత్నములన్నియు నిష్ఫలము లయిన ట్లున్నది. అప్పులేని వాని యాటంక మెక్కుడు గానున్నట్లున్నది

నీలా—అప్పులేని వాఁడనఁగాఁ దెలియదయ్యె.

బాద—నాజ్ఞానచక్షువులవలన నంతమాత్రమే తెలియుచున్నది. మీరేయెఱుఁగవలయు.

ముక్తా—దేవా! మీమాటయథార్థము. నీలాలకా అనిమేషుఁడుకదమే?

నీలా—ఆహా!

బాద—తరుణీ! ఇది నెఱవేఱని కోరికయే? నీకెట్లుపట్టుపడెను?

ముక్తా—మహాత్మా! మీమాటయథార్థము కాకుండునా? ఆపురుషపుంగవుఁడు నాకు మగఁడు కావలయు. నాయభిలాషపూర్తియగుఁగావలదు. నాప్రాప్తమెట్లున్నదో యట్లవుఁగాక. ఆధరణీశకుమారుఁడు సోమశేఖరుఁ డనువాఁ డిపుడు కారాగృహమునఁ గ్రూరాత్ముఁడగు మాతండ్రి శాసనమున నురిత్రాటికెక్కనున్న మెడతోనున్న వాఁడు. ఎట్లయినఁజేసి యతని నందుండి వెడలించితిరా యంతయేచాలును. అతఁడు ప్రాణవంతుఁడై యున్నాఁడని విన్న నేఁజల్లఁగఁ బ్రాణములవాసెద — ఎట్లైన నను గ్రహింపవలయు. (నమస్కరించును)

బాద—తరుణీ! నీకుస్థిరమానసమున్నదా?

ముక్తా—దేవా! స్థిరమానసమునను నన్నుగ్నలోనొక యామము ముందు మున్నునుండఁగలను.

బాద—అయినఁజూడుము. (నీలాలకపైపాడ వేయును).

నీలా—(మూర్ఛిల్లును).

ముక్తా—(భయమున) దేవా! ఇట్లేల?

బాద—తనయా! భయపడకుము. ఇదిసమ్మోహకరణియను మూలికామార్గము. ఎట్టివారిఁగాని యిదిరెండుయామములు తెలివిలేకుండఁజేయును. నీతో నేనాడుమాటలు నీసఖివినరాదని యిట్లొనర్చితి. నీవు నాకుఁగాతుగిపు-అంగుఁబోయి కూర్చుండుమురమ్మ. మాటలాడకుము. అమ్మకో! ఏమియోచించెదు? నీచెలికిఁ గావలెనన్న నిప్పుడే తెలివివచ్చునట్లునుఁజేయఁగలను. పోదమురమ్మ.

(నిష్క్ర-9.)

శ్రీ

ముక్తావళీనాటకము.

ద్వితీయాఙ్కము–ద్వితీయరంగము.

కారాగృహము.

[ప్ర: లోపల సోమశేఖరుఁడు–వెలుపల అనిమేషుఁడు.]

సోమ—ఆహా! ఇట్టినిర్భాగ్యుఁ డెందైనఁ గలఁడే? ఈచారువర్మహతకుఁ డిట్టిదుష్కృత్యము సేయఁ బాల్పడునే? నాకార్యమున నాతండ్రి ప్రాణములఁ గోలుపోయె. నేనే రేపురి దీయఁబడుచున్నాను. నాకేలయీముష్కరము? ఈచారువర్మ చెప్పినభంగి నాచరించి పట్టణమునకుఁ బోయి రేపే యుద్ధమునకు వెడలివచ్చి వీనిజయింపఁ జాలనా? ఇట్టేలచేయరాదు? ఆహా! నాకిట్టిభ్రాంతిగలిగెనే? ఇట్లుయోచించుచున్నాను? నాప్రాణమునకా నేనింతదురటిల్లవలయు? ననుముద్దుచేసిపెంచిన తండ్రిలేకయున్న యాపాపహారికి నూరకయే నిర్బంధములేక యీచారువర్మపంపినను నేఁబోవఁజాలఁగదా? ఇట్లుండ నీగురాత్మునికిఁ బత్రమువ్రాసియిచ్చి నేఁబోవుదునా? అవశ్యము సంతుష్టుఁడనయ్యెదఁ గాక. అయిననొకటిమాత్రము నే నోచనైతిని. సింగముకాటున బెండువడియుండిన నన్ను నాఁడాదరించిన యారమణీమణి నాశ్లేషింపలేకుండినను, ముద్దిడఁజాలకుండినను జూడనైనఁ బ్రాప్తిలేకున్నదికదా? నిశ్శంకముగఁ జూచుచున్న నాకుదైవ మీత్రోవ వగలిగించె. ఆనాఁడా తరుణీమణి సాభిలాషముగ ననుఁజూచినచూపు నాకన్నులకుఁ గట్టినట్లైయున్నదిగదా? ఆముద్దుమోము మఱచితి. ఆబలువుగుబ్బలచాయ మఱచితి. ఆసోగకన్నుల మఱచితి. ఆబంగరురూపము రేఖ మఱచితి. ఆకోమలహస్తముల మఱచితి. ఆచేతుల నాయొడలు నిమిరినపుడు నాకుఁగలిగిన యానందము మఱచితి. మఱచితి, మఱవకున్నను మఱవఁగలను. కాని యాప్రేమ మిడించు చూపుమఱువఁ జాల, ముక్తావళీ! నాకింతయే భాగ్యముసుమా!

(అనుబంధము 6)

పరమపదవాసా, నినునమ్మియున్నవాఁడ. ఎట్టివేళనయినను నినుమఱవనివాఁడ. ఆసంకృతివేళమునవిచ్చలవిడిముందు వెనుకలరయక శాత్రవుని యూరికి సహాయుండనైవచ్చిన నాసాహసమునకీ విధితగినదే. సర్వసముఁడవై భక్తజనక్షేమంకరుఁడవై

శ్రీతాళికాపదలఁజూపు నీవునాకాపదగలిగింతువా? నామేలుకోరుకొట్టి పాటునాకుఁ గల్పించితివిగాక సభక్తితాత్పర్యమున నేనిది నమ్మఁగలవాఁడ. ఇఁకఁగొన్ని దినములు మనియున్న నాపూర్వపాప ఫలములనే నింకేమనుభవింపనుంటినో? అవియన్నియుఁ బాపినను నీసన్నిధికిఁగొనివెంచు టనుగ్రహముగాక నిగ్రహమేలగు? దేవా! ఈపుడ యమున నిరాయాసముగనను నేసరసకుంగొమ్ము. మాముక్తావళిని రక్షింపుము. ఆచెలువకు సర్వైహికసౌఖ్యముల నొసఁగుము. పరమేశా! ఇదేనమస్కరించువాఁడ.

సీ॥ సకలైహికానంత సౌఖ్యంబు లొసఁగునా
కేనారియవిరత ధ్యానమహిమ।
యనుభూతాతి లోకానందము ఘటించు
నేనాతిరుచిరాభిధానగరిమ।
నాకలోకామితాస్తోక సంపదలిచ్చు
నేభామసన్నికర్షాభిలాష।
విగతాచరణలోక విస్మృతిఁగలిఁగించు
నేలేమకడగంటి వాలుచూపు॥

తే॥ గీ॥ అట్టిముక్తావళి దశనాళివిజిత।
సుంచిముక్తావళికి సర్వశుభమొసంగి।
చెలఁగిపాలింపుమయ్య రక్షింపుమయ్య।
దివ్యవిజ్ఞానభావయో దేవ దేవ॥

అనిమేష—(ఇంతవఱకుకూరకయే లేచిచూచుచు "ఎవరది" యనుచుతాళము చేతులఁబట్టి చూచుకొనుచు తలయూచుకొనుచుండి నిద్రించును.

(ప్ర॥ బాదరాయణ. ముక్తావళి. పురుషవేషమున)

అని—(లేచి). ఎవరక్కడ? ఎవరక్కడ?

ముక్తా—నేను. (అనిచూర్ణము వేయును).

అని—(మూర్ఛిల్లును.)

బాద—(అనిమేషుని మొలనున్నదీగము చేతులవిడుచుకొని కారాగృహమువాకిలితెఱచి లోనికిఁబోవును).

సోమ—(లేచి) ఎవరక్కడ?

బాద—సోమశేఖరా! లెమ్ము. పోదమురమ్ము.

సోమ—నీవెవ్వరవు ?

బాద—సోమశేఖరా ! నీపినతండ్రిని మీనానాథునిఁ గుఱుతెఱుఁగవా ?

సోమ—దురాత్మా, నను మోసముచేయఁజూచెదవా ? నాపినతండ్రి మీననాథుఁడిట్టివేళ నిచ్చోటకెటువచ్చును ? ననుఁజంపవచ్చియుండిన నిపంచనయేల ?

మీన—కుమారా ! నినుఁజూడ సంతాపముగలుగుఁగదా ? ప్రతిపక్షధరణీపాలక దంతావళీకేసరికిశోరని కాళుఁడవై యెదురెందులేని కడిమిఁదిరుగునీకా యిట్టిపాటు ?

సోమ—(స్వ) ధ్వనియట్లేయున్నది. పిత్రవ్యా ! యెచింపుమిదియేమి స్వప్నమా లేక నిక్కువమా ?

బాద—కుమారా ! నమ్ముము. నేనేమీననాథుఁడను.

సోమ—పినతండ్రీ ! మన్నింపుము. ఈచారువర్మపాలకుఁడు నాకొనర్చియున్న యుప మతివలన మోసమంతయుఁ బొడవుగాంచినను జుట్టుకొన్నట్లుండుటచే నాకన్ను లనేనమ్మఁజాలకున్నాను. యెచింపుము, నీ వెట్లువచ్చితివి?

మీన—మాటలకవకాశముదేదు. నినువిడిపింప యతివేగముగఁబూనివచ్చితి లెమ్ము వెడలిపొమ్ము.

సోమ—ఆహా! నాభాగ్యమసమానము. ఇదేవచ్చెద. (బట్టలుమొదలైనవి కట్టుకొనికూరుచుండి) పిత్రవ్యా నాతప్పు మన్నింపుము. నేనిక్కడనుండి రాఁజాలను.

మీన—అయ్యో! ఇదియేమి భ్రాంతి? ఈవునిన్నుఱిదియుట కీరాజచండాలుఁ డాజ్ఞాపించియున్నాఁడే? సిరికి మోకాలొడ్డినభంగి సంపదకు నీవుచూపినభంగిఁ జేసెదవేల ?

సోమ—పిత్రవ్యా!

ఉ॥ తోఁచకపోయెనామదికిఁ దొల్తనెనక్షమియింపుమయ్య "నీ।
కీచిఱుబుద్ధియిప్పు డుదయింపఁగనేలనిపల్కకయ్యనే।
నోఁచితినయ్యనోములు మనోగతినిచ్చోఁజూపఁగాననే।
నీచెఱఁబాయనయ్యవెలికేగఁగఁజాలఁగదయ్యవింటివే॥

ఈలోకమంతయు నెంతనశ్వరమని తెలిసియుండినను జనులెంగుకందు బ్రతికియుండ నేకోరుదురు? పదార్థప్రీతిచేతనేకదా? నాకుఁబ్రియముగుపదార్థ మీలోకమున నొకటియెప్పు డేలుతేదు. అదియిచ్చోటనేయున్నది. నాభాగ్యమును నాయైశ్వర్యమును నాప్రాణమును నాకుఁగలయన్నియు నాపదార్థమే. కావుననిచ్చోటనుండి పోఁజాలను. ఆపదార్థముగు యీచోట మృతిఁబొందినను నదియేధన్యత. అయ్యదియేకృతార్థత? అల్లదియే సర్వాశాపరిపూర్తి.

మీన—లెనయా! అదియేమి పదార్థమయ్యా?

సోమ—పిన్నతండ్రీ! ఇంకదాఁపఁజాలను. నామనసును హరించినదియు, నన్నుఁదనలోని భాగముగను దన్నునాలోని విశేషభాగముగను జేసినదియుఁ, దన్నుమానిన నీలోకమే నాకులేదనిపించునదియుఁ, దలంచినమాత్రమున నేయిట్టిమరణమువేళను నాకధికధైర్యమును, సమధికోత్సాహమును, బరమానందమును, నమితభాగ్యమును గలిగించునదియు, స్థలాంతర సౌఖ్యక్షేమ పదవికంటెనే తత్కారాగృహం మరణమే నాకున్మేలని పించునదియు, నగుపదార్థము చెప్పుదునా? తలఁచినప్పుడే కన్నులకానందబాష్పములును గంఠమునశోక గాద్గద్యమును మనసున నేనెక్కుడ నేనెక్కుడ యని పోరాడు శోకసంతోషములును గలుగుచున్నవి. కావున వచించెదను. ఆపదార్థము నాలుగక్షరములఁ బరిపూర్ణదశఁజెందియున్నది. ఈరాజునకుఁగూతురై ముక్తావళియనుపేర.

(అనుబంధము 7.)

ముక్తా—(పురుషవేషముతీసి పాఱవైచి లోనికిఁబోయి) హా! నాథా! నేధన్యను నేధన్యను. నేనునీకింత సంతాపమును సంతోషమును గలిగించితినంటివి. నను శిక్షించినను మన్నించినను నీదాననే. (ఆలింగనము.)

(అనుబంధము 8.)

సోమ—స్వప్నముకాదుగదా! స్వప్నముకాదుగదా?

మీన—(స్వ) సుముహూర్తోస్తు. (ప్ర) సుమారం! ఇదియే ముక్తావళి. మీరిరువురు వెడలిపొండు. తడవగును.

సోమ—మేము వెడలిపోయిననీవు—

మీన—దీర్ఘసంవాదమున కవకాశములేదు. నేనిదేయతివేషమున నీపురమువారి నావారిఁగాఁజేసికొని, యీముక్తావళి విశ్వాసమువడసి యీతనయసహాయము నొనరింప నింతకార్యముఁజేసితి. ఈకుమారి తనయయ్య ముద్రాంగుళీయకముఁదెచ్చినందుననీగృహము వెలుపలికావలివారి మోసపుచ్చి లోనికివచ్చితిమి. నేనెఱిఁగిన సమ్మూర్ఛకరణివలన యనిమేషుని నిద్రవుచ్చితిమి. వచ్చినవారమిరువురమవుటచే మువ్వురము వెలుపలికిఁబోయితిమా వెలుపలికావలివారు సంశయింతురు. వ్యర్థప్రయాసమగును. ఈకారాగృహమువెనుక నేపాఱుచున్న తపతీనదముదాఁటి యావలఁజేరువఱకు మీకు క్షేమము కలుగదు. ఆనదియొద్దనే యొకతెప్ప సిద్ధపఱచియున్నారము. ఈముక్తావళి చూపఁగలదు. నేనిందేయుండెదను. యతినగుటచే మహాత్మ్యము ప్రకటించితినని చెప్పి యెట్లయినఁదప్పించుకొందును. ఆదిగాక నన్నెఱింగినవారొక్కరు నిందులేరు. నాకు దండనమొసంగుటకుఁ గారణమునుండదు. లేక నిర్బంధముననే యుంచియుండిరా నీవు సేనాసమేతుఁడవైవచ్చినను విడుపింపఁజాలవా? అట్లుగాకొకవేళ ననువధించినను నీవొకఁడవు గట్టిగానున్న నాకంతయేచాలును.

సోమ—పితృవ్యా! ఇదియేమియుక్తి? ఆకావలివాండ్రకే యింతచింతింపవలయునా! ఒక ఖడ్గము నాచేనున్నఁజాలదా? మనము మువ్వురముఁబోదము.

శా॥ ఆలంభప్రళయప్రయత్నపటు నృత్యద్భీమకంఠాచర ।
త్కాలాహీశ్వరభోగభీషణము తత్కాల్పాంతదావానల।
జ్వాలాసన్నిభ ముగ్రశూలయమ పాశప్రాయమీఖడ్గమీ ।
కేలంగ్రాలఁగ సైన్యసంహననము న్గేళీగతింజేయనే॥

మన—చిఱుతవాఁడ వెఱుఁగకిట్లాడెదవు. ఆకావలివారు నూర్గురకెక్కువగానున్నారు. హతశేషుఁడొక్కఁడెవఁడైనరాజున కీవార్తఁజెప్పిన మనము నదిదాఁటుట కనువగునా? ఇంకింతసేపటికీయనిమేషుఁడులేచి యిందొక్కరులేకుండుటఁ జూచెనా, యదియుం గార్యవైఫల్యమునకుఁగారణమే. ఇదియంతయు ముక్తావళితోఁజెప్పి సమ్మతిపఱచియున్నాను. ఉదయమగుటకు ముందే నదీతరణముమాత్ర మొనరింపుఁడు. ఈయమావాస్యాంధకారమును ఈచిటిపాటి చినుకులును మాకనుకూలము.

సోమ—పితృవ్యా!

మ॥ కరవాలంబునఁగోయనిమ్ము సఁగుదుం గంఠంబు నేభంగిదు ।
ర్భరణంబైనసహింతుఁగాక త్రిజగన్మాన్యున్మహోదారుని ।
న్బరిబంధంబుననుంచి నేఁబడయు నాస్వర్గంబు నేనొల్లని।
త్వరసాలంబులెయుంతతీపులె పితృవ్యానాదుప్రాణంబులున్॥

అట్టి మహోదారతిలకునిఁ జెఱనుంచి నేఁబడయు బంధమోచనము నాకొల్ల. ఆ వైకుంఠపదవియేయబ్బినను నేనొల్ల. నీప్రాణమునకంటె నాప్రాణమంతయెక్కువయా?

మీన—నీవింకమాటాడిన నాయానగలదు. నీవిక్కడనుండి పోకుంటివేని నేనాలుకఁ ద్రెంచుకొని యసువులఁబాసెద.

ముక్తా—అంతయేల? మీరిరువురునుబొండు నేనిందుండెద. మాతండ్రి నన్నేమిచేయును?

మీన—మరలమరల నీమాటలేల? మీరింకఁ బ్రత్యుత్తరమిచ్చెదరేని నాయానగలదు.

సోమ—హా! దైవమా? నీయానయని యిట్టులాన వెట్టిన నేనేమి చేయఁగలను?

మీన—అదిగో! అనిమేషుఁడు కదలుచున్నాఁడు. ఇందుండకుఁడు పొండు. పొండు. పొండు.

సోమ—(బీగమువేసి తాళముచేతు లనిమేషునిమొలలోఁగట్టి) పితృవ్యా! నీయుపకారమిట్టిదని నేనెంతునా? నీయానకు వెఱతుఁగాక, యిట్టిలోకాతీత ధీరోదారు నిన్నుఁ జెఱనుంచి నేఁబోననాకుఁ గాళ్లాడవు. నాకించుకయు సంతసముచాలగు. ఇదే

ఘోరప్రతిజ్ఞ చేయువాఁడను. నాయనపులు నా మేనమామ త్రిముండెనా నిన్ను నిర్బంధము నుండి విడిపించుటయే వేదవిహితకార్యముగను గురుదేవులయాజ్ఞగను భావించెదను. ఇందుకుఁదప్పిన నేదైవమునకు మాతాపితృలకుఁ దప్పినవాఁడనగుదు. ఇదె నమస్కరింతును.

ముక్తా—జనకా! ఇంచుకైనఁ గరుణయెఱుఁగని జనకుఁడు నాకుండియు లేకుండు నట్లయ్యె. కావున దుఃఖసాగరమునుండి నను వెడలింపను, నా సర్వాభీష్టములు సమకూర్పను, గలిగిననీవే నాజనకుఁడవు. నానాథుఁ డొనర్చిన యీప్రతిన నెల్లపుడు స్మరించుచుఁ దమ్ము మండఁగలదానను.

సీ॥ శరణాగతత్రాణ కరుణాకరవిధాన
జ్ఞానక్రియాబోధమీననాథ।
ఈధరాతలమున నీధీరచరితంబు
వర్ణింపశక్తులెవ్వారు గలరు।
అమ్మమ్మ యెన్నిజన్మమ్ము లెత్తినను నే
నీఋణంబునుఁదీర్ప నేరఁగాదు।
ఇదె నేఁడు ప్రతినవట్టెద నిన్ను నానాథుఁ
డింతకావఁగ నచ్చునంతవఱకు।

తే॥గీ॥ నీయుదంతంబు నుడుపుటఁ బాయనుమ్మ।
ఇంకఁబతిని విద్రరానీను నుమ్మ।
పూని నే నేకభుక్తంబు మాననుమ్మ।
అంతవఱకీధరనిఁ బెండ్లియాడనుమ్మ॥

నినువిడిపించు ప్రయత్నము తఁ డొనరించి యీ నీదుఃఖము తీసివేసిన నీయుపకారమునకు నే నతనిఁ బరిణయమాడుదానఁ గావని నేనిదె యుపాస్యులగు ప్రతిన నొనరింతు. నాథా! ఇది నీకును సమ్మతమేకదా?

సోమ—పరమభద్రము. పితృవ్యా! మాయిరువురి ప్రతిజ్ఞల జరుపువారము.

(ముక్తా : తోనిష్క్ర)

అని—(లేచి నలుదిక్కులు మూచి లోపలనురక వెళ్లుచున్న నానిర్బంధించు తలయూఁచి బీగము చేతుఁలఁబట్టమూచి పండుకొనును.)

(యవనిక దిగబాఱును.)

శ్రీ

ముక్తావళీ నాటకము.

ద్వితీయాఙ్కము. తృతీయరంగము.

తపతీనదీతీరము.

[ప్ర: ముక్తావళి-సోమశేఖరులు. (తెప్పపై)]

(అనుబంధము 9.)

ముక్తా—హా! నాథా! చూచితివే యెట్లొమమ్ము నుద్రోయుచున్న దీ ప్రవాహము ? నాకు భయముగలిగె.

సోమ—ముక్తావళీ ! భీతిల్లకుము. దైవముమనకంత దుఃఖముఁగలిగింపఁడు. ఈనావతమిచే నీయేట నిప్పుడేపైనీరు వచ్చుచుండుటఁగొట్టుకొనిపోవుచున్నారము; కాని తెప్ప బలిష్ఠమైనట్టున్నది. భయంపడకుము.

ముక్తా—నాథా! దాపునసముద్రముగలదే ? అందుఁ బోయిన నేమిచేయువారము ?

సోమ—అయిననేమాయె ? భీతిల్లకుము?

ముక్తా } (పోవుచు సముద్రమునఁబడియెదరు. తెప్పరెండు భాగములైపోవును. ముక్తా
సోమ } వళీ సోమసేఖరులు చెరియొక భాగమున వేఱైపోయెదరు.)

(యవనికదిగఁజాఱును.)

శ్రీ

ముక్తావళీనాటకము.

ద్వితీయాంకము-తురీయరంగము.

కారాగృహము.

(లోపల మీననాథుఁడు పండుకొని యుండును.
వెలుపల ననిమేషుఁడు కావలి)

[ప్ర: చారువర్మ-నాగకేతుఁడు-సైనికులు-మంత్రులు-
సునీతి-సువిచారుఁడు.]

చారు—(అనిమేషునితో వాకిలి తెఱపించి) దురాత్మా! మూర్ఖాగ్రణీ! లెమ్ము. ఇదే నిన్ను వధించువారు సిద్ధముగా నున్నారు. కడమాట నేనే నీతో వచింపవచ్చితి. మీ పట్టణము రాజ్యమంతయు మా యాధీనమయ్యె. మీ తండ్రియో సంహరింపఁబడియె. ఓరి కుమార్గ్గ! నేటికిఁ బ్రాణములనొప్పఁజెప్పెదవు? ఇప్పుడైనను నాయాజ్ఞ జరుపుదువేని నీరాజ్యము నీ కిచ్చెద.

మీన—(ముసుఁగుతోనే నవ్వును.)

చారు—నవ్వెదవా? ఏడ్చెదవా? నీకేమి కారమా? ముసుఁగేల తీయవు? ఈముసుఁగున నేమిఫలము?

సైని—(మీననాథుని ముసుఁగుఁ దీయుదురు.)

మీన—నారాయణ! నారాయణ! ఏమిది? నేనెవ్వఁడను. మీరెవ్వరు? ఇదేచోటు?

అందఱు—(ఆశ్చర్యము నభినయింతురు.)

చారు—అనిమేషా! ఇదియేమి?

అని—ప్రభువా! ఇందు నాయపరాధమింతైనను లేదు. అగ్నిఁబట్టి ప్రమాణముఁజేయుమన్నఁ జేయుదును.

చారు—సైనికులారా! మీరు వెలుపలనుంటిరిగదా? మీకుఁదెలియక నీకార్యము జరుగునా? ఇదియేమి?

సైని—(స్వ) ముద్రయుంగరము వృత్తాంతముఁజెప్పితిమా మాప్రాణముపై నేమివచ్చునో? (ప్ర) దేవా! ఇట్టి యాశ్చర్యము మేమెంతయు నెఱుఁగము. నేఁడే సోమశేఖరు నురదీయుదురుగదా! ఇంతలో నేమిసంభవించునోయను భయమున నూట యేవురును నిన్నరాత్రి నిద్రలేక మేల్కొని యుంటిమి. వెలుపటికొక్కరును రాలేదు.

చారు—అయినపెఁడెవఁడు?

సుమతి—రాజేంద్రా! ఈతఁ డేపదిదినములనుండి మనయూరనేయున్న యతీంద్రుఁడు మహాత్ముఁడని జనులందఱు చెప్పఁగావిన్నాను.

చారు—ఏమాశ్చర్యమిది? సన్యాసీ! నీ వెట్టికపట సన్యాసివి? ఇక్కడికెట్లువచ్చితివి? నిక్కముఁజెప్పకున్న నినుఖండింతును.

మీన—(ఇంతవఱకు "నారాయణ" యనుచుండి) అహా! నేనా? ఇక్కడికా? వచ్చితినా? ఆహాహా!

చారు—ఈదురాత్ముఁడే హానిని విడిపించుటకుఁ గారణము. జాణమా! చెప్పెదవా? చంపుదునా?

మీన—అహా! అహా! నన్నా! చంపుదువా? (నవ్వి) ఎవరు?

అని—నేను. (అనిసమీపించి ఖడ్గ మెత్తును.)

మీన—(మున్నుగొని చేతినుంచి—అని: ముగియుపైనూఁగును.)

అని—(మూర్ఛిల్లును.)

మీన—ఇంకెవరువచ్చెదరో రండు!

(అందఱు నాశ్చర్యము నభినయింతురు.)

చారు—దురాత్మా! నిన్నూరకె విడుతునని యెంచితివా? నిన్నింతింతగాఁగోసి వేయింతును.

మీన—ఊఁ—కానిమ్ము.

(అనుబంధము 10)

చారు—(స్వ) వీనినేమిచేయవలయును? నాకేమియుఁదోఁచకున్నది. (ప్ర) నీవునిక్కం పుయతివో కైతవయతివో యాదైవమెఱుఁగు. ఎట్లువచ్చితివిందు?

మీన—రాజా! నీకూరక దుఃఖమేల ? నేను గపటయతినని యేయనుకొనుము, దానసేమి యునాకుఁగొదువలేదు. నేనువచ్చి మంచిరాజ్యమని యీయూరఁదపముఁజేయు చుండఁగా నూరివారందఱు నన్నూరక బాధించి వరములడుగుచువచ్చిరి. కపటయతి నైనందున నందఱిని నమావాస్యనాఁడు రమ్మంటి. అమావాస్య నిన్నగదా ? నాగురు వునాపైఁ గోపముగలిగి విసరివేసెను. ఎక్కడఁబడితినో యెఱుఁగను. ఇప్పుడు కారాగృహమని తెలిసెను. ఈచోట నెవ్వఁడో యొకసుకుమారుఁడున్నట్లుండెను. నేను పడినవెంటనే మిద్దతూఁటుపొడుచుకొని పోయినట్లాయెను. వాడెవఁడో యెక్కడికిఁ బోయెనో యెఱుఁగను.

చారు—సైనికులారా ! ఈపలువన్నృపాలాపము లాడుచున్నాఁడు. వీనిఁబట్టి ఖండెలు ఖండెలుగా నొనరింపుఁడు.

(సైనికులు వెనుకకుఁద్రొక్కెదరు.)

చారు—దురాత్ములారా ! వెనుదీసెదరా ? మీపనిచక్కఁజేయఁగలను. వీనిపని నేన చేసెదను. (కొట్టును.)

మీన—అయ్యో ! నాబిడ్డయేమాయె. నాబిడ్డయేమాయె ? హా హా హా

చారు—పలుగాకీ ! నీబిడ్డయెవరు ? నీవుసన్న్యాసివైన నీకుబిడ్డయెక్కడవచ్చె ?

మీన—బిడ్డయా! హా హా హా నాబిడ్డ. ఎంతముద్దుబిడ్డ ? పోయె. పోయె. హా హా హా

(ప్ర: శీఘ్రగమనమున నీలాంబిక)

నీలా—దేవా ! నాయభ్యంతరము క్షమింపవలయు. నిన్నరాత్రి యర్ధరాత్రివఱకు మేము ముక్తావళియు మాటలాడుచుఁ బండుకొంటిమి. కొంతసేపులోననే ముక్తావళి వెలుపటికిఁబోయెను. నేనువత్తునన్నవలదనియె. తర్వాతనాకన్నిద్రవచ్చె. ఉదయ మగుటకు జామున్నపుడే లేచితిని. ముక్తావళి కానరాకున్న వెదకితిమి.

కం॥ ఆయర్ధరాత్రినుండి య।
యో యెల్లెడవెదకితిమి తలోదరి నదియే ।
మాయయొ కనఁబడకున్నది ।
మాయపరాధంబులేదు మానవపాలా ॥

ప్రవాళవల్లియు వెదకె. ఎండెందు వెదకినను జిక్కకున్నది. మహీశా! మన్నింప వలయు.

చారు—హా ! హా ! హా ! దైవమా ! (మూర్ఛిల్లును.)

నాగ—హా! శ్రీహరీ!

మీన—నాబిడ్డపోయె. నాబిడ్డపోయె. హా హా హా

చారు—(లేచి) నాగకేశా! నాబంగారపు కూతురునాకుఁ దక్కునా?

(అనుబంధము 11.)

నాగ—అయ్యో! కాంతామణీ! ముక్తావళీ! నీవునాకుభార్యవై సర్వసుఖములొసంగఁ గలనని నమ్మియుంటినే? నాచిత్రకారశక్తివలన నీరూపముఁజూడకుండినను ప్రశంస వలనవిని రూపమెట్లిదిగా నుండఁగలదని యెన్నియోచిత్రములువ్రాసి పేరొసఁజేసి నిన్నుఁజూడ నెంచితినే? ఇంకనొక గడియకు నీమంగళాంగదర్శనము నాకులభింపు ననియుబ్బుచుంటినే? ఇంతాశాభంగముఁగలిగించితివా?

మీన—నాబిడ్డ. నాబిడ్డపోయె. హా హా హా.

చారు—నీలాలకా పోదముగమ్మా. సైనికులారా! మీరందఱుపోయి దిక్కు దిక్కుల నా కుమారిని వెదకిరండు.

(నిష్క్ర.)

(అనుబంధము 12.)

నాగ—దైవమా! నాకెమిప్రాప్తిగలిగె? ఆ ముక్తావళి లేకున్న నేన్నాలనిర్వహింతును? భూమియంతయుదేవేంద్రగిరి దానిపాలకుఁ గుటుంతును, నొండీనియట్లనే మాయై యొందుదును గాని యాతరుణీమణిలేక నేజీవింపఁజాల.

(నిష్క్ర.)

[ప్ర: సైనికుఁడు.]

సైని—యతిసార్యా! నమస్కరింతును. మాచారుశర్మరాజుగారు మీకత్యంతవిధేయులై క్షమాపణముఁ జెప్పుకొనుచుఁ గనుగృహమునకు మిమ్ము విజయముచేయుంచుకొని రమ్మనినారు. పల్లకివచ్చియున్నది. వేంచేయుఁడు.

మీన—నేనిప్పుడు రానని వానితోఁ జెప్పుము. ఊరిలోనికిఁ బోయి పిదప నిష్టమువచ్చి నప్పుడు వచ్చెదనని చెప్పుము. (నవ్వుచు లేచిపోవును.)

అని—(లేచి చూచి) హా! హా! ఏమాశ్చర్యము. (నిష్క్ర.)

శ్రీ

ముక్తావళీనాటకము.

తృతీయాంకము-ప్రథమరంగము.

కేరళరాజ్యమున సముద్రప్రాంతభూమి.

[కొందఱు తురకలు మాటలాడుకొనుచుండఁ బ్రవేశము ముక్తావళి.]

ముక్తా—మహాత్ములారా! అనదనై గత్యంతరములేక వచ్చియున్నాను. మీరు నన్నుఁ గాపాడవలయు.

తురకలు—(తమమాటలతో హాస్యమాడెదరు.)

ముక్తా—అయ్యలారా! మీమాటలు నాకేమియుఁ దెలియవు. మూఢఁగానను మేలము లాడునట్లున్నది. ఇదిధర్మమా?

తురక—(ముక్తావళిపైఁబడఁబోయెదరు.)
ముక్తా—(చూర్ణము వారిపైఁజల్లును.)
తురకలు—(మూర్ఛిల్లెదరు.)

ముక్తా—దురాత్ములారా! ఇట్లనేపొండు. దైవమా! నేనింకేమిసేయుదును. నానాథుని యాశ్లేషసుఖమొక్క సారికేకడగావలయునా? తపతీనదము దాఁటి యేతెంచిన నాకనంతసౌఖ్యము కలిగెనని నమ్మియుంటిఁగదా? ఆనదము వేగమున సముద్రమున రెండు క్రోశములు గొట్టుకొని పోవలయునా? పోయినను మానెఁగాక నానాథునితోనుండినదియే పరమానందముగనుండెనే? అదియులేకపోయె. దక్షిణమునకు నన్నును బశ్చిమమునకు నానాథునిఁద్రోయవలయునా? అప్పుడయ్యెడకు వచ్చుచుండిన యోడబేహారియొకఁడు చోళరాజ్యమునకుఁ బోవువాఁడు నన్నుఁదనయోడ నెక్కించుకొని వచ్చుచుండినవాఁడు దారిలోనిందే తనయోడతోఁగూడ మునుఁగవలయునా?

(అనుబంధము 13.)

హతభాగ్యరాలనగు నాకొక్కతెకుమాత్రము మృతిగలుగకుండ వలయునా? ఈరూపముననే నెక్కడికిఁబోయినను భంగపాటుగలుగుఁగాక వేఱుగాదు. (తన

చీరఁజూచి) నినుఁగట్టినవారిఁగలకాల మబలలఁగాఁ బరతంత్రరాండ్రుగాఁజేసి యెవ్వరికలనను భంగపాటు గలిగించి హాస్యమునకు నిడుమలకుఁ బాత్రభూతలుగాఁజేయు వస్త్రమా! నీవిట్టెపొమ్ము. (పాఱవేసి) రూపమువలనఁగాకున్న వేషమువలననైననే బురుషుఁడనయ్యెద. (పురుషవేషముధరించి) ఇంకనన్నెవ్వరేమి చేయఁగలరు? నానాథుని ప్రథమాలింగనము వడయఁగోరి గూఢవృత్తిఁగారాగృహప్రాంతమున కరుగుటకే వేషము ధరించితినో యదియేయిప్పుడు నాపాలికిలభించినది. ఆహా! లోకమున వేషమువ నెంతయున్నది? అప్పుడేనాకు మగతనము లభించినట్లు భీరుత్వమంతయుఁ గొఱనడుచువచ్చె. ఒకఖడ్గము మాత్రముననే యుద్ధమునకుఁ బోవుదానివలెనున్నాను. "పోవుదానివలె" నేల? "పోవువానివలె" నందును. వేషమువేసికొనినవారి బ్రదుకు నిరర్థకము. ఈదేశముననే యుంటినా, యీతురకలమూలమున గుర్తింపఁబడుదునేమో? ముందుపోయెదను. పేరొకటికావలయుఁగదా? నీలకేతుఁడను పేరుఁబెట్టుకొనియెదను. ఎందైనఁ బోయిరాజునొద్ద నూడిగమునకు నిలిచి నానాథుపోకడ నన్వేషించెదను.

(నిష్క్ర.)

శ్రీ

ము క్తా వ ళీ నా ట క ము.

తృతీయాంకము-ద్వితీయరంగము.

కేరళదేశములోని వీధి.

[ప్ర: చారుఁడు.]

చారుఁడు——జనులారా! బ్రహ్మక్షత్రియ శూద్రవతంసములారా! వినుండు వినుండు. ఈ కేరళరాజ్యమున నొక వనకుంజరము, అప్పుడప్పుడు రాత్రివేళఁ బట్టణములకుఁ బల్లెలకువచ్చి యిండ్లను జనులను వనములను నాశనముఁ జేయుచుండుట యందఱు నెఱుఁగుదురుగదా? దాని వధించుటకుఁ జేయఁబడిన సర్వోపాయములు విఫలములై యుండుటయు నెఱుఁగుదురు. అది సర్వాయుధాభేద్యమై గజరూపమూనిన మహాసురుని చందమున నెందు నెదురులేకున్నది. నిరపరాధజననాశనమునకుఁ గటకటపడి కేరళరాజ్యరమావిలాసులగు నంగారశర్మరాజుగారు వక్ష్యమాణవిధమునఁ జాటించుచున్నారు. ఎవ్వరైనను శూరులగు వారీకుంజరమును దృష్టాంతయుక్తముగ దిష్టాంతమొనర్చిన మారాజ్యములో మేముపాతిక భాగమివ్వఁగలవారము. వారివంశమున్నంతవఱకు నడుపువారము. అట్టివారు బ్రాహ్మణక్షత్రియులలోఁ జేరినవారేని, శూరాగ్రేసరుఁడని జగత్ప్రసిద్ధిఁగనిన వానిఁగాక యితరులఁ బెండ్లియాడనని ప్రతిజ్ఞపట్టియున్న మాయేకపుత్త్రి నింగులేఖాదేవిని మేమట్టి శూరునకుం బరిణయముఁ జేసియిచ్చి యర్ధరాజ్యమివ్వఁగలవారము. ఇది త్రికరణశుద్ధిగా జరుపువారము. శూరులకెల్ల మంచి సమయము మొదవినది. ఉపేక్షయొనరింపరాదు సుమండీ.

(నిష్క్ర.)

శ్రీ

ముక్తావళీనాటకము.

తృతీయాఙ్కము-తృతీయరంగము.

పాండ్యరాజగు చతురవర్మయాస్థానము.

[ప్ర: చతురవర్మ-మంత్రి.]

చతు—మంత్రీ! వస్తువాహుఁడిపుడేవచ్చెనా?

[ప్ర: వస్తువాహుఁడు. ముక్తావళి (పురుషవేషమున)]

వస్తు—పాండ్యధరామండలాధీశా! చతురవర్మరాజేంద్రా! నమస్కరించువాఁడను. మీయాజ్ఞతెఱంగున సింధుదేశమునుండియు ఘూర్జరదేశమునుండియు మీరుకోరిన సర్వపదార్థములఁ దెచ్చియున్నాఁడను, బండినుండియిప్పుడే వచ్చితి.

చతు—వస్తువాహా! మిక్కిలి సంతసించితిని. ఈముద్దుకుమారుఁడెవ్వఁడు?

వస్తు—రాజచంద్రా! ఇతఁడు నీలకేతుఁడను రాజపుత్రుఁడు. కేరళదేశపు సముద్రప్రాంతమున నాకుఁ జేరికాఁడయ్యెను. మిక్కిలి శాస్త్రపరిచయమును యుద్ధపాండిత్యమును గలవానిఁగా నెఱిఁగితి. దేశసంచారియైయున్నందున మీయాశ్రమమున నుండఁగలవాఁడని పిలుచుకివచ్చితి.

చతు—కుమారా! నీతలిదండ్రులెవరు?

నీలకేతు—దేవా! నాతలిదండ్రుల నేమనిచెప్పఁగలను?

కం॥ అనఘాత్మ నాయదృష్టం।
బున నదియే జనని యుడసముద్రుఁడె జనకుం।
డను భంగిగలిగె నేమని।
వినిపించెడివాఁడ నాదువృత్తాంతంబునుక ॥

ఇప్పటికినదియే నాతల్లి. సముద్రుఁడే నాతండ్రి.

వస్తు—రాజచంద్రా! ఇతనిచరిత్ర మద్భుతము. ఈతనితలిదండ్రులు ఘూర్జరము వైపున మున్నవారఁట. శత్రుబాధ మిక్కిలిగ్గానైన కతమునఁగడుచిన్ననాఁడే యితనిఁబాసి వారెక్కడికోపోయిరఁట. తదనద్వేషఁబ్రతియూనియూరకసంచరించుచున్నాఁడఁట. వారియిక్కువ యెఱుఁగుటకుఁగేశఖండనమైనఁగావింపఁడఁట. మొన్నసముద్రమున నొక్కయోడలోఁబోవుచుండ యీయోడ కేరళప్రాంతమున మునుఁగఁగా నితఁడొక్కరుఁడుమాత్రము బ్రదికెనఁట. ఇవియన్నియు నెఱింగినేఁ దోడ్తెచ్చితి.

చతుర—కుమారా! నీవు మాపీటనేయుండుము. నీతలిదండ్రుల నెమకింతును.

నీల—రాజచంద్రా! నిష్ప్రయోజకుఁడనై నేఋణము జీవనముచేయఁగలవాఁడఁగాను. ఏదైనఁగార్యమిచ్చిన నుండెద.

చతుర—అంతెనఁ బాలుగారు కసిగందుమోము దమ్మిగల సుకుమారుఁడవే? నీవేమికార్యముచేయఁగలవు?

నీల—చూచుటకట్లున్నాఁడఁగాని యెట్టికష్టములకైన నోర్చుకొనువాఁడ.

ఉ॥ చాలనివాఁడనంచు నలసక్రియుఁడంచునునన్నుఁజూడకేఁ ।
జాలుదు యుద్ధభూమిరిపుసారమడంపఁగవ్రాతవ్రాయఁగాఁ ।
జాలుదువంటకైనమఱి చాలుదునన్నియుమించికాపుమో ।
భూలలనేశనీఋణము భోజనమొల్లనుమ్రొక్కివేఁడెదన్ ॥

దండుననుంచినను, విలేఖకునిఁగా నొనర్చినను, తుదకు, పాచకకృత్యమునకైనఁ దగుదు.

చతుర—ముద్రఁగైకొమ్ము. ఈముద్రాధికారము నీకుండనిమ్ము. విలేఖకగణకాదులపై నధికారము గలిగియుండుము. (నిష్క్ర.)

శ్రీ

ముక్తావళీనాటకము.

తృతీయాఙ్కము-తురీయరంగము.

కేరళపురివీధి.

[ప్ర: నాగకేతుఁడు.]

నాగ—ఆహా! ఎన్నిదినములకింత వృత్తాంతముతెలిసె. ఆముక్తావళి యీకేరళరాజ్య ప్రాంతమునకు వచ్చియున్నట్టుతెలిసె. ఈరాజ్యముననేయున్నదో లేకెంద్రైనఁబోయినదో? అయినను రాజధానికిఁబోయి యందేయుండి విచారింపవలయు. అయ్యో! ఆసోమశేఖరునిపై మోహమునఁదలిదండ్రులనయితముమాని యెటనైనఁబడ నుద్యమించిన యాతన్వంగి నన్నుఁగోరునా? అదినాకు లభింపకున్న నేజీవింపఁగలనా? ఈసంవత్సరమునుండి దానికై పరితపించుచు నాధనమును బ్రాణములను దానిపాలుచేయుచున్నానే? అక్కటా! సింహాయత స్వత్వుఁడగు నాసోమశేఖరునితో నేనీడగుదునా? ఇదేలనాకీనట్టియాస? దీనిమాని నాపురికిఁబోవుదునా? అయ్యో! ఎట్లుప్రాణములఁధరించి పురికిఁబోదు?

(అనుబంధము 14.)

మొదట నాముక్తావళిపోయిన యాఱుమాసములవఱకు నదిమృతిపొందెననియే నేనును దానితండ్రియుఁ దల్లియునందఱు నమ్మియుంటిమి. నీలాలక తనమరణకాలము రాఁగా వృత్తాంతముఁజెప్పె. దానివలన సోమశేఖరుని వృత్తాంతమును నాకృత్రిమయతి, కపటసన్యాసి వృత్తాంతమును దెలిసె. నాటనుండి తదన్వేషణవ్రతముఁబూని యడుగఁదగినచోట్లన్నియునడుగుచు ముక్తావళి కట్టియుండినచీరకుఁ జతచీర చేవట్టి యూరూరు విచారించుచురాఁగా నట్టిచీర యీయూరదొరికె. ఈయాఱుమాసములువడిన శ్రమమంతయు నీటఁబుచ్చి యూరకపురికిఁబోదునా? ముందెట్లు జరుగనున్నదో చూచెదను. రాజధానికిఁబోయెదను. (నిష్క్ర)

శ్రీ

ముక్తావళీనాటకము.

తృతీయాఙ్కము-పంచమరంగము.

కేరళవీధి.

[ప్ర: సోమశేఖరుఁడు-బ్రాహ్మణవేషమున.]

సోమ— (అనుబంధము 15.)

అయ్యో! నాయట్టి పాపాత్ముఁడెందైననుండునే? రాజ్యముఁ బాసితి. తండ్రినిఁ గోలుపోయితి. నాకై తనకుఁ గారాగృహవాసముఁ గలిగించుకొన్న పిన్నతండ్రిఁ జెఱవిడిపింపలేనైతి. ధీరోదారగుణవిరాజితుఁడుగా నాపిన్నతండ్రి చెఱవిడిపింపఁ బ్రయత్నించుటయే సత్యవ్రతముగా జరుపుదునని చేసినప్రమాణపూర్వకమగు ప్రతిజ్ఞజరుపలేనైతి. అక్కటా! ఆచెఱసాల నతఁడెట్టియిడుములఁ బడెనో? ఇంత యసత్యప్రతిజ్ఞ గలుగునే? ననుఁ బాసిపోయిన యాముక్తావళిజాడ యించుకంత తెలిసిన నూరికిఁబోయి సర్వసన్నాహములు చేయ నెంచియున్నాఁడనే. అది తెలియకున్నదే? నాప్రాణపదముగా నేనెంచి సర్వాశలు నామె పెట్టియున్న తరుణీమణి ముక్తావళి విధివైపరీత్యమున ననుఁబాసినది మొదలు పశ్చిమసముద్రతీరముననున్న యన్నిపట్టణములఁ బల్లెల వెదకుచువచ్చితినే? రెండుసంవత్సరములయ్యె నించుకైనఁ బొలకువ తెలియకున్నదే? తెప్పనుండిజారి సముద్రమునఁ బడియెనో? కాదేని నక్రాదులగు జలచరములేవైన మ్రింగెనో, యొండె నిలేకున్న కీఁదల్లడిల్లి బెగడొంది యపగతాశరై యసువులఁ బాసెనో, లేకున్న సజీవరై నన్నెందైన వెదకుచున్నదో, లేక యాసముద్రమున నల్లెతేలియాడుచునున్నపుడు నాతెరువునఁబోవు నావికులెవ్వరైన నాయతివఁ జెఱవట్టిరో యెఱుఁగఁజాలఁగదా?

సీ॥ ఎడఁబాసిజడరాశిఁ బడఁద్రోసికడఁజేసి
నందుకావిధికెంత యడలిపడితొ।
బలువంతజలజంతువుల పొంతఁదలకెంత
మదిఁదాల్చి విధిలేక యదరిపడితొ।

కవగానకెవ్వరైన నవమానలవమూన
నడలొందికడుగుంది వెడఁగుపడితొ ।
మనఁగోరినినుమీఱి కొనసారిననుఁజీరి
కడునాసవిడలేక బడలుపడితొ ।

తే॥గీ॥ యకట ముక్తావళీ తరంగావళీవి ।
భావళీహావ లీలాశుభావళీస ।
ధావలీధసురో భావళీవినమ్ర ।
భావలీనసతీభంగి పావనాంగి ॥

ముక్తావళీ! నీఋణము నాకంతయే కలదుగదా? మృతిఁ గలిగింతురను భయము వెనువెంటఁ గలిగిన చావునకు సిద్ధముగనున్న సంభ్రమము వేళ నొక్కటియు మదికిఁ దోఁచకుండు కాలమున నాకారాగృహమున నినుఁ గౌఁగిలింపఁ గలిగినది మాత్రమే నానోముఫలమా? నాయట్టి హతభాగ్యుఁడుండునే? అయ్యో! నాకొఱకై, హత భాగ్యుఁడనగు నాకొఱకై నీవు తల్లిదండ్రులఁ బాసి దేశము మాని పడరాని పాటులఁ బడితివే? దానికై దుఃఖించెదఁగాక నాయునికి కింతయైన నగవను హా!దైవమా! ఇది రాతిరియయ్యె. ఇందొక సత్రమున్నట్లున్నది. ఈరాత్రి యిందుండి రేపు ముందుపోయెద. (పండుకొనును) ఏమిది? ఇట్టి యద్భుతాకారముగల యీకుం జరము నడయాడు నీలశైలము పగిది నూరిలోపలికి వచ్చుచున్నది. అయ్యో! ఆ యింటివట్లే త్రొక్కుచున్నది.

(లోపల కలకలము. ప్రవేశము-ఏనుఁగు.)

ఏమియు నెఱుఁగని భంగిమదించి యుండఁగల యీసామజమున కిట్టి చెడుతలం పేలకలిగె?

(పోయి యేనుఁగును చంపును.)

[ప్ర: బ్రాహ్మణుఁడు.]

బ్రాహ్మ—మహాత్మా! నిరంతరము మాకు బాధనొసంగుచు నిర్భీతిమై క్రూరకృత్యము లెన్నియో యొనర్చుచు సర్వాయుధాభేద్యమై విచ్చలవిడిఁ దిరుగుచున్న యీపాపపుఁ గుంజరమును జక్కాడి బకాసురుఁగూల్చి యేకచక్రపురిఁగాచిన వాయుసూనుని భంగి, హిరణ్యకశిపు ఖండించి దేవపురిఁబ్రోచిన నరకేసరిభంగిఁ గీర్తిఁగన్న నీవెవ్వర వడుగ వచ్చునా?

సోమ—బ్రాహ్మణోత్తమా! నన్నేల యింత ప్రశంసించెదు? ఇదియేమంత ఘనకార్యము? నేను విలాసకుఁడను బ్రాహ్మణుఁడను.

బ్రాహ్మ—విలాసకా! నీపుణ్యమగణ్యము. ఈకేరళాధిపతియగు నంగారశర్మ బ్రాహ్మణక్షత్రియులలో నెవ్వరైన నీమదకరిం జంపినఁ దనకూతునిచ్చి యర్ధరాజ్య మిచ్చెదనని ప్రతిన వట్టియున్నాఁడు.

సోమ—విప్రపుంగవా! నాకు మీరాజ్యమును వలదు. మీరాజుకూతురునువలదు.

బ్రాహ్మ—అయ్యో! ఇట్లేటికి? ఇక్కడికి మూఁడామడలో రాజధానికలదు పోయి రాజదర్శనమైననుఁ జేసికొందువు రమ్ము. బ్రాహ్మణోత్తమా! ఇంకొక్కమాట. ఈయూరికింత దూరముననున్న సముద్రతీరమునఁ గొన్నిదినములకుముందు కొందఱు తురకలు సముద్రమునుండి యప్పుడే యుద్భవించిన జయలక్ష్మిఁబోలె నలరారు సుందరిం గాంచి కామింపఁగా నాయంగనామణిమంత్రములుచ్చరించి ధూళిచల్లినంతనే యాతురకలు మూర్ఛిల్లిరఁట. ఆయమ మఱియేమి తంత్రముఁజేసెనో నాటినుండి యాకుంజర మీరాజ్యము నంతయుఁ బాడుచేయఁ దొడఁగె. నీకేమైన మంత్ర పరిచయమున్న నామంత్రమునకుం బ్రతిక్రియ యొనరింపుమా?

సోమ—ఎన్ని దినములైనది యాయమ వచ్చి?

బ్రాహ్మ—దాదాపుగా రెండుసంవత్సరములకంటె నెక్కువయే యాయె.

సోమ—హా! దైవమా! ఆతరుణీమణి యేమాయె? ఇప్పుడెందున్నది?

బ్రాహ్మ—అప్పుడు మూర్ఛపోయిన తురకలు లేచిచూచినఁ గానరాలేదు. ఎందు వెదకినను జిక్కలేదు.

సోమ—హా! శ్రీహరీ! బ్రాహ్మణా! పోదము రమ్ము మీకేరళ రాజధానికి.

బ్రాహ్మ—ఇప్పుడుగదా మాకుధన్యత. ఆరాజకూతురున్నదే—భళీ!

సోమ—పోదము రమ్మిప్పుడేల? (నిష్క్ర.)

శ్రీ

ముక్తావళీనాటకము.

తృతీయాఙ్కము-షష్ఠమరంగము.

చతురవర్మకొలువు.

[ప్ర: చతురవర్మ-నీలకేతులు.]

చతుర—నీలకేతు కుమారా! ఈమూఁడేడులనుండి నీగుణము చూచియున్నారము, మహోన్నత వంశమున నీవు జనించియుండవలయు ననుటకేమియు సందియములేదు. కొన్నిమాటలు నీతో నేనాడవలసియున్నది. ఇతరులతో నీవిషయమున మాటలాడింపనెంచితి. ఎంచియు ధీరగుణోపేతుఁడవగు నీతో నాడుటకు సంకోచమేలయని నేనేయుద్యమించితి. నాకుఁ గళావతియను పుత్రియుండుటయు, నాపుత్రి నాప్రాణంబు ప్రాణమగుటయు, దానికై నేనింతరాజ్యము గలిగియున్నను బునర్వివాహముఁ జేసికొనకుండుటయు నీవు వినియుందువు. కేరళరాజ్యమునుండి నేఁబిలిపించియున్న జగంధరుఁడను చిత్రకారివల్లనే వ్రాయించియున్న యాకన్నియ చిత్రపటములలోని రూపమును జూచియుందువు. ఆకన్నియ ప్రౌఢయై రెండుసంవత్సరములైయుండియు నాయమ మనసరయక వివాహముచేసి యివ్వరాదని యీవఱకుఁ గాచియుంటి. ఒక్కరైన రాజకుమారుల నాయమ యొప్పకుండె. అదేమి దైవాయత్తమో నిన్నెప్పుడు చూచినదో యాయమకు నీపై మగిగలిగియున్నది. నీకభీష్టమైన నాయభ్యంతరములేదు.

ఉ॥ ఇన్నిదినంబులున్నృపుల నెవ్వరినొల్లక యున్నకన్నెదా ।
నెన్నఁడుఁజూచెనో ఘటన మేక్రియనున్నదొ రాకుమారపో ।
రన్నినుఁగోరెనా సుత కళావతిభాగ్య విశేషమయ్యెనా ।
కన్నియఁగోర నీకుమది గల్గినలేదొక యంతరాయముః ॥

నీల—రాజచంద్రమా! ఇది యెన్నఁటికైన నొప్పునా? కన్నుగానక మీకుమారివరించినను, బుత్రియెడఁగల ప్రియమున నీవేయభయదాన మొసఁగినను, దారతమ్యమరయక నేనిందుకు సమ్మతింపవచ్చునా? నేను మీభటుఁడ. భటశబ్దముఁబట్టితనయుఁడ.

ఆయమనాచెల్లెలు. ఇట్టివానిసరియా? మీసరివారిలో మీకునగుఁబాటుకాదా? నాకు మాత్రము కీర్తికరమా? ఇదికానిపని. క్షమింపవలయు.

చతుర—కుమారా! నీలకేశా! నీసుశీలతకెంతయు సంతసించితి. యువానుఁడవై సర్వసుఖములఁ గోరవలయువాఁడవై, సుందర రాజనందనపాణిగ్రహణమును, నామూలమున రాజసుఖమును మీకబ్బనుండఁ దారతమ్యభంగివరసి నీవు వలదనుటయే నీధీరవంశజననమునుఁదప్పక చాటఁగలదుగదా ?

(అనుబంధము 16).

ఆయిన నీవాడిన యీవిషయము యోచనీయమే. ఈవిషయము నేను నాతనయకుఁజెప్పితి. ఆయమయొప్పదయ్యె. ఆమెను గాదనఁజాలకయే గానిమ్మంటి. అయిన నీవే యీయాశయము చెప్పుటవలన మరలఁజెప్పెదను. అంగీకరించినను సంతోషమే. అంగీకరింపకున్నను మఱియుసంతోషమే. (నిష్క్ర.)

నీల— అకటా! నాకిదేమవస్థవచ్చెను ? నా నాథుని వెదకుచు నేనూరకదిరుగుచున్న నతఁడును వెదకుచున్న నొకరికొకరికి సమాగమమే లేకుండుగావున నొక్కయెడ నేనున్నమేలని యిందేనిలచి వెదకుచున్నానే! ఇట్టియెడ నీసందర్భమురాఁదగునే ? దైవమెట్లుచేయనున్నాఁడో తెలియదు. (నిష్క్ర.)

శ్రీ

ముక్తావళీనాటకము.

తృతీయాంకము-సప్తమరంగము.

కళావతి యంతఃపురము.

[ప్ర: కళావతి-చతురవర్మ.]

కళా—అయ్యా! క్షమింపుము. చనవుమైఁబలికెదను. నీవే నీలకేతునితో నీమాటచెప్పినట్లు తోఁచుచున్నది.

చతుర—కుమారీ! నీయభీష్టము నెఱవేర్చుటకంటె నాకు వేఱొకకార్యముగలదా? ఆ నీలకేతునే పంపెదలెమ్మ. మాటలాడుము. (నిష్క్ర.)

కళా—హృదయమా! తల్లడిల్లకుము. నామనోహరుని మంగళాంగదర్శనము సమక్షమునఁ గలుగుటకు మదిభుగుల్లుమనుచున్నది.

[ప్ర: నీలకేతుఁడు.]

నీల—(స్వ) ఈపాండ్యరాజగు చతురవర్మయొద్ద నెన్నిదినములనుండి సౌఖ్యముగానుంటిని. ఇప్పుడిదియేమి యవస్థవచ్చెను? అతనికూతురు నన్నుఁగోరియున్నదఁట. నేఁ బెండ్లియాడవలయునఁట. నేవలదనినకారణము లెల్లఁజెప్పితిని. తనతనయతో మాటలాడెదననియె. ఇప్పుడు తనకూతురియొద్దకే నన్నుఁబంపియున్నాఁడు. దైవమా! నన్నేమిచేయఁదలఁచితివి? (ప్ర) కళావతీదేవీ! ఏమిపిలిపించితివి? ఆజ్ఞయేమి?

కళా—రాజకుమారా! నిన్నేటికిఁబిలిపించుటయు మాతండ్రిచెప్పఁడా?

నీల—తరుణీమణీ! చెప్పియున్నాఁడు. నేనందుకుఁ బ్రత్యుత్తరముఁజెప్పితిని. నీవు నను వరింపఁదలంచుట యపకీర్తికిని సరివారిలో నగుఁబాటునకుఁ గారణము. రాజ్యసంపదలుగల యువానులగు రాజకుమారులెందఱోయుండ, నినుఁజేపట్టుటయే స్వర్గభోగమనితలంచి యాశించు సురూపులగు ధరణీపతనూజులెందఱోయుండ ననుఁగోరుట నీకుఁబాడిగాదు. మీతండ్రినాకేలికయగుటచే నాకునుందండ్రివావి. ఇట్టివరుసతగునా?

(అనుబంధము 17.)

కళా—ధీరపుంగవా! రూపముకొఱఁత వలనఁగాని, గుణలోపమువలనఁగాని, నడక తక్కువవలనఁగాని, నేనీకుఁదగననియంటివేని నీకుమాటాడకుండుఁగాని యీకారణములు నన్నెట్లుబాధించును? నామనసునకువచ్చిన సుగుణశీలసంపదలుగల మనోహరునిఁబెండ్లియాడుట నపకీర్తిగాని నగుఁబాటుగాని యేలకలుగు? ఇంక వావితగదని నీవాడుట యాశ్చర్యము. నీపతితల్లి నీతల్లియేయని స్మృతులుద్ఘోషించుఁగదా? అందున నీసతి తండ్రియగుటకును, నాపతితండ్రియగుటకును సందేహమేమి? అది తప్పనివావిఁగదా?

నీల—వనితా! ఏదియెట్లున్నను నావంశము నాకేతెలియకున్నదే, నీవెవ్వరియాలి వెవ్వరికోడలవని నిన్నడిగిన తలవంపులగుఁగదా!

కళా—మనోహరా! ఈమాటకుఁబ్రత్యుత్తరము నీకుఁదోఁపదా? నీధీరగుణమే నీసద్వంశజననమునుఘంటాఘోషముగఁ జాటుచుండ నదియొకరు వ్రాయవలయునా? నీవెవ్వరియాలవన్న నామగని యాలననఁజాలనా? ఎవ్వరికోడలవన్న—

నీల—తరుణీ! నేను నాతలిదండ్రులఁ గనిపెట్టువఱకుఁ గేశఖండనమైన—హా! శ్రీహరీ! —చేయననియున్నవాఁడ నీభోగమున కెట్లెయ్యకొందు?

కళా—త్రికరణశుద్ధిగా నేఁగోరినమగని కాలననిపించుకొనుటకంటె వేఱొకభోగము నపేక్షింపను.

నీల—మానినీ! నీకెట్టియుత్తరములనిచ్చినను నాకు మనసొప్పదు. కీర్తియటుండ నాడికలటుండ సౌఖ్యమయినను నీకులభింపదని నాకుఁదోఁచుచున్నది.

కళా—ఇంతయేల నీవుమాటలాడెదవు? దాఁపకవచింపుము. నీకింకెవ్వరిపైననైన మనసుఁగలదా?

నీల—మానవతిమణీ! (కన్నీరునించి) నీవెంచినటే కలగు—

కళా—అయ్యో! కన్నీరేలకలిగె? నీమోహమునకు నేనడ్డమురాను. నీమనోహారిణిని నేఁదోఁబుట్టువుగాభావించెద. నీమోహమంతయు నీమెచ్చులాడికొసఁగినను నన్నొకదాసియని యనుగ్రహించిన నంతయేచాలును.

(అనుబంధము 18.)

నీల—భామామణీ! పతివ్రతాతిలకమవని నిన్నునుతికొలుపుటకు నీమాటలు సార్వపథీనములు. నీయట్టిసతీమణి భార్యగాలభించుటకుఁగడుంగడునోఁచియుండవలయుఁజామా! నీమగఁడు. కావుననే నేనీకుఁదగనివాఁడ.

మ॥ అలినీలాలక నీసతీసుచరితంబత్యద్భుతంబయ్యెధీ
ర లలామంబవు నిన్నువంటిలలనా రత్నంబు జేపట్టఁగాఁ
దొలిజన్మంబున దుర్గసీమఁదప మెంతోచేయఁబోలుం జుమీ
యలపుణ్యాత్ముఁడభాగ్యసంగతుఁడ నేనర్హుండఁగానిందుకున్॥

క్రూరాత్ముఁడ. కలుషమానసుఁడ. నను వరింపకుము.

కళా—నీగుణమే నీవాడినమాటలఁ గల్లఁజేయఁజాలు. క్రూరాత్ముఁడిట్లు చెప్పికొనునా?

నీల—కామినీ! నీవిట్లుపట్టుపట్టిన నే నీయూరును నీతండ్రిదాస్యమును మాని యెక్కడికైనఁబోయెద.

కళా—ఇది పరమసమ్మతము—నీవెంట నేనును వచ్చెద.

నీల—హా! దైవమా! భామినీ! ఒకవేళ నేను మోసగాఁడని నీవు గుఱుతెఱిఁగిననట్లు?

కళా—నీమోమునందలి తేజముఁగాంచిన మోసమనునది మూఁడామడ యెడగలుగ నుండఁగలదుగదా?

నీల—అతివా! మోసమెట్లయిననుండనీ. నేను నినుఁగన్నెత్తియైనఁజూడక యాదరింపకున్నఁ బరిణయమాడుటొక్కటితప్ప వేఱుసౌఖ్యము కలుగదే?

కళా—నేవిన్నవింపనా నీకు భార్యననిపించుకొనుటకంటె వేఱభిలాషము నాకులేదని? ఏలయిట్టి విషమపరీక్ష? నేను నీదానఁగాక యింకొక్కరిదానఁగాదు. నీకిదితీఱనిపని.

నీల—ఎలయైనని కన్నులు తెఱచి దుఃఖాంబుధిఁబడి పాతిపోవనెంచెదవే. నిన్నేమనఁగలను?

(అనుబంధము 19.)

కళా—ఎన్నిదుఃఖములకైన నెంతి తిరస్కృతికైననోర్తుఁగాక నాయభిలాషము—నీవు వరించుభాగ్యముగను నభిలాషము—నేమాననను. నీవు నన్నొల్లనినాఁడు ప్రాయోపవేశ మొనర్చి యసువులఁబాసెద. నీపాదములాన నేమనఁజాల. నీవేమిబాస చేయుమన్నను జేయుదాన. ఇదే చేఁజేత నానవెట్టుకొనుదాన. (అని చేయొడ్డఁగా.)

నీల—అతివా! నీయిష్టము. నాపైమాటలేదు. నీయిచ్చ చొప్పున నేకానిమ్ము (పోవఁబోవ.)

[పునః ప్రః చతురవర్మ.]

చతు—(నీలకేతునితో) మాటలాడితివా? నీలకేతుకుమారా!

నీల—మాటలాడితిని. నాయత్నము లేకున్నది.

చతుర—యోచింపకుము. పొమ్ము. (నిష్క్ర.)

శ్రీ

ముక్తావళీనాటకము.

[తృతీయాంకము-అష్టమరంగము.]

కళావతిపడకటిల్లు.

[ప్ర: నీలకేతుఁడు మంచముపైఁ బండుకొని]

ప్రక్కన కళావతి వీణెతో.

కళా— (అనుబంధము 20.)

నీల—(లేచి) కళావతీ వలదన్నను మానక మాదేశపద్ధతి భంగి ననుఁ బాణిగ్రహణం మొనరించితివి. నీసౌఖ్యమింతయేయని యెంచుము.

కళా—ఇంతకంటె వేఱు సౌఖ్యమును నేఁగోరలేదే ?

నీల—చెలువా ! నేఁగడు క్రూరాత్ముఁడసుమా ! అరయలేవైతివి.

కళా—అక్కటా ! నిష్కారణముగా నూరక నిన్ను నీవ యేమిట్లనుకొనియెదు ? ఆహా ! తెలిసెను. అగ్గలంపు మరులు పెంపున నిను నిర్బంధమున సేవరించుట క్రూర కృత్యమని నన్ను దూషించునెపమున నిట్లనుకొనియెదవో ?

నీల—అయ్యో ! అటుగాదు. నిక్కముగా నేవంచకుఁడను.

కళా—కానిమ్ము నీవలననే వంచితకాఁజాలనే-కానే-ఇంకేల ?

నీల—పోనిమ్ము. నీకిపుడేమి కావలయు ?

కళా—

క॥ పాలింతువేనిగోరిక ।
యీలాగొనరింపనీకు హితమేనియు నీ ।
యాలింగనమొక్కటియే ।
చాలుం బ్రాణేశవేఱు చందముగోరక ।

నీకు సమ్మతికాకున్న నీ యాజ్ఞకు మొక్కటియే.

నీల—అదినే నంగీకరింపను.

కళా—భాగ్యము. నీమనసును హరించినయా కేలోక్కవనిత నీకు లభించువఱకునన్నుఁ గైకొనవో? అట్లనే కానిమ్ము. నాతోఁబుట్టు వాయమ యెందున్నదో యానతిచ్చిన-

నీల—అట్లుగాదు.

కళా—కాకున్న భాగ్యము.

నీల—నే దురాత్ముఁడనని తెలిసిన నీవు నన్ను శపింపవోటు?

కళా—ఆమాటనకుము. నీవు దురాత్ముఁడ వేయైన నినుఁబాప పరిశుద్ధముఁజేయ దైవముం బ్రార్థించెద నీయాన నిక్కము.

నీల—కళావతీ! నిన్ను నేనొకవేళ నితరుల వరింపుమన్న నేమిచేసెదవు?

కళా—అక్కటా! నన్నేలయిట్లు పరీక్షించెదవు? నీ యాశయ మేమో తెలియదు. పతివగు నీవు నన్నింకొకని వరింపుమన్న నీయాన నెఱవేర్చిన నాకేపాపమేలకలుగు? అదియేహితమైన నన్నుఁడుగవలెనా?

(అనుబంధము 21)

నీల—ఇపుడు నీవు నాదానవు. ఏది నీయాలింగనమిమ్ము?

కళా—(సంభ్రమమున నీలకేతు నాలింగనముచేసి యాశ్చర్యము భయము నభినయించి వెనుక జరుగును.)

నీల—(స్త్రీరూపముపూని) చెలియలా! ఇపుడు తెలిసెనా? నాదుష్కృత్యము నా మోసము నా చరిత్ర మేమని విన్నవింతు? ఏ శుద్ధమానసమునకు నేనేముపకృతి యొనరింతు? ఈ నా మగఁడు (చిత్రపటముచూపి) నాకు లభించెనేని నిన్నాతని కగ్రమహిషిఁగాఁ జేసెద.

కళా—హా! దైవమా! (మూర్ఛిల్లును).

నీల—సతీమణీ! ఇదియేమి? (ఉపచారములుచేయును).

(అవనికపడును)

తృతీయాంకము.

సమాప్తము.

శ్రీ

ముక్తావళీ నాటకము.

తురీయాఙ్కము-ప్రథమరంగము.

ఒకగది.

[ప్ర: జగంధరుఁడు.]

జగం—ఔరా! నాభాగ్యమసమానము. నీలకేతునిఁజూచినప్పుడంతయు నాకేమేమో సంశయము లుప్పతిల్లుచుండె. ఇప్పుడంతయుఁదెలిసె. ఈతరుణియే ముక్తావళియని తోఁచుచున్నది. అయ్యో! దీనికై నేనెంతశ్రమపడితి.

(అనుబంధము 22.)

సోమశేఖరుఁడెక్కడ నున్నాఁడో? వాఁడొద్దలేకుండుట యొకటి తెలిసెఁగదా. ఎట్లయినను గార్యము సాధింపవచ్చును, తపతీ తీరవాసులు కొందఱు నాతో వాఁడు తెప్పపై నిరువురు సతీపురుషులు పోయినది తొలి జామునఁజూచితిమనియు నా తెప్ప విఱిగి సముద్రమునఁ బడియెననియుఁ జెప్పిరి. అదియే నిక్కవమాయె, అయినను జూతము.

[ప్ర: నీలకేతుఁడు.]

నీల—జగంధరా! రాజ్యాభిషేకము నాకుఁగలిగినందుకు నే బహుమతులిచ్చుచుండ నీ వాబేల వ్రాసితివి? ఏకాంతమున నాతో నేమిమాటలున్నవి? నీకెక్కువ బహుమతులు కావలసియున్న నా స్థానమున నే యడుగరాదా?

జగం—దేవా! నీతోడనే విశేషముగా రెండుగంటలసేపు మాటలాడఁదగియున్నది. ఇప్పుడవకాశము గలుగకున్న మఱియొకప్పుడు కానిమ్ము.

నీల—ఇప్పుడేకాని మ్మేమిమాటలు?

జగం—కూరుచుండవలయు. నాకు మఱేమియు నభిలాషములేదు. నేను జగత్ప్రసిద్ధుఁడనగు చిత్రకారుఁడను. నాకంటె నెక్కువపాండిత్యముగల వాని నేఁజూచియెఱుఁగను. అట్టిది నీయొద్దనున్నట్టున్నది. అదికావలయు.

నీల—ఏదియది?

జగం—నీవునిన్నరాత్రి నీభార్యకుఁజూపఁబోయిన నీముగని చిత్రపటమునేఁ జూడఁగోరెద.

నీల—నాయకుఁడెవరు? చిత్రపటమేది?

జగం—ఏలదాఁచెదవు? సవిస్తరముగాఁ జెప్పెదలెమ్ము. భావచిత్రములు వ్రాయుటలో నా నేర్పు మాకళావతి చిత్రపటములే నిదర్శనములు. కేరళప్రభువునొద్దనున్న నన్నీ పాండ్యరాజుపిలిపించి యీయంతిపురివైపున నాకెడమిచ్చి వ్రాయించుచుండె. ఎందోనీయీడురూపుగల చిత్రము నేఁజూచియుండుటచే నిన్నిందుఁజూచినప్పుడంత యును నామదికిసంశయముకలుగుచుండె. నిన్నరాత్రి నీభార్యతో మాటలాడువేళ నేనాగవాతాయనముకొద్దకు నాకస్మికముగావచ్చియుండి "కళావతీకనుమా నాయకునిపటము" అని నీవువచించినమాటవింటి. అట్లేతిచ్చవడినిలిచితి.

మ॥ ఇదియేలామతిఁగింపఁజూచెదవు నీవృత్తాంతమాద్యంతము ।
న్విదితంబయ్యెనునాదుభాగ్యమునఁ దానీపెండ్లినాఁడేనిశి ।
న్మదనాభోగరతీసతీభ్రమద భామారూపమున్మానినీ ।
కదియేమీపురుష క్రియాపరత కాంతానాకెఱింగింపుమా ॥

నీల—(యోచించి) ఇవన్నియుఁ జెప్పుటవలన నీకేమిఫలము?

జగం—ఫలములేక యొకకార్యముండునా? అపటముఁజూచి నీచరిత్రము వినుటయే ఫలము.

నీల—జగంధరా! రూపముమగరూపము. కార్యమునందును బౌరుషమునకుఁ గొదువగలుగదు. అయినను నావృత్తాంతము నీవడిగినందున నాస్త్రీత్వమంతయుఁ దిరిగివచ్చుచున్నది. నీవన్నమాటసత్యము. నేముక్తాళియనుదానను. ఏమాశ్చర్యపడెదవు? నన్నెఱుఁగుదువా ?

జగం—నామిత్రుఁడు నాగకేతుఁడను రాజకుమారుఁడు నవృత్తాంతమంతయుఁజెప్పియున్నాఁడు. అతఁడు నీకొఱకై మిక్కిలి పరితపించుచున్నవాఁడు. పిచ్చిపట్టినచందమున దేశదేశముదిరుగుచున్నవాఁడు. ఒకసోమశేఖరుఁడనువానికై నాని నవు నిరాశంజేసితివఁట. అయ్యో! ఆనాగకేతుని సురూపమునకు నీకుందగుఁగాక యింకొరులకుందగునా ? అట్టివాని నెంతలయించితివి ?

నీల—జగంధరా !

ఉ॥ పావననాగకేతుని ప్రభాసముపేతునిఁగాంచి తేనిము ।
క్తావళినీకుఁజెల్లెలను మారమణీమణి సోమశేఖరున్ ।
భావమునందుఁదప్పదను మావినుమానసుమానియొంటెడం ।
భావనిచారుఁగాత్రిఁగొను ఘామనుమాయను మాజగంధరా ॥

నీమిత్రునినింకొకసారి నీవుచూచిన నాతనిప్రాణమానసముల నాప్రియుఁడగు సోమశేఖరుని యధీనమొనర్చుదాననని యు నాకొఱకై పరితపింపవలదనియు వచింపుము. ఆనాగకేతుని నేవిని యెఱుఁగుదుఁగాని చూచియెఱుఁగను.

జగం—కావుననే యిట్లాడెదవు. వానిఁజూచియున్న నిట్లందువా?

నీల—ఊరకనాయెదుట నేలప్రశంసచేసెదవు? వాఁడెట్టివాఁడైనను నాజీవితేశుఁడు సోమశేఖరుఁడే.

జగం—ఎందున్నాఁడా సోమశేఖరుఁడు?

నీల—ఆమనోహరునికైకదా యింతపరితపించుచున్నాను? ఎందున్నాఁడో యెందతని దర్శనము గలుగునో యెఱుఁగను.

జగం—తరుణీమణీ! నీకైమనసారఁదపించు నాగకేతునిమానియెందు నెఱుఁగఁబడనివానికై యిట్లేల తపించెదవు?

నీల—మఱియొకసారి యామాటనకుము.

జగం—కానిమ్ము, నాకేమిపట్టినది? ఎట్టివాఁడా సోమశేఖరుఁడు?

నీల—చూడుమీ పటము. (చూపును)

జగం—(ఆశ్చర్యపడును.)

నీల—ఏ మిట్లులికిపడితివి? నీ వీ పురుషవరుని నెఱుఁగుదువా?

జగం—ఎందో చూచినట్లున్నది. జ్ఞాపకమునకు రాదు.

నీల—జగంధరా! నీవు నన్నింతదూరము నాచరిత్రము నడుగుట ధనాశచేఁగాని యితరముగాదు కదా? నీకు వలయునంత ధనమిచ్చెదను. ఈ రాజ్యమే యిమ్మన్న నిచ్చెదను. అనుగ్రహించి జ్ఞాపకమునకుఁ దెచ్చుకొని యా మనోహరుఁ డెందున్నాఁడో చెప్పుమా?

జగం—నేనింకను యోచించి జ్ఞాపకమునకుఁ జేసికొని యూరికిఁబోయివచ్చి విన్నవింతును. అయిన నీ చరిత్రమంతయు విన్నవించిన నట్టివాని నేఁ జూచినపుడు కార్యసాధనము కలిగింతును. (నిష్క్రా)

నీల—అవశ్యము చెప్పెదను. యిప్పుడా స్థానమునకుఁబోయి మరలనింతలోన నేవచ్చెదను.

జగం—ఆ విలాసకుఁడా! సోమశేఖరుఁడు. ఈ తరుణీమణికి నాయం దించుకైన నను రాగములేదు.

ఉ॥ ఈవనితాలలామ నను నింతయుఁగోరదెముంచె నేఁడు న।
న్నీవగసోమశేఖరున కెందునవేఁదులయాదునక్కటా।
భావభవాంగనారుచిర భావముగన్న సతీలలామ ము।
క్తావళీనాకులేదనినఁ బ్రాణములెట్లు భరింతుదైవమా॥

ఆసోమశేఖరునితో శక్తియందుఁగాని రూపమునందుఁగాని నేనుదులఁదూఁగనోపుదునా? దీనిఁబాసి నేజీవింపఁగలనా? ఏమిచేయుదును? యోచింతుఁగాక. (నిష్క్ర.)

శ్రీ

ముక్తావళి నాటకము.

చతుర్థాఙ్కము-ద్వితీయరంగము.

మలయదత్తుని యౌషధశాల.

[ప్ర: నీలకేతుఁడు-మలయదత్తుఁడు.]

నీల—వైద్యచంద్రమా ! నీ యౌషధసంగ్రహము పరమాద్భుత దాయకము. ఎన్ని యమూల్యౌషధములున్నవి ? ఈ యౌషధము లున్నయన్ని జాడ్యములున్నవియా యనిపించు.

మల—ఎన్ని యౌషధములోయున్న నొక జాడ్యము కుదురుట దుస్తరముకదా ?

నీల—ఇదియేమి దీనిపై జీవారిరసమని వ్రాయఁబడియున్నది !

మల—ఇందునసే నా శక్తి వినియోగము దీని నావగింజంత సేవించిన నెట్టి ప్రాణిగాని మూర్ఛిల్లును. కొంతసేపటికిఁ దెలివివచ్చి రెండుమూఁడు గంటలలోఁ జచ్చును. శవముఁ గోసిచూచినను విషమేయుండదు.

నీల—దీనికట్లు నిదర్శనము ? ఎట్లు నీకుఁ దార్కాణపడియె ?

మల—క్షుద్రజంతువులపై వినియోగముఁజేసి చూచితిని.

నీల—ఈ యౌషధ మెందుకు సృజించితివి ?

మల—ప్రాణ మిట్టిదని గుఱుతించు తలంపున.

నీల—గుఱుతించితివా ?

మల—అట్లు గుఱుతించియున్న నీ భార్య జాడ్య మిన్నిదినములు గుదురింపలేక యుంటినా ?

నీల—వైద్యవర్యా ! నాభార్య జాడ్యము నింకేమిచేసెదవు ? నిన్నరాత్రియంతయుఁ బాడిదగ్గు వదలకుండె.

మల—రాజా ! నేను నదియే యోచించుచుంటి. నీ వధిక మనోదార్ఢ్యముగలవాఁడవు. ఏయౌషధమిచ్చినను గుణపడకయున్నది. నీకిష్టమున్న నింకెవ్వరినైనఁ బిలిపింపరాదా?

నీల—అయ్యో! ఈ మాటేల? నీకంటెఁ దెలిసినవాఁడెవ్వఁడు? నే నీ సంవత్సరము నుండి చెప్పుచున్నానే? మనోజాడ్య మేమైనను న్న దానికిఁ జికిత్స చేయరాదా?

మల—ఎన్నఁటికైనఁ గలదా? తాఁ గోరిన సుందరవరుఁడు, నందునను మగవారికైన మోహింపఁగల నీయట్టి కందర్ప సుందరుఁడు, లభించియుండుట నెన్ని మనో జాడ్యము లుండినను వెలిఁజేరవలయుఁగాక లేని మనోజాడ్యము వచ్చునా? ఒకవేళ నీవన్నట్లైయుండినను మనోజాడ్యములకు మందులు వేఱు, నితర జాడ్యములకు మందులు వేఱుగా నుండునా?

నీల—భిషగ్వరా! కన్నులు ముక్కుమాత్ర మేర్పడి శరీరమంతయు నింత శుష్కించి యున్నదే? ఏమైన నాశయుండునా?

(అనుబంధము 23.)

మల—ఊరడిల్లుము చింతిల్లకుము. నేనింకను బ్రయత్నముఁ జేసెద.

నీల—ఐననేఁ బోయివచ్చెద, మఱచితి. ఈ జీవారిరసము నాకింతయిమ్ము నేనునుఁ బరీక్షఁజేసెద.

మల—నను క్షమింపుము. నీకీఁదగనిదొక్కటియు నాకులేదు. అయినను దీనినియ్యను.

నీల—ఏల?

మల—చెప్పుదునా? చెప్పవలయునా?

నీల—నిర్భయముగా.

మల—నీకును గళావతీదేవికినిఁ బ్రాణ సమమయినప్రీతి. ఆమెకో రారాని జాడ్యము వచ్చినది. అట్టివేళ నీయొద్దనిట్టి యౌషధియుండరాదు.

నీల—అట్లైన వలదు మా కళావతికి గుణముగలిగినవెనుకనే యిత్తువఁట లెమ్ము.

(నిష్క్ర—)

మల—నా జీవారిరసము ప్రభావమునంతయు సవిస్తరముని రాకుమారునకుఁజెప్పుదునా? (యోచించి) ఇప్పుడేల? ముందుచూతము. (నిష్క్ర—)

శ్రీ

ముక్తావళీనాటకము.

చతుర్థాంకము-తృతీయరంగము.

కేరళమున నొకసత్రము.

[ప్ర: ఒకబోయయందుఁ బండుకొనియుండును.
తరువాత ప్ర: విలాసకుఁడు.]

విలా—ఏమిది? నేఁడొక్కరైన సత్రమునకువచ్చినట్లులేదు ?

బోయ—హా! ముక్తావళీ! హా! ముక్తావళీ! నిన్నుఁ గన్నకడుపు దగ్ధమగుఁగాక.

విలా—(స్వ) ఇన్నాళ్ళకు వీనులుచల్లఁగ ముక్తావళియను పేరువింటిని. (ప్ర) అయ్యో! నీ వెవరు?

బోయ—నేనెవరైన సౌఖ్యము నీకేమయ్యా? కడుపుగాలి చచ్చుచున్నాను.

విలా—ఏమీ? నీకేమైనది?

బోయ—ఎవరువిని యేమిచేయఁగలరు? నాకొంపకూలె. హా! ముక్తావళీ! హాలాహల హృదయమా!

విలా—అయ్యో! దుఃఖమొకరికిఁజెప్పిన నింతతగ్గుఁగదా? దయచేసిచెప్పుము. ముక్తావళి యెవరు? నీవెవ్వరవు?

బోయ—అయ్యో! నేనొక్కశబరుఁడ. ఐననుఁబెద్దలు సంపాదించినద్రవ్యము కలిమి ధనికుఁడనైయుండుట నక్షరస్థుఁడనైతి. నాపాలిమాలదైవము నను ముక్తావళియను తొత్తువలకువేసె. దానినమ్మి సర్వస్వముం బోఁగొట్టుకొని పాడైతి. తుదకు నన్నది మోసపుచ్చి-అయ్యో! ఎట్లుచెప్పుదును-ఒక మాలవానివెంటఁ బరుగెత్తిపోయెను.

విలా—అయ్యా! ఆముక్తావళి యెవరు?

బోయ—అయ్యో! దానిమాటనమ్మి చెడితినయ్యా! మొదటనే దాని వృత్తాంతము తెలియకపోయె.

విలా—ఇప్పుడేమి తెలిసె ?

(అనుబంధము 24)

బోయ—ఒకటియని రచింతునా ? అది ప్రౌఢయగుటకు ముందే చెడియుండెనట. ఒకరివెంట నూరువిడిచి పరిగెత్తిపోయి వాని వదలి నలుగురు తురకల కేకపత్నియై యుండి వారివదలి నాకొదవినది. అది తాను శుద్ధాత్మక యనియుఁ, జెడకవచ్చిన దాననియు రాజుబిడ్డయనియుఁ జెప్పినమాటలకు మోసపడితిని. అయ్యో! మూఢాత్మా! రాజుబిడ్డయయినది శుద్ధాత్మక యయినది నీయట్టి శబరాధమునకు లభించునాయని తెలియలేవైతివే ? ఛీ ! నీజన్మమేల ?

విలా—(స్వ.) హృదయమా! నెమ్మదిఁగనుము. అయ్యా! ఆముక్తావళి నీతో నే రాజు బిడ్డయని చెప్పెను ?

బోయ—ఏరాజుబిడ్డ యయిన భాగ్యమేమయ్యా ? ఆరాజు గొంతుకోయ. ఆ బిడ్డమంట పెట్ట దానికై జగంధరుఁడను చిత్రకారునకుఁ బదినేలనిష్కములిచ్చి యీ భావ చిత్రము వ్రాయించితినే ? (చిత్రపటము చూపును.)

పావిలా—(దీపముదెచ్చి నాలుగైదుమాఱులు బోయనుపటమును వీక్షించి కన్నీరునించి) దురాత్మా ? నీ వెవ్వఁడవో ఘాతుక బుద్ధిఁజేసి యిట్లు కల్పించితివి. నీవన్నమాట లొక్కటియు నిశ్చయముకాదు. నీ వాడిన యసందర్భ ప్రలాపముల నీవు స్థిరపఱుప కున్న నీ ప్రాణము నిప్పుడు తీయుదును.

చం॥ తెలిసెఁబతివ్రతామణి సతీమణినూరక నిందచేసిన
న్గలఁపఁగవచ్చినాఁడవిటు ఘాతుకమానస యోకిరాతయీ।
కలుష నిదర్శనంబులను గల్గినఁ జూపుము చూపకున్ననీ।
తల పగలించెదన్గలఁగ దంచెద నొంచెదఁ ద్రుంచి చించెదన్ ॥

బోయ—ఏమయ్యా ! నా సుఖదుఃఖముల వినఁగోరి నన్నడిగిన సజ్జనుఁ డని నమ్మి నామనసునంతయు వెలిఁబెట్టితిని.

విలా—నీవు దృష్టాంతములు చెప్పకున్నఁ గొంతుకోయుదును.

బోయ—అయ్యా ! నాసంకటమునకు నేననుభవించుటకంటె దృష్టాంతము వలయునా? అయిననుఁ జూడుము. ఇది యీ ముక్తావళి సోమశేఖరుఁడను దురాత్మునిఁ జెఱనుండి విడిపించిననాఁడు కట్టియున్న చీరకారాగృహరక్షకుల మోసపఱుపనాగయ్యాళి తన తండ్రినుండి దొంగిలించిన ముద్రాంగుళీయక మిది. (చీర నుంగరము నిచ్చును.)

విలా—హా ! దైవమా ! దురాత్మా ! ఇంతైన నినునమ్మను. వీనినీవేల దొంగిలించి యుండరాదు ? ఇంకొకటిఁ జెప్పుము. ముక్తావళితో నీ వేకాంతగోష్ఠికల వాఁడవు

నిజమైన నాసోమశేఖరుఁడట్టి రూపముఁ గలవాఁడగుటయు నీకుఁ జెప్పియుండవలయుఁ గదా? దానివచింపుము. అదిగాక యా సోమశేఖరుఁడును దానుఁగూడియున్న స్వల్పకాలమున వాఁడు తన్ను ముక్తావళియనుటమాని వేఱొక పేరుపెట్టి కొమ్మనిన పేరును నీకుఁ దెలిసియుండవలయు. దానివచింపుము.

మ॥ తాళలేనునిదర్శనంబు నిదర్శనంబులఁజూపుమో ।
జోలియేటికిఁ జూపుచూపుము చూపుచూపుము చూపఁగాఁ ।
జాలవేనిదె జచ్చితీవిదె చచ్చితీవిదె చచ్చితీవిదె చచ్చితీ ।
జాలిదీఱఁగజంపెదన్నినుఁ జంపెదన్నినుఁ జంపెదన్ ॥

నాకుఁజూడ నీవు మహాపాపుడవై పతివ్రతా తిలకము పేరుచెఱుపఁబూనిన కాలహృదయుఁడవని తోఁచుచున్నది. నేనడిగినది వచించితివా బ్రదికితివి. కాకున్న నిప్పుడే చచ్చితివి.

బోయ— అనఘాధీరవిచార సారతరపుణ్యా నేడునాపాలి పి ।
ల్వనిపేరంటమవౌచువచ్చి కుశలప్రశ్నంబుగావించినా ।
యనుతాపాయతి నాలకించినను సంహారంబుగావించెదే ।
ఘనధర్మాత్ముఁడ వింకనన్విడు నమస్కారంబు గావించెదన్ ॥

పుణ్యాత్మా! పిలువని పేరంటమవై నాయెడకేతెంచి నాపాలిపగ దాయవైతివి. జారిణులగు స్త్రీలోకవిటుని మర్మము మఱియొకరికిఁజెప్పుదురా? ఒకనాఁడు తతాంతమైయున్న సంతోషపువేళ సోమశేఖరుని రూపవర్ణము మాత్రము వచించె. దానిపై నీ కీయభిమానమేటికో యెఱుఁగను. నీవు లిఖితదృష్టాంతము లడుగునట్లున్నది. ఇంక నన్నడిగితివా నీకు గురువునాజ్ఞకలదు. సింగము గఱచిన యంశమూలముగల వానిరూప విభవ మీ చిత్రపటమే తెలుపఁజాలదా? (పటమిచ్చును).

విలా— పేరుచెప్పుము-పేరుచెప్పుము. ఆసోమశేఖరుఁడిడిన క్రొత్తపేరు-చెప్పుము-చెప్పుము. చెప్పకున్నఁగొంతుపట్టు.

బోయ— అయ్యో-అయ్యో-మంజువాణి-మంజువాణి.

విలా— హా! శ్రీహరీ! (మూర్ఛిల్లును).

(అనుబంధము 25.)

బోయ— దురాత్మా! పడిపొమ్ము. ఆముక్తావళితో దానిమగని గుఱించుటకని మాసపుచ్చి యీయంతరంగ మర్మములన్నియుఁ దెలిసికొని యున్నందున బ్రదుకు తెఱవయ్యె-అయ్యో! యీపాపాత్ముఁడు నాగొంతెంతగాఁ బిసికెను? ఆపురుష

కాంతపైనాకున్న మోహామతిమేలము. వీరిరువురకు మనసుచెడినదాని సులభముగ సాధింపవచ్చును.

విలా—(లేచి) పాపాత్మా! శబరాధమా! (బోయపైఁబోవు.)

బోయ—(పరుగెత్తును).

విలా—హా! దైవమా! నన్నీగతికిఁ దెచ్చితివా? ఇక్కడికి నీకార్పణ్యమంతయుఁ దీఱెనా? హృదయమున దావాగ్ని నెక్కొనియె. తలపై నశనిపాతమయ్యె. మృతపితృకుఁడనై బందీకృత పితృవ్యుఁడనై, విభ్రష్టరాజ్యస్వీకుఁడనై, అవిదిత మిత్రబాంధవుఁడనై, విఖండితాశుఁడనై నేనేల ప్రాణములధరించితి? ఆముక్తావళికైకదా? ఎవ్వరినిఁ దలఁపుగొనక యీయెడకుఁ బోవలయునను నిచ్ఛలేక దేశమంతయు నేనేలవెదక సాగితి? ఆముక్తావళికైకదా? దినమొక యేడుగానున్నను నాముక్తావళి నాకులభించునను నాశమాత్రముగలుగ గతవర్షములు దినములుగా భావించి ననుముంచి ప్రాణముహరింప నెంచిన నీదుఃఖసాగరము నొంటిచే నీఁతందరింపలేకున్నను, గట్టుచేరఁజాలకున్నను తదవతరణ మెట్టికార్యమో యెట్టిమాటయో యనునిరాశజనించినను, మునుఁగఁజాలక వెలికిఁ దలఁజూపఁజాలక సర్వసంకటముల ననుభవించి మ్రింగరాక మ్రింగితినే? ఆముక్తావళికైకదా? ఇదంతయు నిట్లగుటకా? అకటా! నేనేభంగి ప్రాణముల భరించువాఁడ? ఎవరియాసఁగొని పృథివిపైనుండఁగలవాఁడ? ఏయాసఁగొన మున నీజాడ్యము హరించుకొనువాఁడ? ముక్తావళీ! ననుఁజెఱనుండి దప్పించిన దిట్లొనర్చుటకా? నీవు శబరచండాలుల పాలగుదువని స్వప్నముననైనఁ దలంచియుంటినా? సోమశేఖరా! ఇట్లే దగ్ధుఁడవైపొమ్ము (పటముగాల్చి) ఈసోమశేఖరుని పాలికి మృత్యుదేవతవగు ముక్తావళీ! నీవును నీశేషము నిట్లేపొందు. (చీరనుగాల్చి)

(అనుబంధము 26.)

హా! నిర్భరము. ఆపటము నేను దహించినట్లు నన్నిప్పుడెవ్వరైన దహించువారు గలుగరే? ఎట్టియగ్నికైనఁ దాళుకొందుఁగాక యీదావాగ్ని కెట్లోర్చుకొందు? ననుఁజంపువిషము నొసఁగఁగల పుణ్యాత్ములులేరె? ఏవిషమునైన భక్షించి యోర్చుకొందుఁ గాక యీమ్రింగుడుపడని కాలకూటమున కెట్లుతాళుదు?

సీ॥ నాథనామక్రియానవ్యవైఖరిభామ
నన్నాదరించు నంచెంచియుంటి।
కానఁడాయెనెనాదు కష్టవి
ధానంబునా దేవదేవుండునా విభుండు।
నానందభైరవ ప్రారూఢి గలుగ నా
కీయార్యదక్కునం చెంచియుంటి।

సకలేశహననంబునకునైనఁ జాలు నా
శక్తియంతయు నేడు సమసెనకట ।

తే- గీ॥ బిలహరి ప్రాయమయ్యెనా పెంపదెల్ల ।
పొలఁతిలేకుండ నే నెందుఁబోవువాఁడ ।
వెలసెబాళివరాళి బల్ తలఁపుమాలి ।
యీవిరాళి సహింపనేనిందు మౌళి ॥

ముక్తావళీ ! ముక్తావళీ ! నే నేల యింకను జండాలినిఁజేరఁ బిలుచుచున్నాను ? వలదు. వలదు. అయ్యో ! ఎట్లువలదు ? ఏమిసలయు ? ఏమివలను ? ఓపఁజాల. ఈ తాప మాపఁజాల. నా పాపపు మోమొరులకుఁ జూపఁజాల. విలాపముసైపఁజాల. హా ! హా ! చండాలినీ శిలాకఠిన వజ్రకఠిన మానసా! అక్కటా! నేఁదప్పుఁదలఁచితి. మది మది నాముక్తావళి యట్టికార్య మొనర్చునా ? హతభాగ్యుఁడనగు నను వరించి నా వెంటవచ్చినందున నా దౌర్భాగ్యము దానిఁబట్టి ననుఁ బాసిపోవఁజేసిన నా ధరహిత మైయుండిన యా సుందరాంగి సౌందర్యమున మరులుఁజెంది యే దురాత్ముఁడో దాని నిర్బంధమువలనఁ బరిభవించియుండవలయు. అవిధి మూలమునఁ గలిగిన పరిభవమొక కారణముగా దానికిట్టి దుశ్చరితము గత్యంతరము గానని సహజభావమైయుండవచ్చును. దాని పరిభవమునకుఁ బాపాత్ముఁడనగు నేనుగదా కారణము ? ఆకష్టకాలమున నన్నెంత తలఁచుకొనెనో ? తన విధి నెంతదూరెనో? ఎంతపాటు పడియెనోకదా ? ముక్తావళీ ! నీవేమి చేయుదువు ? నేనేమి చేఁయగలను ? మన యిరువురి ఋణమంతయే కలదుసుమా ! నేనెంత పాపకర్ముఁడను ? పుట్టిననాఁటఁగోలె సుఖమన్నమాట యెఱుఁగక యచింత్య కష్టములయవాచ్య దుఃఖములపాలైతి. నా క్రూరంపుఁదలంపు పెంపున జగజ్జేగీయమాన పతివ్రతాలలామ మనిపించుకొని నా యర్ధాంగినిగానున్న లలనాజనవతంసమును శబరచండాలుల పాలగునట్లు చేసితి. తదన్వేషణవ్రతముఁబూని నన్నుఁగాశింకొక్కరుని పరింపనని నాయందబద్ధానురాగమై యాశాలవంబునఁ బ్రాణములఁబాఁయ జాలకనాఁడు నాఁటికి శుష్కించుచున్న యీయంగారశర్మతనూజాతయగు నిందురేఖ నెంతయు నొప్పించితి. దేహయాత్ర గడపకతప్పదు. దుర్మరణము పైె కొన్న నొప్పదు.

(అనుబంధము 27)

[ప్ర: మీననాథుఁడు.]

మీన—(చూచి) హా! సోమశేఖరా ! ఇన్ని దినములకు లభించితివా ? ఈ కేరళరాజ్యమున నున్నావని తెలిసివచ్చినందుకు నింత సత్ఫలము కలిగెనుమా ? నీవెట్లుతప్పించుకొంటివి !

విలా—పిత్రృవ్యా! నన్నెట్లు గుఱుతించితివి? నేనిందుండు టెట్లు తెలిసె? ఆర్యా! ఇట్టికాలమున నానీమంగళాలింగనము నాకుఁ గలుగవలయునా?

మీన—కుమారా! నేనెట్లు తప్పించుకొన్నది యునట్లుండనిమ్ము. ఈ రాజ్యమునసర్వాయుధా భేద్యమైయున్న వనకుంజరము నొక బ్రాహ్మణుఁడు చంపినాఁడనుమాట జగమంతయు నిండియుండ నీ విందున్నాఁడవని నాకు వేఱొకరు చెప్పనలయునా? అదియు నుండనిమ్ము. " ఇట్టికాలముననా " యని నీవాడితివి. అదియేమికాలము? నీ ముక్తావళి యింకను నీకు లభింపలేదో?

విలా—పిత్రృవ్యా! ఆ చండాలిని పేరెత్తకుము.

మీన—తనయా! ఇదియేమిట్టిమాట లాడెదవు?

విలా—ఆర్యా! ఆసంగతినంతయుఁ జెప్పెద నిటురమ్ము.

(నిష్క్ర)

శ్రీ

ముక్తావళి నాటకము.

చతుర్థాఙ్కము-తురీయరంగము.

కళావతి యారోగ్యశాల.

[ప్ర: కళావతి మంచముపైఁ బండి నీలకేతుఁడు ప్రక్కన.]

నీల—కాంతామణీ! నేనెంతచెప్పినను మానక ముష్కరముపట్టి క్రూరాత్మకుఁడగు నా వలన వంచింపఁబడి యీ గతిదెచ్చుకొంటివి. నీయట్టిచెలికత్తె నా కెన్ని జన్మములకు లభింపవలయు? నానాథుఁడు నాకు లభించెనా నిన్నతని యగ్రమహిషిఁగాఁజేసి నీదాసినై వర్తింపవలయునని యుంటి. నీశుద్ధమానసమున కిదియే ప్రతిక్రియగా భావించియుంటి. నాయభిలాషమంతయు వమ్మయ్యె. ఇంతకువచ్చునని యెక్కనాఁడెఱుఁగ నానాథుఁడు నను వెదకికొనుచు నందందుఁదిరుగాడనట్టిచో నేనొక్కఁడనుండక తిరుగాడుచున్నఁ బరస్పరసందర్శనమునకే యాస్పదము గలుగదని యిందేయుండఁగోరి నీ బలవంతమునకుఁ గాదననేరక నామోసము గుఱుతించినను నీవు ప్రాప్తమని యూరడిల్లుదువనియు మన మిరువురము సవతుల మగుటకు నీవు శంకింపవనియు నమ్మి యాకూహక పరిణయమునకు సమ్మతించితిఁ గాక యిట్లవునని తలంపనైతిఁగా? సోదరీ! నీయునికినింకదాఁచి యేమిప్రయోజనము? నీకు మృత్యువాసన్నమైనది. నీతండ్రి పడుసంతాపమున కేమేరమేలేదు. ఇన్నిసంకటములకు నేనుగారణము. నీ చేతికి కరవాలము నిచ్చెద. ననుఖండింపుము.

(అనుబంధము 28)

సోదరీ! యొక్కింత మాటాడుము. నీకింతభంగపాటు కలిగించు నుద్దేశము నాకుండుటయు లేకుండుటయు నా దైవమెఱుఁగు. ఇంతకువచ్చినపిదప నాయునికియేల? నాకింకనాథుఁడేల? నీయట్టిసాధ్వీమతల్లి నాకుఁ దోడులేకున్న నెట్టిసంపదలు నాకే యూరటఁదేఁగలవు? నీగుణగణముల గుఱుతించునప్పుడంతయుఁ బురుషునకుఁగల మోహమునకంటె నెక్కుడగు వ్యామోహము నీయెడ నాకుఁ గలుగు. నా చరిత్రము నంతయు మఱతు. వేషముననున్న భంగి నిక్కంపుఁ బురుషుఁడనేఁ గానైతినేయని తలపోయుదు, ఇంతనిన్ను మోసపఱచి నను వంటిసందున నీవృత్తాంతము నీకుఁగూర్చ

తండ్రికైనఁజెప్పకున్నదానవే. నీయట్టిగుణగరిష్ఠనెందైనం గంటిమే? అట్టి నీవు ననుఁ బాసిపోవ నున్నావు? అక్కరో! నేఁజూడఁజాల. భరియింపఁజాల. నాచరిత్రము దాఁపఁజాల. ఇదెపోయి నీతండ్రితో నున్నయుదంతమంతయు విన్నవింతు. తలమునుకలుగా శోకాంబురాశి మునిఁగియున్న యాతనికిది భరించుట వింతయా? ప్రాణంబుప్రాణమవై సుతునికి మాఱు సకలసంపదలకు మాఱుగానున్న నీయట్టిపుత్రి మృతిఁజెందుట చూడనున్న వాని కీశోకమొక యెక్కువయా? నాకాజ్ఞయిమ్ము. పోయెద.

కళా—(చేయిచాపి నిలిపి) నాథా!

నీల—అక్కటా! ఇన్నిదినములయ్యు నన్ను నాథాయనుట మానవే దీనికెట్లు భరియింతు?

కళా—క్షమింపుము. ఆశబ్దము పూర్ణముగా నాభావమున నిలిచియుండుట నీయునికి యెంత యెఱింగినను నాథాయని పిలుచుటమానను. నీవు స్త్రీవైన నేమి? నీవే నాదైవము, నానాథుఁడవు నాకుఁగలయన్నియు. అదియుండనిమ్ము. దీర్ఘాలోచన మొనరింపుము. నాప్రాప్తికి నీవేమిచేయుదువు? నీతప్పైన నేమి? పెండ్లికి సమ్మతించినఁగదా? నీవు సమ్మతింపకున్న నే బ్రదికయుందునా? పరిణయమైయున్నందున నొకొక్కవేళ నీవు పురుషుఁడవుకావని మదికి గోరంతతోఁచినను నాపతిపై నీవేయనియునది కొఱఁతయని యెంచుట పాతివ్రత్యమునకు భంగమని కటకటపడి యా పాపము గలుగకుండ దైవముఁబ్రార్థించుచు నెడఁబాయని పతిగా నిన్నుఁ జూచుకొనుచు సంతసించుచు నింతవఱకు బ్రదికితినిగాని యటుకాకున్న నాఁడే మోహాతిశయమువలన దుర్మరణము పాలు మునవో మఱియెట్లోకాయముఁబాయుదుమంటి. ఇందున నేమి విశేషము? అదిగాక యిల్లు కాఁగల సంగతినంతయుఁ బరిణయమునకు ముందే నీవు నాకుఁగంఠోక్తిగాఁజెప్పితివి. దానిఁ సరకుగొనక మనఃపూర్తిగ నేనే యందుకు సమ్మతించితి. దీని నీనేరమేమి? నీవు పురుషుఁడవు కాకున్నందున తుచ్ఛమగు ననంగ సుఖము నాకొక్కటి కలుగవయ్యెఁ గాక నీ చెలితనము వదయుటకును, పతివ్రతాధర్మముల నాచరించుటకును నాకేమైనఁ గొఱఁతగలిగెనా? అంత యేటికి? నీవు నిక్కంపుఁబురుషుఁడవై యేదేనికారణమున నన్నాదరింపక నాకు సుఖము గలిగింపకపోయియుండిన నాపతివ్రతాధర్మాచరణమునకు బాధకమేమైనఁ గలుగుచుండెనా?, ఇప్పుడంతకంటె నేమి భేదము? కావున నింకొక్కమాటాడకుము. ఆడిన నాయానగలదు.

(అనుబంధము 29)

మాతండ్రి కీయుదంతము చెప్పినందున నీకైన నాకైన నతనికైన నేమిఫలము? అట్లన్నఁటికిని నొనర్పకుము. ఇది నావిజ్ఞాపనము. నీవిందేయుండుము. తనయావియోగము నఁబొక్కుచుండఁగల మాయయ్య నాతఁడు మనినంతకాల మూరడింపుము. సోమశేఖరుఁడు నీకు లభించిన నిందేయుంచికొని మాయయ్య మృతిఁజెందిన పిదప నాతని వివాహమాడి పట్టముఁ గట్టుము. నీకుఁగొడుకులుఁగలిగిరా వారిలో నొక్కని నాకు సుతుగా నొనర్చి నాపారలౌకిక కరణీయముల నాచరింపఁ బంపుము. ఇంకేమియుఁ

చెప్పఁజాల. ఈమరణకాలమున దైవము నింతమాత్రము ప్రార్థించుదాన. ఈజన్మమున నోచనైతిఁగదా? రాఁగలజన్మమున నైన నాపరమేశుఁడు నీకు పురుషరూపము నిచ్చినన్నుఁ ద్రికరణశుద్ధిగా నీ సతిఁగాఁజేయఁ బ్రార్థించుదానను. ఇంక మాఁడకుము. నాలుగు నిమిషములకంటె మనఁజాల. దైవభజనముఁ జేసెదను. పోయి మాయయ్యను రమ్మనుము.

నీల—(పోవఁబోవ)

కళా—నాథా! పోయెదుగాని నాకొకకడముద్దొసంగుము.

(ఇద్దరు నాలింగనము చేసికొందురు.)

[ప్ర: మలయదత్తుఁడు.]

మల—(నాడిచూచి కూరుచుండును.) రాజా! ఈయమజాడ్యము నాకేమియుఁ దోఁపకుండె. ఇప్పుడు చూచియున్నాఁడ. ఈబిడకు ప్రాణభయములేదని చెప్పవచ్చును. కానియిఁక రెండు మూఁడు దినములలోఁ దెలివివచ్చినామేలు. కాకున్న నంతయుమఱుపుగలిగి యున్మాదము పుట్టవచ్చును. చూచెదముగాక. భయపడకుము.

యవనిక దిగఁజారును.

శ్రీ

ముక్తావళీనాటకము.

పఞ్చమాఙ్కము - ప్రథమరంగము.

నీలకేతునినగరు.

ప్ర: చతురవర్మ, నీలకేతుఁడు (జాబుతో)

చతుర — నీలకేతుకుమారా! ఏఁగీవించెను నీమిత్రునిజాబు.

నీల — మిక్కిలి పొడవుగా వ్రాసియున్నాఁడు. అయినను ముఖ్యాంశములఁజదివెదను. కొన్నికారణములు కలిగియుండుటచేతను, నా ప్రతి పరిపూర్తియు యుండుట వలనను నేనిందులేఖను బరిణయమగుట కొప్పికొనియున్నాను. ఈకార్యమొనరింపుమని నీవు నాకు బలుమారు వ్రాసియున్నను జేయక యిప్పుడు నే నొనరించుట నీకు వింతగాఁ దోఁపవచ్చును. అది ప్రతి విషయముగాని యితరముగాదు. నీ ప్రజ్ఞా విశేషమును, గరుణామహత్వమును నైపుణ్యప్రశంసయు, నీతి కుశలత్వమును, బ్రసంగ వశమున విని నిన్నెప్పుడు చూతుననియు నీ ప్రేమాలింగనము వడయుదు ననియుఁ బరమాపేక్ష గలిగియున్నాను. ఉత్తరప్రత్యుత్తరమువలన మాత్రమేకదా నిన్నుఁజూచి యెఱుఁగుదు? అయినను నీకలాకౌశల్యము నందువలననే తెలిసి యున్నాఁడను. చూడవలయునని మాత్రము కుతూహలము చెందియున్నాను. నాచరిత్రమున నింకను దెలియఁ గదగిన రహస్యములున్నవి. అవి యన్నియు సమక్ష సంవాదమునకు మీఁదు వెట్టి యున్నాను. నా పరిణయమునకు నినురమ్మనియనుటకు నాకు నోరురాదు. ఈసం వత్సరమునుండి నీప్రియము నాప్రియకు నొకటి విడిచిన మేనమామ కూతురునగు కళావతికై యనంత చింతచే నుండువేళ నిట్టికార్యమునకు రమ్మనుటనుచితము. అయినను మిత్రతనూఁది చెప్పవాఁడను. చిరశోకముచేఁ బ్రయోజనములేదు. ఇట్టి సందర్భములు గలిగిన మిత్రసంవాదమూలమున దానిమఱవఁబ్రయత్నింపవలయు.

ఇట్లు,

విలాసకుఁడు.

చతుర — కుమారా! నాకు దయగలుగదని నే జింతిల్ల వచ్చుఁగాక నీకేటి కీయెడలెగని శోకము. పొమ్ము నీమిత్రునివివాహమునకు.

నీల—

సుగంధివృత్తము.

అంతమెందులేని దుర్వ్యథాంబురాశిఁబుత్రికా ।
చింతచేనిరంతరంబుఁ జిక్కిసోలిదూలునీ ।
చెంతనుండి యూరడింపఁజేతఁగాకయున్న దీ ।
పొంతనట్టి నిన్నుమానిపోవనౌనె భూవరా ॥

అయ్యా! నీదండనుండి నిన్నూరడించుట దుస్తరముగానున్నదే. నిను మానిపోవుదునా? నీవు మని నంత కాలము నిన్నువిడిచి—

చతుర— కుమారా! నాకొఱకంతయేల? తనూజుని కంటె నాయెడనీకెక్కువగాఁ బితృభక్తికలుగుట నాకొక్క చింతయు లేదు. నీకొఱకు నేనేవచ్చెదను.

కవిరాజ విరాజితము.

సుతునికి మాఱుగసర్వవిధంబులఁజూచితినన్నునుదారకృపా ।
మతిమతిఁబెండిలియాడఁగనొల్లవు మాటలనాడఁగనొల్లవు స ।
మ్మతిహితమిత్రులతోడనొకప్పుడుమానకయాడఁబల్కుచుమా ।
న్చితిసుతకై కడునేఁబడుశోకమునీబుణమెన్నఁడుదీర్పఁగనౌ ॥

నామఱఁదికేరళరాజు నాకును సకరణముగ జాబు వ్రాసియున్నాఁడు. ఇరువురముంబోవుదము.

నీల—అట్లయిన సంతోషము. ఏమిది నాదక్షిణనేత్రమదురుచున్నది? యెట్టియశుభముగలుగనున్నదో—

చతుర—కుమారా! దక్షిణనేత్రమదిరిన మిక్కిలి శుభము గదా పురుషులకు—?

నీల—ఔను-తోఁచదాయె.

చతుర—ఎన్నఁడువివాహలగ్నము?

నీల—చైత్రశుక్ల సప్తమియనియున్నది. ఇరువది నాల్గుదినములున్నది. ప్రయాణమునకాయితము చేయింతము.

(నిష్క్రమింతురు.)

———

శ్రీ

ముక్తావళీనాటకము.

పఞ్చమాఙ్కము-ద్వితీయరంగము.

[విలాసకుని విడిది.]

విలా—సేవకా! ఆనీలకేతుఁడెట్లున్నాడు? ఎప్పుడువచ్చెదనని చెప్పెనంటివి?

సేవ—విలాసకరాజేంద్రా! ఇదె తలఁచుకొను వేళకే వచ్చెను.

ప్ర: నీలకేతుఁడు.

విలా—రమ్మా! మిత్రమా! (ఆలింగనముచేసుకొనఁబోవ)

నీల—(మానిపి చేతులు పట్టుకొనును.)

విలా—సోదరా! (ఆశ్చర్యమున) నిన్నేకవచనమునఁ బిలువ నాజ్ఞయిమ్ము. నీరూపమెట్లోయున్నట్లు నేనెంచియుంటి. చూచిన నెంత వ్యత్యాసము? మిత్రమా? నీవింకను శోకము మానినట్లులేదు. మఱవవలయు. ఎంతశోకించినను నీకళావతి మరల వచ్చునా?

నీల—(స్వ) ఆహా! ఈ మనోహరుఁడు నామనోహరుఁడే. ఇప్పుడే గాఢాలింగనము పడయుదునా? హృదయమా! తట్టుకొనుము. వ్రత పరిపూర్తియయినట్లు తెలిసె. అదియేమో విచారింతును.

విలా—మిత్రమా! సుఖుఁడ వౌట వచించెదను. ఇదిమాన నీవు ప్రయత్నింపవలయు.

నీల—ఏది మానవలయు?

విలా—అక్లేటికదరిప డెదవు? నీ కళావతిపైఁజింత చేఁగదా నీవిట్లు యోచించుట? నా కాలింగనమైన నీకుండుట? నిను నేను గుఱుతింపలేదని యెంచితివా?

నీల—ఏమిగుఱుతించితివి? (భయమున)

విలా—అయ్యో! ఇంతభ్రాంతియున్న వెట్లుమని యున్నావు? ఉలికిపడిమాటలాడెదవు. ఏమిగుఱుతించినా? తొలుతనిన్నాలింగనముఁ జేసికొనఁబోవవలదను భంగినీవు

హస్తాలింగనము మాత్రమిచ్చిన జాడ తెలియనా? ఇప్పటికిని నీఫాలభాగమున స్వేద ముద్భవించి కటతటములన్నియు నదురమహావేదనము గలిగిన చందము సూచింపు చున్నావు. లభింపఁజాలని పదార్థమునకై వందురిన నేమి ప్రయోజనము? నేమిత్రుఁడఁ గాని నీకన్యుఁడఁగానని నమ్ముము.

(అనుబంధము 30.)

నీల—అంతయేనా? ఇదియే నాపుణ్యమా?

విలా—శక్తిమీఱినది. నీయధీనముగాని నాయధీనముగాని యేమియు లేదు.

నీల—హా! దైవమా!

విలా—అదిగో! మరల నీచింతమానవే? (స్వ) ఎట్లైన మఱవఁజేసెదను. (ప్ర)కుమారా! మీమామయేలయిక్కడికి రాలేదు?

నీల—మామామయెవరు?

విలా—(స్వ) ఇదియసాధ్యము. ఇట్టివాని నేనేలరాఁ గోరితి? (ప్ర) మిత్రమా! కాల దేశముల ననుసరించి పరితాప ముజ్జగింపకున్న విధిలేదు. నీమోహము వలని పరితాపము నేనెఱుఁగనివాఁడఁగాదు. అదినాకుఁ గ్రొత్తదియుఁగాదు.

నీల—నీవును మోహమునఁబరితపించిన వాఁడవా? ఎవరిని మోహించి యుంటివి?

విలా—సచివా? ఆవృత్తాంతమునన్నడుగకుము. సంకటమునకుఁగారణమగు. ఈనాఁడు మనము క్రొత్తఁగా మొదటి సారి నొక్కరి నొకరు చూచికొనుట. కావున—

నీల—అట్లునా?

విలా—"అట్లునా"? ఇదేల యిట్లడిగెదవు? అదియును నీకుఁదెలియని విషయమా? కావున నీ సంకటమునకుఁదోడుగానన్ను సంకటము గుఱిచేయకుము.

నీల—"నీసంకటమునకుఁదోడు నాసంకటము" సంకటము సంకటమే-ఏమిసంకటము?

విలా—నీవునన్ను విడుచునట్లులేదు కావున—

నీల—నీకట్లు తెలియును?

విలా—(స్వ) వీఁడేమి మాటలాడినను నదియేధ్యానముగానున్నాఁడు. ఊరకమాటలు పెంచుట కంటెనీనికిఁజెప్పుట మేలని తోఁచుచున్నది. (ప్ర) మిత్రమా! నేను హత భాగ్యుఁడనై యొకతన్విపై మోహముగలిగి యుండియున్నాళ్ళు పరితపించుచుంటిని. కావునఁజెప్పితిని.

నీల—ఇప్పుడు?

విలా—బుద్ధివచ్చియున్నది. కావుననిందు లేఖంగొనుట తొప్పితిని.

నీల—ఎవరిని మోహించియుంటివి ?

విలా—ఆదుష్కర్మురాలి పేరు నన్నడుగకుము.

నీల—అదియేల దుష్కర్మురాలు ?

విలా—ఆచరిత్రము నన్నడుగకుము.

పద్మనాభవృత్తము॥

ఆరామచారిత్ర మేలావిచారింప నత్యంత తాపంబు గల్గించునా
కుఁ । గారాగృహావాసమాయెఁ మహోపాధిగల్గెంగదా దానిఁగ
న్గొన్న నాఁడే । నా రాజ్యముంబోయె నాసౌఖ్యముల్గూలెనా పిన్నతండ్రిఁ
జెఱంబెట్టనయ్యెఁ । వారాశిపాలైతి రారానిశోకాబ్ధి భంగంబు పాలైతిఁ
బోడైతినయ్యో ॥

ఆచరిత్రము నన్నడుగకుము. దానిను బాసితి. ప్రేముడించు పిన్నతండ్రిం జెఱనుంచితి. ఊరూరుతిరిగి పేరుపోఁగొట్టుకొని నాలుగేండ్లనుండి నన్నే కలవరించుచుఁ గృశయయిపోయియున్న పతివ్రతాతిలకమగు నిందులేఖ కాంతయు నపరాధ మొనరించితి.

నీల—ఆతరుణి యిప్పుడు జీవించియున్నదా ?

విలా—ఎక్కడపాడయియున్నదో నాకేటికాచింత ?

నీల—ఆతనిన్వియపరాధమైన నెయ్యది ?

విలా—అపరాధములన్నియు నాయవియే. అదియేమియు నపరాధ మొనరింపదు. నాకింత దుఃఖముగలుగుటకదియే కారణమనుట చాలదా ? దానిఁజూచి మోహించిననాఁడే రాజ్యముఁబోవ జెఱనునుంపఁబడితి, దానియాలింగనము-ఆపాపపు నాలింగనముగలిగిననాఁడే ప్రాణమునకంటె నెక్కువగు పిన్నతండ్రిం జెఱనునిచి క్షత్రధర్మమంతయు వీటిఁబోవ శత్రువుపురమునుండి దొంగతనమువఁ బాఱిపోయితి. దానిముద్దుగొన్నయపుడే సముద్రమునఁబడితి. దాని తలఁపున్న వేళనంతయుఁజెప్పరాని యిడుమల పాలైతి. ఇట్టిద్రోహిణికిగా నెవరికిఁ గాలిగోటికైన నవి యినకాదో యెవరపేరు వచించినచోట దాని పేరునుడివినఁ జెప్పరానిదైన దూషణపాపము గలుగఁగలదో యట్టి సతీమణినిందులేఖను సంకటములకు గుఱిచేసితి. ఇంకేమికావలయు! (కన్నీరునించును.)

నీల—(కన్నీరునించి) అయ్యో ! నన్నుక్షమింపుము. నీకుఁ గన్నీరు గలుగునట్లొనర్చితి.

మేఘవిస్ఫూర్జితవృత్తము.

బలాత్కారంబంచున్ దలఁపకుమయో పల్కునీమాటలింకన్ ।
విలాపంబింతేలా కలిగెనకటా వెగ్గలంబౌచుమోము ।
న్గళాహీనంబాయెన్గనలకుననున్గన్నులన్నీరు ముక్తా ।
వళింబోలెన్ బాఱన్దలపఁగ మహోపాయ విభ్రాంతిదోఁచెన్ ॥

ధారలుధారలుగా ముక్తావళిఁ బోలె నేటికిఁ గన్నీరు దెచ్చికొనియెదు ?

విలా—"ముక్తావళి" (ఆశ్చర్యమున) ముక్తావళియన్నంగున నీయర్థమేమి ?

నీల—అర్థమేమి ? ముక్తావళియన్న ముత్యముల గుంపనుట నీ వెఱుఁగవా ? ముక్తావళి కంకేమైనఁ జూడఁదగిన యర్థమున్నదా ?

విలా—ఏమో నే నెఱుఁగను.

నీల—నీవూరక యింతవఱకు దాని ద్రోహిణియని యంటివిగాని దాని ద్రోహము వచింపవైతివి.

విలా—అదినన్నడుగకుము నే వచింపఁజాలను. నీవిఁక నన్నడిగిన నాయానగలదు.

నీల—

కం॥ తోయనిధిఁబడఁగరూపము ।
బాయఁగఁదలిదండ్రులనెడఁ బాయఁగనసువు ।
ల్ద్రోయఁగనైనను నొకటికి ।
నీయానకు వెఱచుభంగి నేవెఱపఁగదా ॥

నీయానకు వెఱచుభంగి నేనింకొక్కటికి వెఱవను. కావున మానెడ. మఱియొక్కటి వచింపుము. ఆతరుణియే యిక్కడికి వచ్చిన నీవిప్పుడేమి చేసెదవు ?

విలా—ఏమిచేసెదనా ?

తే॥ గీ॥ దానితలఁగొఱిగించి నెమ్మెనసల్పు ।
పూసిపారకను గొట్టించి రాసభమున ।
నుంచి మాలలఁ జేనుమియించి పురినిఁ ।
ద్రిప్పవలయును నాకసిఁదీఱుకొఱకు ॥

నేఁబడినపాటుల కిసియంతయుఁ దీఱ దానికి క్షురకర్మ చేయించి మోమున మసిపూసి పారకతోఁ గొట్టించి మాలలతో నుమియించి గాడిదపై నూరేగించి.—

నీల—హా! సోమశేఖరా! (కన్నీరునించును.)

విలా—(స్వ) ఏమిది? సోమశేఖరా యనియె. ముక్తావళి యనియె. (ప్ర) మిత్రమా! నీచందము చిత్రముగానున్నది. సోమశేఖరాయని సంబోధించితివే? నీయర్థమేమి?

నీల—సోమశేఖరుఁడు నాదైవము. నాకులస్వామి. నాజీవదాతయని యెంచియుండుట చే సంబోధించితి. తలఁచుకొనవలెనైనరాదా? పేరైననోడుపరాదా? (లేచును.)

విలా—ఏమిలేచితివి? ఏలపోయెదవు?

నీల—అవును పోయెదను. (కన్నీరునించుచు) (నిష్క్ర)

(అనుబంధము 31).

విలా—ఈరాజకుమారుని చందము చోద్యముగానున్నది. ముక్తావళి యనియె. సోమశేఖరాయనియె. ఏమి భావమో? వీనినేనెన్నఁడును జూడకున్నను రూపముచాయ కొంతపరిచయముగా ధ్వని యెందోవినినట్టుగానున్నది. (తలగీరుకొని) ఏమియుఁ దోఁచదు. ఒక్కటి తోఁచుచున్నది. వీఁడును నాముక్తావళితీపులనుభవించినవాఁడు కాఁబోలు. దానికైయిట్లు పరితపించుచున్నాఁడుకాఁబోలు. ఆఅంకులాడిచెప్పియుం డినవారూపములుచాయగుఱుతించినాఁడు కాఁబోలు. నాకుదానిదుశ్చరితముచెప్పిన బోయ యది ప్రౌఢయగుటకుముందే చెడియుండెనని చెప్పఁడా? అట్లు దానిననుభవిం చినవాఁడు వీఁడేకాఁబోలు. సౌరాష్ట్రపురమునఁ గారాగారమున నేనుండినకాలమున వీనిధ్వనివిని రూపముచూచియుంటిఁ గాఁబోలు. వీఁడూ నాకుఁబరమమిత్రుఁడాయె. వీనియెదుట నాకులటా వృత్తాంతము నేనేలదాఁపవలయు? వానివిడిదికేపోయివృత్తాం తము లన్నియుఁజెప్పి వినివచ్చెద.

ప్ర: సేవకుఁడు.

సేవ—రాజచంద్రా! పల్లకివచ్చియున్నది. చతురవర్మ రాజుగారి నాంద్రీవ్రతములకు వేళయయినదనియు నభ్యంజనము చేసికొనవలయుననియు రాజసేవకులు విన్నవించు చున్నారు.

విలా—ఇదేవచ్చెద. (స్వ) అభ్యంజనమయిన పిదప నీలకేతుని యొద్దకుఁ బోయెద.

(నిష్క్ర)

శ్రీ

ముక్తావళీనాటకము.

—:o:—

పఞ్చమాఙ్కము-తృతీయరంగము.

నీలకేతుని విడిది.

ప్ర: నీలకేతుఁడు.

(అనుబంధము 32.)

నీల—ఇదిఫలమా! ఇదిఫలమా? హా! నిర్భరము. ఇన్నిదినములు సంకటములన్నియు ననుభవించి భరించినయాశ నేఁడుపూర్తియయ్యె—పరిపూర్తియయ్యె. కడుపునిండె. నోములన్నియు ఫలించె. మనసున కానందము జనించె. ఇట్లవుటకేకదా నేనిన్ని దినములు జీవించినది? సముద్రమా! నీవెంత పగసాధించితివి? నాకగు కష్టము లన్నియు నీకుఁదెలియకుండెనా? నన్నేల మ్రింగవైతివి? ఒకటికాక రెండుమాఱులు, ఒకదినముగాక నెలదినములు మునిఁగిపోవనుండి నీలోనివసించియుంటినే? ఇన్నియు ననుభవింపుము పొమ్మని నన్ను వెలివేసితివా? అయ్యయో! అక్కటిక మించుకైన లేక కేరళస్థానముదండ నేనున్నయోడనంతయు ముంచితివే? నన్నేల బ్రదికించితివి? ఇప్పుడు నీపగతీఱెనా?

హా! కళావతీ! ప్రియకళావతీ! నినువంచించినందున కిదిఫలమా? ఇదిఫలమా? చేసేతఁ గుడుచుచున్నాను. నిరపరాధినివై యేమియు నెఱుఁగని గోలవై యతిలోకమోహైక దర్శినివైనను నమ్మివంచితవై మృతిఁజెందిన నీయుసురు నన్నూరక పోవ నిచ్చునా? జననీజనకులారా! మిము నుల్లంఘనముచేసి నాపై నత్యంతమోహము నిండారఁ బ్రేమఁబెంచుచు ననుఁగాపాడుచున్న మీతో నొకమాటైనఁ జెప్పక మిము వంచించి దొంగనై వెడలితినే? అయ్యో! ఇదిఫలమా? ఇదిఫలమా?

అయ్యో! నాకిట్టిగతికలుగునని యొకనాఁడుఁ దలంపనైతినే? ఈపాపపు వివాహమునకు వచ్చుబుద్ధి నాకేలకలిగె? వచ్చి నామనోహరు నిందేలచూచితిని? చూడకుండినను నభిలాషచే నాశచే మృతిఁజెందియుండిన క్షేమముగనుండెనే? అట్లుఁగా మనోహరుఁడే మృతిఁజెందెనని నాకుఁ దెలిసియుండినను, నింత దుఃఖము నాకుఁ

గలుగకుండునే? తృప్తిరయ్యె ప్రాణములఁ బాయుచుంటిని. నిర్భాగ్యురాల నౌదుఁగాని యిట్టి హతభాగ్యురాల నౌదునని యూహింపనైతి. "నావిభుఁడు నాకొక్కనాఁడైనఁ జిక్కును. చిక్కినను మక్కువచేయును. నానోము నతికొక్కును" అని యంతరాళమున సౌధములు నిర్మించినభంగి నూహలు సేసికొనుచు సంతసించుచుంటినే? ఎంత యొక్కొకసారి నిరాశకలిగినను లేనియాశలు తెచ్చుకొని నెమ్మది పొందుచుంటినే. ఇదిఫలమా? ఇదిఫలమా?

ఇంతవఱకు నాశయును కోటకట్టుకొని ప్రాణముల నందునివసింపఁజేసి యుంటిఁ గదా? ఆయంతరాళ సౌధములన్నియు నేఁడుకూలిపడియె. ఆకోట నేఁడువ్రక్కలింపఁబడియె. అక్కటా! ఆవిభుఁడు నేనొనర్చిన యపరాధములనైన నుగ్గడించి యుండిన సంతోషమున నతని చరణసన్నిధిఁ బ్రాణములఁ బాయుచుంటినే? నా తప్పే నాకుఁదెలియని గతికలిగెఁ గదా? ఇట్టి దిక్కులేని భంగికలుగునే? నను మోహించినవాఁడుతాఁజెఱవడియెనఁట. కౌఁగిలించినవాఁడు వనధిఁబడియెనఁట. ఇది నానేరమా! తనకంటె నెక్కుడగు దుష్ప్రాప్తి నాకుఁగలుగదో? తలిదండ్రులు కలిగియుండియు లేనిభంగినొనరించుకొంటి. పన్నిటివాకల యందుఁజేరుటకు భీత నగుదానవయ్యుఁ బూర్ణప్రవాహసంచలితతపతీతరణమున కుద్యమించి జలరాశిపాలైతి. రాజపుత్రినయ్యు నీచసేవకుత్సహించితి. ఇదియంతయుఁ బరమభాగ్యమని నేభరింపనా? ఇదిఫలమా? ఇదిఫలమా?

మీననాథా! మీననాథా! నాకొఱకై యెంతప్రయత్నము లొనరించితివి! అభేద్యమగు కారాగృహమునకుఁ బోయి యనన్యసాధ్యుఁడగు నని మేషువంచనం బొనరించి మాకుగా నీవే మనఃపూర్వకముగఁ గారాగృహ నివాసమునకు సమ్మతించి తల పోవునంతటి కార్యమున కియ్యకొను నతిలోకధీర కృత్యమొనరించి తనయయంచు నన్నాదరించి సంతసము జనింపఁజేసితివి. ఇదిఫలమా? ఇదిఫలమా?

అయ్యో! నేనేమి చూచుచున్నాను? ఏమి వినుచున్నాను? అన్నియుఁజూచుచున్నాను. ఒక్కటియుఁ గానరాదు. అన్నియు వినుచున్నాను. ఒక్కటియు వినరాదు. కన్నులారా! మీరింకొక్క పదార్థముఁజూచుట కిచ్ఛయింతురా? మీరిట్లే మూసికొని యేలపోరాదు? చేతులారా? మీరింకేకార్యము చేయఁగలరు? అట్లే యేలపడిపోరాదు? ప్రాణమా? మొండిప్రాణమా! నీకింకే యాశగలదు? ఏల నను వెడలి పోవకున్నావు? అహా! నాతల నిలువదయ్యె. (పెట్టెలోనున్న జీవారిరసముఁదీసి) ఇదే యీవిషయముంగొని యసువులఁబాసెద. (నోటివఱకు గొనిపోయి) చేతులారా! మీకేల యీవణఁకుగలిగె. మానసమా! నీవేల తటతటఁ గొట్టుకొనుచున్నావు?

జీవారిరసమా! నీవేనాయేడుగడ. నీవేనాకష్టములకంత్యము, నీవేనాకుఁదరుణోపాయము. మానభంగ భంగోత్తుంగ చింతాశోకసముద్రమునుండి నన్నుఁదరిఁజేర్చు

తరణిపీవ. అమలయదత్తుఁడను వైద్యునొద్ద నతనిప్రాణము విసికించి పరీక్షింతునను నెపమున మోసపఱచి సంగ్రహించిన యీజీవారిరసము నాకెంత యుపయోగకారి యయ్యెఁ? నామనోహరుఁడు చచ్చెననువార్తవినిన యుత్తరక్షణముననే దీనిసాధించి కృతకృత్యనౌదునని యెంచియుంటి. ఇప్పుడు నాయెంచినభంగి నట్లుగాకున్నను ఫలమునవంతకంటెను గ్రూరకృత్యమాయె. దీనినిప్పుడే భుజించుదానను. (ఎత్తి నోటికడకుఁగొని క్రిందఁబెట్టి) చేతులారా! మీకేల యీవణఁకుగలిగె? ఎల్లప్పుడు సేవాప్రవృత్తిఁజేయుచుఁ బురుషరూపకాంతయైయుండిననుఁదప్పని పతిభావమునొందిన కళావతీ సతీమణిని మనసార స్మశానమున దహించు నగ్నిపెట్టునపుడైన మీకు వణఁకులేదే? ఇప్పుడా కలిగె?—మానసమా! నీవేల తటతటఁగొట్టుకొనుచు డోలాయితమగుచున్నావు? తలిదండ్రులయాజ్ఞఁగొనక వారిఁబాసి వచ్చునపుడైన సముద్రమున దిక్కులేనిభంగిపడి మునుఁగనున్నపుడైన నీకుశంకాతంకము గలుగదే? సమయము వచ్చినపుడు వెనుదీసెదవా? చేతులారా! ఈమానసమునకు మీరైన బుద్ధి చెప్పుఁడు. (మొట్టమొదట ననుభంగపాటొనరింపఁ బాల్పడు పురుషుల బాధలకుం దలఁకి నేఁబురుషవేషముధరింపనెంచి నప్పుడందునకుఁబ్రతిబంధకముగానున్న నాగబ్బిచనుంగవ నట్టెయణంచి కట్టుకొన సమకట్టితిఁగా? అప్పుడును నీదుష్టమానసము తొడిఁబడియె. అయ్యో! నాథుని కరములకానందము గలిగింపనున్న యీయుబ్బుగబ్బిగుబ్బగవనిట్లు రూపుమాపుట తగునాయని వాదులాడె. కాపురుషవేషమున లోకమును వంచింపనైన—ఆమూలమున నొక్కటియు నెఱుఁగని ముద్దులాడి పతివ్రతాతిలకము ప్రాణమునకుఁ గుఠారమెత్తుటకైన నోర్చెఁగాని కుచకలశములనదుముటకోపదయ్యె.) అప్పుడో చేతులారా! మీరే విజృంభించి దానికి బుద్ధిఁగఱపి యామానసమునే యణఁచికట్టి నవలీలనాకార్యము చేసితిరి? ఇప్పుడేల యట్టే బుద్ధిగఱపరాదు? పరాకుమానిరెండు (చేతులనోషధి తీసుకొని)

ఒక్కమాట. దీనిఁదీసికొని నేమృతనైన నేమిసాధించినట్లు? పురుషవేషమున నిన్నాళ్ళుండియు నింతకైనఁ బౌరుషములేకునికిదగునా? నన్నా-సోమశేఖరుఁడేమనియె? క్షౌరము చేయించి—అయ్యో! నాకు వెండ్రుకలు తలనిండ నుండుటఁ జూచి యెవ్వరైన నాపురుషాకృతి సంశయింతురోయను భయమున దానికిఁదప్పఁగారణము సృజింపనేఁ దలిదండ్రులచంద మెఱుఁగునఱకుఁ గేశఖండనమైనఁ గావింపనని ప్రతిజ్ఞపట్టినట్లాడితి. అట్లాడునప్పుడా కేశఖండనమనుమాట యెంతసంకటపడి యెంతపరితాపముఁ జెందియాడితి. అట్టి నన్నిట్లు చేయింతువనేఁగదా? కోరిగించి మోమునమసిపూసి—మాలలచేనుమియించి—ఇవియన్నియు నేలత్రవ్వుకొనవలయు—ఇట్టి భంగికలిగింతువనేఁగదా? నామోహమంతయుఁ దుచ్ఛమొనరించి యిట్లాడిన వానినేమొనరించినట్లయ్యె. ఇంతపగదాయయగువాఁడు నేఁజచ్చుటవినిన నింకను నానందముఁ జెందఁగలఁడుకదా? తొలుత వానినేఁజంపి—రామరామ! ఎంతమాటాడితిని? నేఁజేసినపాపములకెల్ల వన్నెపెట్టినట్లీకార్యము నేనాచేయనెంచితి? అయ్యో!

పతివ్రతా మహోదార తిలకమగు కళావతితో నిన్నిదినములు సహవర్తనము గలిగి యుండియు నిట్టిబుద్ధియా? తొలిజన్మమున నే దంపతులఁబాపఁజేసి యెంతటిపాప మొనర్చి యుంటినో యీజన్మమున ని ట్లనుభవించుచున్నాను. ఈజన్మమున నీ పాపము వలయునా? పరస్పర మోహాతిశయముల వెలయుచు, నేఁడే సకలైహిక సౌఖ్యముల పొందినట్లానందించుచున్న యిందులేఖా సోమశేఖరుల నోటి కడితీసి నట్టులెడఁబాపవలయునా? ఆయిందులేఖ నాసోమశేఖరుఁడౌవల ధరించిన భంగి నీ యిందులేఖ నీసోమశేఖరుఁడు శిరసావహించి సుఖముగనుండనీ. పరమేశా! నా కిట్టిబుద్ధి కలిగినందున రానున్న పాపముల నెల్లఁ బాపుము. తప్పాడితి, తప్పాడితి. ఇంక యోచింపను. భక్షణముఁజేసెదను. (మందుచేఁబట్టి).

మఱచితి, నాచరిత్రము నెఱిఁగినవా రొక్కరును లేరు. కావున దానినంతయు వ్రాసియుంచి పిదప మృతనయ్యెద. (కాగితము లేఖినియుఁదీసికొని)

అక్కటా! అంధకార సదృశమగు నాచరిత్రము నిట్టివెలుఁగున వ్రాయఁజాల. వ్రాయుచున్నదిచూచి యోర్వఁజాల, నాకన్నుల నేనమ్మఁజాల, నన్ను నేవిశ్వసింపఁజాల, చీఁకటింటనే వ్రాసెదను (లోనికిపోవును)

ప్ర: విలాసకుఁడు.

విలా—ఇందునునీలకేతుఁడు లేకున్నాఁడు. లోపలనున్నాఁడని చెప్పిరి. ఇందుఁగూర్చుండి యున్నట్లున్నది. వచ్చునుగాఁబోలు. ఇందే కూర్చుండెద. ఆహా! ఏమోమంచివాసన వచ్చుచున్నది. ఎన్నఁడు నిట్టిసువాసనగానను. పుష్పాదులవాసనగాదు. (వెదకి వెదకి) ఆహా! ఈసంపుటమునుండియే యీవాసన వచ్చుచున్నది. ఇదియేదోలేహ్యమువలెనున్నది. (తీసికొని) ఏ మపురూపమగువాసన? దీనిరుచియెట్లుండునో? నీలకేతుఁడువచ్చిన నడిగి భుజింతును. ఎంతసేపునకురాలేదు. ఇంతయున్నదే? ఒక్కింత రుచిచూచిన తక్కువగునా? నీలకేతుఁడు వలదనునా? (రుచిచూచి) ఆహా! ఎంతమధురముగానున్నది? లేహ్యమింతమధురము నే నెన్నండును జూడను. ఏమిది? తలతిరుగుచున్నది? కడుపునఁజేయిపెట్టి కలచినట్లున్నది? అయ్యో! ఇదేమి లేహ్యము? హా! హా! (మూర్ఛిల్లును)

(అనుబంధము ౩౨.)

పునః ప్ర: నీలకేతుఁడు.

నీల—ఆహా! ఈసోమశేఖరుఁడిందిట్లుపండుకొని యున్నాఁడు? అయ్యో! ఈయోషధి యితని చేతి కెట్లువచ్చె? తినియున్నాఁడే? ఏమిగతి? ఏదితెఱఁగు? అక్కటా! నాకెట్లునుఁబ్రాప్తిలేదుకదా? ఆ యింగులేఖ ప్రాప్తియునింతయేనా? ఈమహానీయుఁడెంత నను నోనాడినను నామోహము తగ్గకున్నది. మోహమా! ఇదిఘోర మోహము.

(అనుబంధము 34.)

ప్ర: జగంధరుఁడు ప్రవేశ్యన.

ఇపుడు విషభక్షణముఁజేసి యింకొ క్కొటు గడియలకుఁజావనున్నాఁడు.

జగం——(స్వ) ఆహా! ఈతరుణియే వీనికి విషమిడియున్నదా ?

నీల——ఎంతవిషాహారమునఁ జావనైనను మోముముద్దుగాఁటుటకు లోపములేకున్నదే? మనోహరా! నీకును నాకు నింతయే భాగ్యము సుమా!

సీ॥ ఆభోగిపరఫణాయతము నీపేరురం
బున గూర్చుభాగ్యంబు మొనయనైతి ।
కల్యాణియనినీవు కడుముదంబునఁబిల్వ
వినుభాగ్యమింతైన నెనయనైతి ।
పటునాదుప్రణయమా నాటకురంజిల్లు
నిన్నుముద్దాడంగ నేరనైతి ।
భైరవంబైన యీభంగినుండఁగ నిన్నుఁ
జూచుభాగ్యమునకే నోచియుంటి ।

తే॥ గీ॥ పాతకంబేగడనచేసి పాడుపడితిఁ ।
బూర్వభవమునమూరక పోవఁగలదె ।
తోడినీడగనినుఁగూడి యాడలేని ।
కలుషవతినాకు దక్కంగ గలవెనాథ ॥

తెలివినున్న నీవునాకియ్యని ముద్దు నే నిప్పుడైనఁగైకొందునా? ఆహా! మానఁజాలను. (ముద్దిడికొని) అక్కటకటా! ఇట్టి భయంకరమాధుర్యమెందైనగంటిమే? మనోరమణా! నీకుఁబ్రాణదానమిచ్చుట కళ్వినులైన నేరరుగదా? నేనుమాత్రము నినుఁబాసిజీవించి యుందునని నమ్మకుము. అయ్యో! నను దుఃఖాంబుధి పాలుచేసినను, నీ యిందులేశమైన సుఖమొసంగఁ జాలవైతివే? అయ్యో! ఈదుఃఖము నేనెట్లు తాళుదు? నాకేల యీకన్నీరు కలుగుచున్నది? ఇవిక్రూరాశ్రువులుగదా?

జగం——కామిని——చూచితివిగదా! నీసోమశేఖరుఁడెట్టిఁవాడాయెను? ఇట్టివాని నీవు పరదైవమంచు నమ్మినీకై పరితపించుచున్న నాగకేతునిఁ గన్నెత్తియయినఁజూడవైతివి. ఇదిపాడియగునా?

నీల——జగంధరా! ఇట్లాడుటకా నీ విందువచ్చినది? ఇప్పుడా నీవు నానాథుని గుఱుతించిన చందము చెప్పవచ్చినది?

జగం—భామామణీ! దీర్ఘముగా మాటలాడుట కవకాశము లేదు. ఇంత తెలిసి యయి న నిప్పుడయిన నా నాగకేతుని ననుగ్రహింతువా? అతని నిప్పుడే పిలుచుకొని వచ్చెదను.

నీల—ఛీ! దురాత్మా! తొలఁగిపొమ్ము.

తే॥ గీ॥ ఔరయిది సమయంబె దురాత్మ నీకు।
నాగకేతుని వర్ణింప నానలేదె।
నీకునీనాగకేతుండు నీరరాశి।
గుండుమెడగట్టి పడిచావఁబోండు నేఁడు॥

నీనాగకేతుఁడును నీవును సముద్రమునఁబడుఁడు.

జగం—అతివా! ఇంకొరకమాటలేల? నీచరిత్రమంతయు విశదమయ్యె. పురుషవేష మున లోకమునంతయు వంచించితివి. కళావతిని మోసపుచ్చి చంపితివి. ఈరాకు మారు సోమశేఖరు విషమిడి పొలియించితివి. ఈవృత్తాంతములు నేఁదప్ప నితరు లె ఱుంగరు. నీప్రాణము నాచేనున్నది. ఇసుమంత వెలిపెట్టితినా? నీవేమగుటయు నీవె యెఱుఁగుదువు. ఇప్పుడైనఁజెప్పుము. దీనినంతయు బయలుపెట్టక నాహృదయపేటిక లోననే దాఁచిబీగము వేసికొని యుండుట నీవానాగకేతునిఁ బెండ్లి యాడుటకు సమ్మతించుటయను కార్యమునకుఁ బ్రత్యుపకారకరణముగా నుండఁగలదు కాని—

(అనుబంధము 35.)

నీల—(జగంధరునిఁ బట్టి పడవేసి) క్రూరాత్మకా! ద్రోహీ! నీవేలదిని వెలిఁబెట్టవలయు? నీపని నేనేయొనరింతును. (గట్టిగా) ఓపురజనులారా! ఓపుణ్యాత్ములారా! దారిఁ బోవునోమహాశయులారా! వినుఁడు వినుండు నేఁక్రూరమానసను. కళావతిని మోస పుచ్చిదాని చావునకుఁగారణమైనదానను. ఈసోమశేఖరు విషయోగమున వధించు టకుఁగారణభూతను. రండు, రండు. చూడుఁడు, చూడుఁడు.

ప్ర: చతురవర్మ అంగారశర్మ, మీననాథుఁడు, (శీఘ్రగమనమున.)

అందఱు—ఏమి? ఏమి? ఏమి?

నీల—ఈరాకుమారుఁడు సోమశేఖరుఁడను భూపాలరాజు కుమారుఁడు. ముక్తావళియ ను ఘూర్జరరాజుతనయను మోహించియుండె. వారిరువురి చరిత్రము దీనిఁజూచిన విశ దమగు (కాగితమిచ్చును.)

అంగార—(చదివి) ఎవరాముక్తావళి? ఎవ్వరది?

నీల—ఈహతభాగ్యురాలే యాముక్తావళి. (స్త్రీయగు)

చతుర—హా! హా! దైవమా! (మూర్ఛిల్లును)

అంగార—వైద్యులఁబిలిపింపుఁడు.

(అనుబంధము 36.)

ముక్తా—ఈమనోహరుని మోహించినందుకు ఫలముగానితనియాలింగన సుఖమొకసారి గంటి. భోగమెఱుఁగగదా? భుక్తశేషభోజనమును నెఱుఁగ. అది యిప్పుడులభింపఁ గలదు. ఇదియేభుక్తశేషము. (అనిజీవారిరసముదిని మూర్ఛిల్లును.)

విలాస—(లేచి) ఏమీకలకలము? పితృవ్యా! ఇదియేమి?

అందఱు—(ఏడ్చుచు) కుమారా! ఈచరిత్రము చదువుకొనుము (చరిత్రమునిత్తురు.)

విలా—(చదివి) అయ్యో! ఎంతపాపాత్ముఁడను? శ్రీహరీమలయదత్తుని జీవారిరసము ప్రభావము జగద్విదితమైయున్నది. దానికింకఁ బ్రతిక్రియలేదు. పితృవ్యా! నాప్రాప్తి యిట్లున్నది. (నాగకేతుఁజూచి) అయ్యా! నీవేల యిందువచ్చితివి? నీవునన్నా నాఁడుచూచిన బోయవుగదా?

అంగా—అయ్యా! ఇతఁడు బోయగాఁడు. నారాజ్యముననున్న జగంధరుఁడను చిత్రకారుఁడు.

విలా—ఆనాఁడు బోయవేషమేలధరించితివి?

జగం—నీకువిషయోగమునఁ గన్నులకుఁజాంచల్యము గలిగియున్నది. నేనెన్నఁడు బోయనైయుంటి?

మీన—(చూచి) కాఁడు. కాఁడు. వీఁడునాగకేతుఁడను రాజపుత్రుఁడు. సౌరాష్ట్రపురి కారాగృహముననాఁడుచూచియుంటి. ముక్తావళిపై మోహమునఁబరితపించుచుండెను.

విలా—అట్లనా? పితృవ్యా! నాకొక బోయ యావృత్తాంతము చెప్పెనని యంటినే. వాఁడేవీఁడు.

మీన—దురాత్మా! ఇప్పుడు తెలిసెను. వృత్తాంతము చెప్పుము. చెప్పకున్న.—

జగం—ఇంకనాకేల? చెప్పెదలెండు. నేనునాగకేతుఁడగుట నిశ్చయమే, బోయనగుటయు నిశ్చయమే, ముక్తావళిని మోహించియుండుటయు నిశ్చయమే. ఇంకమీరేమనుకొన్ననది యంతయు నిశ్చయమే?

విలా—నీవునాతో నాఁడన్నమాటలన్నియుఁ గల్లలా?

నాగ—శుద్ధాబద్ధములు.

మ॥ ఇఁకమీకేటికిఁ దావఁగావలయునే నేనాగకేతుండ నిం ।
దకునెల్లన్మతిపాత్రభూతుఁడఁబ్రమోదంబార ముక్తావళీ ।
వికచాబ్జాత ముఖిన్వరించినమనో భీష్టంబునన్ దానిపా ।
ణికిఁగానింత యొనర్చితిన్మదము నిండెన్ జాలు నేఁబోయెదన్ ॥

మీన—తే॥ గీ॥ ఛీ! జగద్ద్రోహిపాపాత్మ సిగ్గులేక ।
పోవఁజూచెదెయింత దుర్బుద్ధిగలదె ।
యీసతీమణిపాణికై యాసఁగొంటి ।
నిదియెపాణిగ్రహంబు నీకిత్తుఁగొమ్ము ॥—

పొడుచును.

నాగ—అయ్యో! అయ్యో! (క్రిందఁబడిచచ్చును.)

విలా—హా! దైవమా! నాయట్టి పాపాత్ముఁడెందైన వినఁబడెనే?

ముక్తా—(మేలుకాంచును).

సోమ—ముక్తావళీ! నీశుద్ధమానసమింతైన గుఱుతింపనైతిఁగదా? జగంధరుఁడను చిత్రకారుఁడైయుండిన యీనాగకేతుఁడు ప్రోయవేషమున నాతో నెప్పు లేని నిందలు మోపెట్టి దృష్టాంతములన్నియుఁ జూపఁగా నీపైఁ బగపట్టి యింతకార్య మొనర్చితి. నేఁగృతఘ్నుఁడ. క్రూరాత్మకుఁడ. మలయధ్వజుని జీవారి రస మమోఘమగుట జగమంతయు నెఱుఁగు. ఎట్లును జావనున్నారము. నాసర్వాపరాధములు క్షమించితినని నీవభయమిచ్చిన నిశ్చింతముగాఁ జచ్చువాఁడసుమా!

(అనుబంధము 36.)

(అని కాళ్ళపైఁబడును)

ముక్తా—(లేవనెత్తి) నాథా! నీయెడ నపరాధముండునా?

మీన—హా! ముక్తావళీ! (మూర్ఛిల్లును)

విలా—హా! జనకా! మీననాథా! (ఏడ్చును)

సోమ—అయిన నన్ను క్షమించితివా? కడమాట యభేదముగ నాకాలింగన సౌఖ్యము నిచ్చెదవా?

ముక్తా—నాథా! నాపుణ్యమసమానము. నేఁజచ్చుటకు ముందొక్కనాఁడైన నీ ప్రేమాలింగనము వడయవలయునని యభిలాషము నేఁడుపూర్ణమయ్యె. (ఆలింగనముచేసికొని మూర్ఛిలును.)

సోమ—ముక్తావళీ! ముక్తావళీ! (చూచి) హా! ముక్తావళీ! (మూర్ఛిల్లును)

చతుర—(లేచి) హా! కళావతీ! కళావతీ!

(అనుబంధము 37.)

[ప్ర: మలయదత్తుఁడు. వీరసేనుఁడు.]

వీర—వైద్యచంద్రమా! ఇంత యనర్థమైయున్నదే? ఇంక నాగతియేమి?

మలయ—భయపడకుము. నాజీవారిరసమువలన నేకదా వీరి కీప్రాప్తి కలిగియుండుట యని వింటిమి?

[చికిత్సయొనర్పఁగా నందఱు లేచెదరు.]

ముక్తా—అన్నా! వీరసేనా! నీవెప్పుడు వచ్చితివి? (ఆలింగనము చేసికొనును.)

చతుర—మలయదత్తా! ఏమిచిత్రము? నీవెప్పుడు వచ్చితివి? ఎట్లు వచ్చితివి?

మలయ—మహామహులారా! మీరందఱు నేఁడు చింపఁబోవు చరిత్రము మహాద్భుతము. వినుఁడు. నాజీవారి రసప్రభావము జగమంతయు వినియున్నదిగదా? జగమున కంతయుఁ దెలిసె నంతకంటె నొక్కింత యెక్కువకలదు. అవిషయము నేనింకను నెవ్వరితోడను జెప్పియుండలేదు. దానికిదె సాక్షిచూపెదను. (వెలికిఁబోయి కళావతినిఁ బిలుచుకొని వచ్చును.)

అందఱు—(కళావతినిఁజూచి యాశ్చర్యమును భయమునుఁ జెందెదరు.)

మలయ—మీరు భయపడకుఁడు. నిక్కముగ కళావతియేకాని కళావతియొక్క భూతముకాదు. ఈచరిత్రమునంతయు వివరింతును. నాజీవారి రసము మృతికింపకైనఁ దక్కవకాని యవస్థను గలిగించినను మృతిఁగలిగింపదు. నాలుగేను దినములలోపల దానికిఁ బ్రతిక్రియ నొనరించిన ప్రాణములన్నియు వ్యాపించును. అసాధ్యములైన జాడ్యములఁ గుదుర్చుటకు నిట్టియవస్థ కలిగించినఁ గుదురవచ్చునని నాకుఁదోఁచి యీయౌషధము నిర్మించితిఁగాని, నేనొక్కసారియైనను బ్రయోగింపనైతి. కళావతి నిలకేతుల మోహాతిశయము నతిఁగినవాఁడనౌటచేఁ గళావతికిఁ గల జాడ్యమునకై యెంతయుఁ బరితాపము నొందుచుంటి. ఈజీవారి రసప్రయోగము వలననైన నామెజాడ్యము గుదుర్పవలయునని ప్రయత్నమొనరించితి. మీతోడఁ జెప్పిన మీరొడంబడరని నాకుఁదెలిసియె యెట్లునుఁ జచ్చుచున్నదని మీరెఱుఁగుదురు. కనుక మీకుఁ జెప్పకయే నిశ్చయించి యీకళావతి మృతిచెందెనని మీరెం. చినవాఁడాయమశరీరమునకంతయు నగ్నిస్తంభనముగల రసలేపనమొనరించి జీవారి రసమునిచ్చితి. ఈతరుణీమణి చచ్చెనని మీరెంచుకొనిపోయి చితియమర్చి యగ్ని

నిడితిరిగఁజాని అగ్నిస్తంభ నౌషధమువలన నాయమశరీరము దహింపఁబడదయ్యె. ఇంతలో రాత్రియాటచే మీరింటికేతెంచితిరి. నేనంతలో ఘోరాకారము వహించి యక్కడి కావలివారిని బెదరించి పాఱఁదోలి కళావతిని వెలుపటికిఁదీసి నాయింటికిఁ గొనిపోయి చికిత్సయొనర్చితి. ఏ డెనిమిది దినములలో నామెకుఁదెలివిఁ గలిగి యించుక శక్తివచ్చె. ఈనాఁడు మీరెఱిఁగిన ముక్తావళి చరిత్రమంతయు నాయమనోట వింటిని. అద్భుతమాయె. తండ్రిని, గృత్రిమపతినిఁ జూడవలయునని మిక్కిలి యభిలాషమున నన్ను వేఁడినను నేనందున కియ్యకొనక యింటినుండి వెలికి రానియ్యనైతి. ఆయమకుఁ బూర్ణముగ నారోగ్యము గలిగిన పిదప సమయము చూచి మీకొప్పగింపవలయుననియేయుంటి. ఇంతలో సంవత్సరమాయె. మీరీ కేరళపురికి వెడలి వచ్చితిరి. మీరు వెడలివచ్చిననాఁడే ముక్తావళియే నిక్కంపు పురుషుఁడైవచ్చునను భ్రాంతికలిగించు రూపముగల వీరసేన రాజకుమారుఁడయ్యెడ కేతెంచె. నేనును భ్రమించితి అతని సఖ్యము వడసి యతని చరిత్రము నెఱింగితి. అతఁడు ముక్తావళి యన్నయనియు, జగంధరుఁడను చిత్రకారుఁడైయున్న నాగకేతుఁడను రాజకుమారుని వలన ముక్తావళి పాండ్యనగరమున నున్నదనియు నాముక్తావళికి సోమశేఖరునకు వివాహమాజగంధరుఁడు తానేకలిగించి యున్నాఁడనియు నెఱిఁగి ముక్తావళిఁగాంచుటకై యతఁడు పాండ్యపురికి వచ్చెననియు నెఱిఁగితి. మంచి సమయమని యెంచి యిక్కడికిరువురఁ దోడ్తెచ్చితి. వచ్చిన వెంటనే మీచరిత్రము వింటి. ఇంక నాలస్యమేటికి భగవానుననుగ్రహమున మీకీ సంతసమొదవినది. ముక్తావళి నిసోమశేఖరునకు నిందేపరిణయము గావింపవలయు.

(అంపెలు కళావతి నాలింగనముఁ జేసికొని.) కానిండు. కానిండు.

మీన—"తదేవలగ్నం సుదినంతదేవ" (మంత్రము చదువును)

ముక్తా—తాళుఁడు. పతివ్రతాతిలకమగు నిందులేఖవలన మాకీసంతోషమొదవె. ఆయిందులేఖ యీసోమశేఖరున కగ్రమహిషి కావలయు. నేనధివిన్నయై యితని భోగినినయ్యెద.

వివాహములు జరుగును.

మంగళం పాడుదురు.

ముక్తావళి నాటకము సంపూర్ణము.

అనుబంధము. (Appendix)

1. రాగం ధన్యాసి. తాళం రూపకం.

చారు——వింత వినరె మంత్రులార-చింత సేయఁగా ॥ప॥

నింత కావరం బెకలదె-సంత సంబిక. ॥అ॥

సునీ——ధారుణీశవలపదింక-నూరకుండఁగా

ధీర భంగిఁదీర్పవలయు-వైర మొందును. ॥౧॥

2. రాగం-బ్యాగు. తాళం-ఆది.

అందలు——పనమెంతో-ఘనంబయ్యెఁ-వినోదంబై-లతాంగి

ఘనతుంగా-వనీజంబుల్-వినువీధిఁ-గనంబాఱె ॥పల్ల॥

అరుదయ్యెం-గరంబిందు-తరుపాళీ-విలాస

మిరులెందుఁ-గరాళించెఁ-భరమాయె సరోజాక్షీ. ॥౧॥

పగలైనం-దిగంబాఱి-దిగుల్మించెఁ-మదించి

మృగపాళుల్-వగల్మీఱెఁ-నగసీమఁ-వగలాడి. ॥౨॥

3. రాగం-నాదనామక్రియ. తాళం ఆది.

ముక్తా——చెలులా-రానను-గావరే-యో ॥ప॥

ప్రాణసఖులనుచు-నేనెరనమ్మితి

నీనెఱిఁబుణ్యము-చూపరే. ॥౧॥

గాసిలకిదియా-యాసమనకయీ

భాసురాంగునిగరు-ణింపరే. ॥౨॥

4. రాగం-జంఝాటి. తాళం-ఆది.

సోమ——వర-మరాళగ మనా-నీవెవరే ॥ప॥

ధరోద్య దురోజసరోజనేత్రి॥ వర ॥అ॥

వైభవమయ్యె-నీభక్తిఁజూడ

నాభాగ్యదేవత-నీవేనేఁడిందుముఖీ. ॥మ॥ ॥౧॥

మాన్యతమీరె-మహిమముసేరె
ధన్యతచేకూరె-పుణ్యముమీరెవగ. ||౨||

5. రాగం. మోహనకళ్యాణి. తాళం ఆట.

ముక్తా—చూడవేబాలా-మోహనాంగుఁడేడేలేఁడే ||ప||
వాఁడేమాయె. తాళఁజాలనే-లేఁడేరాఁడే. ||అ|| ||౧||

మారసుందరుని-నాకునిచ్చు-వారేలేరే
నాగులారా-మీరువేగమే-పోరేతేరే. ||౨||

6. రాగం కమాజు తాళం ఆది.

సోమ—తగునెయీమాటలాడఁగా-మదిలో
వగవక తెగడఁగనిటు (పల్ల)

కడుకొనియీగతి-కష్టపుమాటల
దుడుకుతనంబున-దొడబడకే-నుడివినవడిఁబోడిచెద ||౧||
నింకొకచోటను-ఘాతుకుఁడయిన
నాయెదుటఁ-బలికినఁ దలఁపఁగలదె ||౨||
దుర్మతినీకీకర్మమేలా-మర్మముచీలదె-దుర్మదాంధా
యెంచక యీలాగేలరా.

7. రాగం-పీలు. తాళం.

ముక్తా—సంతాపమాయెఁ-జాలఁగనాకుఁ
గాంతరోననునెంచి-కరుణింపవే (పల్ల)

శోకాంబురాశి-సారిదిమునిఁగితి-వేకారిదరిఁజేరువిధిగానక-రా
కేందుముఖినా-యాకులగతిదీర్చ్వ-నీకంటెసఖులింకనాకెవ్వరే

8. రాగం-పరాళి. తాళం.

ముక్తా—వేవేగమే-కావవె కరుణించి
భావమునను వేఁడు-త్రోవగాననినన్ను (పల్ల)

కడుదయచేనన్నుఁగావకయుండిన
బడలికననువుల-విడుతునె చారుహాస. ||౧||

9. రాగం-నాదనామక్రియ. తాళం-ఆది.

సోమ—పావనపోషణ-కావవె దేవా
భావముననునిఁ-భక్తినిగొలిచెద|| (పల్ల)

నీరమణీయమ-దారవిందంబులె .
సారెకుఁబాయక-సన్నుతించెదనఁ
జేరికావ-యిటు-కోరితా వా-సము
దారభావ-నా-ప్రారబ్ధ మెటులున్నదో.

10. రాగం-సావేరి. తాళం-ఆట.

సోమ—సంతాపమే-తీఱెను
వింతగునెంతోమది సంతోషముచింతించఁగ|| (పల్ల)

మేనునఁబులకలు-మానుగఁగలిగెడు,
మానసమునఁగడు-నానందముఁజానారెడు|| ||౧||

ఏమనితెలుపుదు-నెంతనిపొగడుదు
నామదిఁప్రేమాయతి-వేమాఱునుగామించఁగ|| ||౨||

11. రాగం-యదుకులకాంభోజి. తాళం-ఆది.

ముక్తా—చేకొనవే-నాథ-నాకా-నందము గలిగె ||ప||
ప్రాకట కరుణా-లోకముగలుగ ||అ||
అరుదుగనిన్నే-నిరతముఁ దలఁచితి
కరుణముక్తావళీ-కాంతనునన్ను. ||౧||

12. రాగం-జంఝూటి. తాళం-ఆది.

సోమ—మనసారనింత సంతసంబుమీఱె-నెకోకిలవాణీ || (పల్ల)
ఘనతాపముదీ-ఱెనుగా-వనజా-తముఖీ|| (అను) ||౧||

ముక్తా—ముదమాయెజాలనింక లేదునాకును-ఖేదము నాథా ॥ (పల్లవి)
మదికింపుగ నీ-యెదనన్-ననుంగాంచుటచే. ॥౨॥

సోమ—అలివేణియీ-వెలలేనిసొం-పులజిల్కు-నీ-బలుసంగతిన్
నేనేకడున్-ధన్యాత్ముఁడన్-నానోములే-జానా రెగా. ॥౩॥

ముక్తా—మననేర్చితి-న్ననుజేశనీ-ఘనసంగతి-న్ననుమెచ్చఁగా
నింతెటికిన్-ప్రాణేశనా-సంతోషమే-నిండారెగా. ॥౪॥

13. రాగం-కాంభోధి. తాళం-ఆది.

చారు—ఏమిది చిత్రమో-యేమియు తెలియదు
నామది కెందుకో-నమ్మిక గలుగదు. ॥౧॥

వారకయీయతి-కారాగృహంబున
కీరీతివచ్చిన-కారణమేమియో. ॥౨॥

14. రాగం-బ్యాగు. తాళం-రూపకం.

చారు—వగనించుచుబో-వగనే-టికి
తగునే-ననుఁబాయఁగనో తనయా॥ (పల్ల)
ఘనభాగ్యము మించినయోసుతా
నినుఁజూడక నే-మనఁగాగలనే. ॥౧॥

15. రాగం-ధన్యాసి. తాళం-రూపకం.

నాగ—క్రూరమైకడుఘోరమాయె నే-నాదారిజూడఁగ
నారినిన్గన్నారఁజూడఁగ-నేగనైతినే-సారసాక్షిరో.
ఎందుకన్నుల విందుగానిను గందునందముగా
ఓసుందరీకడుమంద భాగ్యుఁడముందు నేనిక నెందుబోదును॥౧॥

16. రాగం-బెహాగ్. తాళం-రూపకం.

ముక్తా—సుందరుగనులార నే-జూడనైతి
నేఁజూడనైతిము-ద్దాడనైతి॥ (పల్ల)

అంతయీ క్షణమున-నంతగతిఁబొందెను
ఇంతటిసంతాపము-స్వాంతమునకయ్యె. ॥౧॥

17. రాగం-శంకరాభరణం. తాళం-ఆది.

నాగ—సుందరినివిడిచిచననా-తరమ-భరమా
నారి-గోరి-మేరమీరి-చేరికేరి-క్రూరుఁడౌ
మారుశరంబులఁబూరికి-సారెకుబడలితినిఁక. ॥౧॥

18. రాగం-సావేరి. తాళం-రూపకం.

సోమ—మనగలనే-ఆహా-ఓ
వనితామణినిన్ను-జూడక॥ (పల్ల)
వనరాశిని విధిదూరుచు-నను నెంచుచు నేమైతివో
ఘనవేణీ-సుమపాణీ-కలవాణీ-సునితంబనిరమణీమణి. ॥౧॥

19. రాగం-శంకరాభరణం. తాళం-రూపకం.

చతుర—సారమైగంభీరమారయెగా-నీదారిఁజూడఁగ
భూరిరాజ్యము-తోరహించిన-నారీమణిని-గోరవైతివి. ॥౧॥
ధారుణీశకుమార నీసము-చారవంశమును-ఈదారిసారెకు-
దూరహించదె-కోరిమెచ్చితి-ధీరచరిత. ॥౧॥

20. రాగం-కానడ. తాళం-ఆది.

నీల—రాకేందు వదనా-రమణీ-తగునే
నాకీ-వరుస-నళిన-నయనా॥ (పల్ల)
ఈ-లాగునన్నుఁగోరనీకు బాగుగాదబలా
రాగం బొకటే-రసమా-యశమా.

21. రాగం-ఆనందభైరవి. తాళం-ఆది.

కళా—వర-దినాధిపాంచిత-భావా-నా
మానోజదయగనలేవా॥ (పల్ల)

కాంతా-ఏటికినింత-తీరనివంత-మదగదునాకిబలు
వంత-యెంతయుజింతించితి-సంతాపము-వింతాయెను॥

22. రాగం-ఖమాజు. తాళం-ఆది.

నీల—మానినీమణీ-మానవేలయింత-కానక పలికెదు
పూనియీవిచారమేల-పొగులగ - సుఖమును - గలుగదు-
తగదిక॥ (పల్ల)

కళా—ప్రాణనాయకా-దీనరీతిగలుగ-నేనికబ్రదుకను
మానవేశనిన్ను గాక-మనసునవెపుడును గననగదయితగుల.

నీల—బాలా-తగదీ-పగిది-కడు
బేలవై తిచాలదుఃఖ-లీలలబడియెదు. ॥౧॥

కళా—నాథా-చనవీపలుకుల్-కడు
బాధలేలకల్గుకార్య-సాధకమగుగద. ॥౧॥

23 రాగం. తాళం.

కళా—నా-ప్రాణనాథాయీవే
నాకా-లింగనంబు॥ (పల్ల)
పాలింతువేని నాయాశ
లాలించినన్ను ప్రాణేశ
లోకానీ-కౌగలియీవే.

24. రాగం-బ్యాగు. తాళం-ఆది.

నీలా—భళీకళావతి-భళీరెనీవునాప్రాణపద మోయాలివేణీ॥ (పల్ల)
సతీమణి నాకును-స-ద్ధితంబుచేకూర్చితి
నుతింపఁగారాదె నీదుచరిత-యో
పతివ్రతామణి-రావే-యీవే-లేవే-కౌగిలి. ॥౧॥

25. రాగం-ఖమాజు. తాళం-ఆది,

జగ——నేఁడేకలుగదె-యీడులేనిసుఖము॥ (పల్ల)
వాడవాడచుట్టి-చుట్టినచ్చివేసరితి.
జూడఁగాభోలునీ-చేడెయెముక్తావళీ॥ (అను)
కడకీచోటను-పొడగాననగనయ్యో
బడలితిని నింకనా-భాగ్యమెట్లున్నదో.

26. రాగం-పీలు. తాళం-ఆట.

నీల——సన్నుతించెద-వైద్యచంద్రమా-విన్నపంబుచేకొని
యున్నదేయే మైననాశ-యున్నమాటచెప్పవే॥ (పల్ల)
అర్భకుండనంచు-చూడకు మాతురంబు చూడకు
దుర్భరంబై తోచెనాకా-నిర్భవించెశోకము. ॥౧॥

27. రాగం-కానడ. తాళం-ఆట.

భోయ——మోసమాయె-నాయాసమాయె
వాసిఁజెందిన-పరువంబుపోయె॥ (పల్ల)
దానిమాటలనమ్మి-లేనియాసలజెంది
యానందము భాగ్య-మటుగోలుపోతి. ॥౧॥

28. రాగం-అఠాణ. తాళం-రూపకం.

భోయ——పడిపొమ్ము నీపుపాపీ-యిట్లనె
జడుఁడైన-నీకు నైకదా-యడలించెనన్ను ముక్తావళి॥ (పల్ల)
ఇఁకమోదమాయెనాకు - సకలంబు సాధకంబుగా ప్రకటించు
వాడవెంట నే-శుకవాణినన్నుఁజేపట్టదె. ॥౧॥

29. రాగం-ఖమాజు. తాళం-ఆది.

విలా——నారీ-కోరి-యీరీతిఁజేసితే
రి-వైతే-నాపాలికి మరణమైనరాదాయె॥ (పల్ల)
వైరులకై నమువ-లవదీదుఃఖము
క్రూరకర్మ రాలినయ్యో-జేరికోరిపాపైతి. ॥౧॥

30. రాగం-కమాజ్. తాళం-ఆది.

విలా——మన-పాతలఁపకు-నారులకూరిమి-మనసాతలమకుకొనసాగనిదడి
వననిధిమునిఁగి-దరిజేరఁగజాలవు॥ (పల్ల)
స్నేహముగలుగదు-నిలుకడవెలయదు
మోహమనఁగనున్న-ముద్దులుమిన్న
ద్రోహఁపుచింతయె-శోచనుమదినిండ
దేహమువడిఁదెగ-దీసెదుబౌసలు. ॥౧॥

31. రాగం-నీలాంబరి. తాళం-రూపకం.

నీల——ఏమిపాపకార్యమాయెభామా ॥ (పల్ల)
ప్రేమజూడనేటికింక-కోమలాంగికామినీయిదేమి ॥ (అను)
చింతయేటికింకనన్ను-నంతమొందజేయరాదె
నన్నింతగా-ననంతమై-నవంతపాలు
పరపితి సుందరి నెలకొని. ॥౧॥

32. రాగం-శహాన. తాళం-రూపకం.

కళా——ఈ మాటలెల్లనాథనీ-వేమంచునాడితి
నామీదగోపమూనఁగా-నేమంటివల్లభా॥ (పల్ల)
ప్రాణేశయీమనోవ్యథ-బూనఁగనేటికి
మానవె ఘోరకార్యము-నేనిన్ను వేడద. ॥౧॥

33. రాగం-భ్యాగ్. రూపకము.

విలా——రాకుమారపోలడిట్లు-వ్యాకులింపఁగా
శోకవారాసి-మునిగిపీకమానఁగా.
ఎన్నినాళ్ళుదుఃఖపడిన-నెంచిచూడుమా
సన్నుతాంగినీకుజిక్కు-నున్న దేభువి.

34. రాగం-బిలహరి. రూపకం.

విలా——ఏమికారణమో-నామనంబున-దెలియదుగద-ఇుది ॥ (పల్ల)
భామామణీ (ని)-నామంబనియె-సోమసేఖరుఁడనే.

ఈ కుమారునిబోకజూడఁగ నాకువింతగుజోకదోచెను
ఏకైవడియొ-యీకాతరము-చీకాకుఁజెందెను. ॥౧॥

35. రాగం-నాదనామక్రియ. తాళం-రూపకం.

నీల—ఇదిఫలమాయె. దైవమా-మహోపాయం బయోకలిగె.
విరోధంబీ-గతింజేసి-నిరాశయా-పరిపాటికరాళంబై-నపాటిడి
నించిరాయిడిశేసితేనేడు.

36. రాగం-పీలు. తాళం-ఆట.

విలా—బాలమననున-సంతోషమాయె.
నీలీలవాసన-నేనెందుజూడ ॥ (పల్ల)
అమమాయిదేవదార్థమొలేకయమృతమొ
తమకించెమఁకిదీని-దమినింతతినఁగ.

37. రాగంపీలు. తాళం-ఆది.

నీల—ఇటు-కరాళగతిబోయెదవే-యా-ధరేశనాథ ॥ (పల్ల)
మానసీకై-నేనిలఁబ్రదికితి
ప్రాణేశనన్ను బాసెదవే-యభిమానముమాని. ॥౧॥

38. రాగం-మోహన. తాళం-ఆది.

జగ—కనలేవేకామినీ-కాంచితి సాహసకార్యములెల్ల॥ (పల్ల)
ఈవిధమంతయు-నేవెలిఁబెట్టిన
నీవగయేమగునోవనితా. ॥౧॥

39. రాగం-పీలు. తాళం-ఆది.

[illegible]రిధ నేమీ-వెంటనే-యిదె॥ (పల్ల)
కడు[illegible]నినేలపై-పడియెనునావిభుఁ
డు డుగకయీతని-గడసారిబోడగని. ॥౧॥

40. రాగం-కేదార. తాళం-రూపకం.

సోమ—నను-రమ్మనవే-వర-సమ్మోదముచేకొమ్మని
నెమ్మిన్నారి దయఁగనవే-
ఘనసమ్మదమ్ము నెమ్మనమ్ము-గ్రమ్మఁగా (పల్ల)

మానినీ-నావగ-మానిచి-నీదయ (వేగ)
బూనినసంతోషముగాఁ బ్రాణములనుమానెద. ॥౧॥

41. రాగం-బ్యాగు. తాళ-౦ఆది.

చతుర——అమ్మరోనా-కిమ్మాట-నెమ్మిఁజెప్పలేవైతి.
ఇమ్మేన బ్రాణంబుల-నేనెమ్మాడ్కి- ధరియించెద
నోకొమ్మ నేడు. (పల్ల)
ముందొక్క నాడైననే-బలు-చందమువివరించితే మందొల్ల
నన్నునీమాటనేనరసితి - మందభాగ్యుఁడనే- నెందుబోదుసుం
దరాంగి. ॥౧॥

42. రాగం-పీలు. తాళం-రూపకం.

సోమ——కలదే-మఱివే-ఱిలఁగా-రణము
తొలిజన్మము నందలిపాపముగా-హా-హా. (పల్ల)
అదిరా-గదిరేక-దుదకీ-గతిగా
నిదిప్రాప్తిగదా-గదలం-బొడిచెక-హా-హా.

మంగళము.

ఇంగ్లీషు నోటు.

అందంబొ-శుభనిచయుం
బిందీవర-నయనుఁడుతా
వందారుల్-మోదముగన
వరదయచే నొసగక ॥
డెందంబుల్-ధృఢమగుబల్
చందంబుక-బడిలముగా
జెందించి-శ్రీనాథుక
వందించి-సేవించి
బృందారక-నుతునకునత
మందారున-కఘుహారునకు
నెందుక-గజవరదునకుక
హితగతి-మంగళమనరె ॥ ॥అంద॥

ముక్తావళినాటకము సంపూర్ణము.